
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00 సంపుటి: 10 సంచిక: 307
ఆదివారం 28-1-2018
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | WARANGAL | KHAMMAM | MAHABOOBNAGAR | KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



'నిరుపేదలకు పట్టెడన్నం దొరికేటట్లు చేయడం ప్రభుత్వ ధర్మం, అందుకు ఎన్ని కోట్లు ఖర్చయినా వెనుకాడకూడదు'

SUNDAY Special



భారత్ అద్భుత విజయం

జొహన్నెస్‌బర్గ్ టెస్టులో 63 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు

– స్పోర్ట్స్‌లో



ప్రగ్యకు కంచె?

– ఫ్యామిలీలో

ఐపీఎల్‌లో కోట్లాభిషేకం


బెన్ స్టోక్స్, కేఎల్ రాహుల్, మనీశ్ పాండేలకు భారీ ధర


క్రిస్ గేల్, మలింగను పట్టించుకోని ఫ్రాంచైజీలు

- వివరాలు 16లో



12.50 కోట్లు
బెన్‌స్టోక్స్ రాజస్తాన్ రాయల్స్

9.6 కోట్లు

క్రిస్ లిన్ (కోల్‌కతా)


9.4 కోట్లు

మిచెల్ స్టార్క్ (కోల్‌కతా)

11 కోట్లు

కేఎల్ రాహుల్ (కింగ్స్ ఎలెవన్ పంజాబ్)
మనీశ్ పాండే (సన్‌రైజర్స్ హైదరాబాద్)

9 కోట్లు

గ్లెన్ మాక్స్‌వెల్ (ఢిల్లీ)

9 కోట్లు

రషీద్ ఖాన్ (హైదరాబాద్)

8.8 కోట్లు

కృనాల్ పాండ్యా (ముంబై)

8 కోట్లు

సంజూ శాంసన్ (రాజస్తాన్)

7.8 కోట్లు

కేదార్ జాదవ్ (చెన్నై)

7.6 కోట్లు

అశ్విన్ (పంజాబ్)

అఫ్గాన్‌లో మారణహోమం

95 మంది మృతి

- 151 మందికి గాయాలు
- కాబూల్‌లో తాలిబాన్ ఆత్మాహుతి దాడి
- పేలుడు పదార్థాలతో నింపిన అంబులెన్స్ పేల్చేసిన వైనం
- ఇటీవలి కాలంలో అతిపెద్ద బాంబు పేలుడు ఇదే
- వారం రోజుల వ్యవధిలో రెండో ఉగ్ర దాడి - 5లో

నిరంతర విద్యుత్‌తో నీటి కష్టాలు!

- ఎస్సారెస్పీ ఆయకట్టులో ఎగువన భారీగా నీటి వినియోగం
- కాలువలకు మోటార్లు పెట్టి నీటిని లాగేస్తున్న రైతులు
- మూడు వేలకుపైగా మోటార్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు
- వాటి కారణంగా 800 క్యూసెక్కుల అదనపు వినియోగం
- దీంతో ఎగువ ఆయకట్టు ప్రాంతంలో నిరంతర విద్యుత్ క్రమబద్ధీకరణకు నిర్ణయం
- నీటి విడుదల రోజుల్లో 9 గంటలకు కుదింపు
- మిగతా రోజుల్లో నిరంతర సరఫరాకు యోచన
- ప్రభుత్వ అనుమతి రాగానే అమల్లోకి..



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కాకతీయ కాల్వ నుంచి నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన మోటారు

రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాతో కొత్త చిక్కు వచ్చి పడింది. శ్రీరాంసాగర్ నుంచి విడుదల చేస్తున్న నీరంతా ఆయకట్టు ఎగువనే వినియోగమవుతోంది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటుండడంతో.. రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకుని కాకతీయ కాలువ నుంచి నీటిని తోడుకుంటున్నారు. దీనివల్ల ఆయకట్టు చివరి భూముల దాకా నీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నుంచి నీటి విడుదల సమయంలో ఆయకట్టు ఎగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. నీటిని విడుదల చేసినప్పుడు విద్యుత్ సరఫరాను 9 గంటలకు తగ్గించాలని, మిగతా సమయాల్లో నిరంతరాయంగా సరఫరా చేయాలనుకుంటోంది.

2లో

వచ్చిన వారు.. వెళ్లక మానరు!




- రాష్ట్ర బీజేపీలో వింత కథ.. చేరిన వారంతా కొన్నాళ్లకే వెనక్కి
- ఇతర పార్టీల్లో కీలక నేతలు.. బీజేపీలో చేరాక అనామకులే
- విజయశాంతి నుంచి నాగం దాకా ఎందరో
- రాష్ట్ర నేతల తీరువల్లే ఈ పరిస్థితి అంటున్న సీనియర్లు
- కీలక నేతల మధ్య విభేదాలు, ఆధిపత్య పోరు
- ఈ పరిస్థితిలో ఇతర పార్టీల నేతలు ఎలా ఉంటారని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్

- మర్రి చెన్నారెడ్డి హయాంలో మంత్రివర్గంలో నంబర్–2గా చలామణి అయిన డీకే సమరసింహారెడ్డి.. కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలో చేరారు. కానీ ఏడాది తిరగకుండానే బీజేపీ నుంచి బయటకు వచ్చేశారు.
- తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావుకు సన్నిహితుడైన రాజ్యసభ మాజీ సభ్యుడు మోహన్‌బాబు.. ఎన్టీఆర్ మరణానంతరం బీజేపీలో చేరినా ఎక్కువ కాలం ఇమడలేకపోయారు.
- సినీ రంగం నుంచి రాజకీయ రంగంలోకి వచ్చిన విజయశాంతి.. బీజేపీలో చేరి కొంతకాలం మిగతా 2వ పేజీలో ▶

ఇకనైనా ఆగేనా..

కన్నీళ్ల సాగు



బడ్జెట్ 2018-19

బడ్జెట్ వైపు రైతన్న చూపు...



ఈ రైతు పేరు నగరం గణేశ్. నిజామాబాద్ జిల్లా ఘన్‌పూర్. కంది పప్పు రేటు బాగానే ఉందని తనకున్న రెండెకరాల్లో కంది పంట వేశాడు. ఎకరానికి రూ.9,800 వరకు ఖర్చు చేసి మూడు క్వింటాళ్ల కందులు పండించాడు. తీరా మార్కెట్‌కు తీసుకెళ్తే వ్యాపారులు క్వింటాలుకు రూ.4,200 ధర చెప్పారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి వెళ్తే.. తేమ, తాలు అని కొర్రీలు వేసి కొనడం లేదు. రూ.4,200కు అమ్మితే పంటకు రూ.12,600 వస్తుంది. పెట్టుబడి తీసేస్తే.. మిగిలేది రూ.2,800. అంటే తొమ్మిది నెలల పాటు గణేశ్, ఆయన భార్య కష్టానికి కనీసం రూ.3 వేలు కూడా దక్కడం లేదన్నమాట! క్వింటాలుకు కనీసం రూ.7 వేలైనా ఇస్తే గిట్టుబాటు అవుతుందని గణేశ్ చెబుతున్నాడు. ఇది ఒక్క గణేశ్ వ్యథ కాదు.. కందికి మాత్రమే పరిమితమైన సమస్య కూడా కాదు. లక్షలాది మంది రైతుల గోస. వరి, పత్తి, మిర్చి, పసుపు.. ఇలా ఏ పంట చూసినా అన్నదాతకు మిగిలేది అప్పులు.. కష్టాలు.. కన్నీళ్లే! కాలం కలిసొచ్చినా మార్కెట్ గాలానికి చిక్కేవారు కొందరు.. దళారులు ఆడే జూదంలో ఓడిపోయే వారు ఇంకొందరు. విత్తనం నకిలీ.. ఎరువు నకిలీ.. పురుగు మందులు నకిలీ.. వీటన్నింటితోపాటు చీడపీడలను తట్టుకొని పంట పండిస్తే కనీస మద్దతు ధర కరువు!

?

- ఇన్ని సవాళ్ల నడుమ సాగుతున్న వ్యవసాయ రంగాన్ని కేంద్రం గట్టెక్కిస్తుందా..?
- గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో అయినా రైతన్న కడగండ్లను తుడిచే కార్యాచరణ ప్రకటిస్తుందా..?
- 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ దిశగా అడుగులు వేస్తుందా..? చూద్దాం!!

మొక్క ఎండిందా.. పదవి గోవిందా!

- 75 శాతం మొక్కలు బతక్కపోతే సర్పంచ్ డిస్మిస్
- కొత్త పంచాయతీరాజ్ చట్టంలో ప్రతిపాదనలు: పోచారం

- వివరాలు 2లో

బ్రెజిల్ నైట్‌క్లబ్‌లో కాల్పులు

14 మంది మృతి

- పార్టీలో ఉన్న వారిపై విచ్చలవిడిగా కాల్పులు జరిపిన సాయుధులు

- వివరాలు 5లో

ఎమ్మెల్యే వీరేశాన్ని విచారించాలి



- డీజీపీని కలసి కోరిన టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, నేతలు
- కోమటిరెడ్డి అనుచరుడి హత్య వెనుక ఆయన పాత్ర ఉంది
- చర్యలు తీసుకోకుంటే సీబీఐ విచారణ కోసం పోరాడతాం
- వీరేశం కనుసన్నల్లోనే హత్య: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- తనను చంపేందుకూ కుట్రలు చేస్తున్నారని వ్యాఖ్య

6లో

ఇదంజగత్



ఉగ్రస్థావరాల వైపు వెళ్లకుండా మీ నెత్తిమీదే తిరుగుతోంది సార్!

సాక్షి
రాష్ట్రీయం
నల్లగొండ
ఆదివారం | జనవరి | 28 | 2018

1954 నుంచి ఏటా జనవరి 26న భారత పౌరులకు పద్మ అవార్డులను కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.



ట్రెండు మారినా.. ఫ్రెండు మారునా!

ఒక్క తల్లి సంతానమైన మనలాగ ఉండగలరా..? ఒకరు కాదు మనమిద్దరంటె ఎవరైన నమ్మగలరా.. ఏ పుణ్యం చేశానో నే నీ స్నేహం పొందాను.. నీ చెలిమి రుణం తీరేనా.. ఇది ఓ సినిమాలోని పాట అయినా స్నేహం తియ్యదనాన్ని ఎంత కమ్మగా వివరించారో కదా ఆ కవి..! ఫొటోలో ఉన్న కుక్క పేరు ఇంగో.. ఆ గుడ్లగూబ పేరు పోల్డి.. జాతులు వేరైనా వాటి మధ్య స్నేహం చిగురించింది. ఇవి రెండూ ఒకరిని విడిచి ఒకటి నిమిషమైనా ఉండలేనంత దృఢంగా మారిపోయింది వారి స్నేహం. టాంజా బండిట్ అనే ఫొటోగ్రాఫర్ వీటిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు. జంతు ఫొటోగ్రాఫర్ అయిన బండిట్ ఇంగో.. పోల్డి ఫొటోలను తీసి ఫేస్‌బుక్‌లో పెట్టాడు. దీంతో వారి స్నేహానికి నెటిజన్లు ఫిదా అయిపోయారు.



జుట్టు.. బొమ్మగా మారేట్టు

కాదేదీ కవితకనర్హం అన్నాడు ఓ కవి. దీన్ని ఆదర్శంగా తీసుకున్నాడేమో ఓ కళాకారుడు. వేలాది చిన్న చిన్న వెంట్రుకలను కాన్వాసుగా మలుచుకుని అద్భుతమైన చిత్రరాజాలను రూపొందిస్తున్నాడు కేరళలోని త్రివేండ్రానికి చెందిన మిథున్. ఒక తెల్లటి కాగితంపై వెంట్రుకలను.. చిన్న సూది సాయంతో ఈ బొమ్మలను రూపొందిస్తుంటాడు మిథున్. అంతేకాదు వీటిని గీసేటప్పుడు వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. వాటి తయారీ చూస్తుంటే చాలా సులువే కదా అనిపిస్తుంటుంది కానీ అంత ఈజీ ఏం కాదు అంటున్నాడు మిథున్. అయితే వెంట్రుకలతో బొమ్మలు గీసే ముందు వాటికి కొన్ని రకాల రసాయనాలు పూస్తానని చెబుతున్నాడు. దీంతో బొమ్మలు అనుకున్న విధంగా వస్తాయని పేర్కొంటున్నాడు. బొమ్మ గీయడం అయిపోయాక వాటిని గ్లాస్ ఫ్రేములో బంధించి కలకాలం భద్రపరుచుకుంటాడట.



వానాకాలానికి కల్వకుర్తి పనులు పూర్తి చేయాలి

పనులు చేయని ఏజెన్సీలను తొలగించాలి: మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కల్వకుర్తి ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వచ్చే వానాకాలానికి పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. శనివారం ఇక్కడ జలసౌధలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి పనులను సమీక్షించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దనరెడ్డి ఇటీవల జరిపిన జల విజయయాత్రలో వచ్చిన విజ్ఞప్తులను మంత్రి పరిశీలించారు. 60కి పైగా వచ్చిన ఈ విజ్ఞప్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2016–17లో కల్వకుర్తి కింద 280 చెరువులను నింపగా, ఈ ఏడాది 350 చెరువులను నింపినట్టు అధికారులు తెలిపారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో 120 చెరువులు ఉన్నట్లు చెప్పారు. కల్వకుర్తి కింద మొత్తం ఆయకట్టు 4.25 లక్షల ఎకరాలు ఉండగా.. గతేడాది 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది యాసంగిలో 2 లక్షల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేసినట్టు చెప్పారు. ప్యాకేజీ–29, 30ల్లో మిగిలిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులు వానాకాలానికి పూర్తిచేయాలని ఆదేశించారు.

ఫిబ్రవరిలో ప్రారంభించాల్సిందే

అధికారులు, నిర్మాణ సంస్థకు మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఏళ్లుగా సాగుతున్న కొత్త ఎమ్మెల్యే క్వార్టర్లను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నా ఇంత కాలం ప్రభుత్వం చూసీచూడనట్టు పోవటంతో నిర్మాణ పనులు పడకేశాయి. కొద్దినెలల కింద నిర్మాణ సంస్థ చేతులెత్తేసిందని, మిగిలిన పనులకు మళ్లీ టెండర్లు పిలిచి కొత్త సంస్థకు అప్పగించాలని కూడా రోడ్లు భవనాల శాఖ భావించింది. ఆ తర్వాత ఏమైందో కానీ పాత నిర్మాణ సంస్థనే కొనసాగించాలని నిర్ణయించారు. కాగా, శనివారం అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి వరకు పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

పర్యాటక ప్రాంతాల్లో చేపల వంటకాలు

మంత్రి తలసాని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పర్యాటక ప్రాంతాలు, పార్కులు, జాతీయ రహదారుల వెంట చేప వంటకాలను విక్రయించేందుకు కియోస్కలను ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. అలాగే విజయ డెయిరీ విక్రయాలు పెంచుకోవడానికి రాష్ట్రంలో వెయ్యి డెయిరీ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యాసంస్థలకు విజయ ఉత్పత్తులు సరఫరా జరిగేలా చూడాలన్నారు. శనివారం సచివాలయంలో పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 40 లక్షల గొర్రెలను పంపిణీ చేశామన్నారు. 100 సంచార పశువైద్యశాలలను ప్రారంభించామని, కాల్‌సెంటర్‌కు, ప్రధాన పశువైద్యశాలలకు అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

'బంగారు తెలంగాణ కోసం పాటుపడాలి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గెజిటెడ్ అధికారులు బంగారు తెలంగాణ నిర్మాణానికి ఆహర్నిశలు పాటుపడాలని గెజిటెడ్ అధికారుల సంఘం చైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శనివారం టీజీవో కార్యాలయంలో శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షురాలు మమత చేతుల మీదుగా జిల్లా సమన్వయకర్తలకు నియామక పత్రాలను అందజేశారు. నూతన జిల్లా కేంద్రాల్లో హెచ్‌ఆర్‌ఏ 20 శాతం ఇవ్వాలని, ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రాతిపదికన ఉద్యోగాల తుది కేటాయింపులు చేసి బదిలీలు చేపట్టాలని మమత కోరారు.

నిరంతర విద్యుత్‌తో నీటి కష్టాలు!

ఎస్సారెస్పీ ఆయకట్టులో ఎగువన భారీగా నీటి వినియోగం • కాలువలకు మోటార్లు పెట్టి నీటిని లాగేస్తున్న రైతులు

సాక్షి, హైదరాబాద్:

నిరంతరాయ విద్యుత్ సరఫరా కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీటి గోస తలెత్తింది. కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఎగువ ప్రాంతాల్లోని రైతులు మోటార్లు పెట్టి లాగేస్తుండడంతో దిగువకు నీటి రాక తగ్గిపోయింది. దీనిపై చివరి ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం దృష్టి సారించింది. నీటి విడుదల సమయంలో ఎగువ ఆయకట్టు ప్రాంతాల్లో విద్యుత్‌ను తొమ్మిది గంటలకే పరిమితం చేయాలని యోచిస్తోంది.

ఐదున్నర లక్షల ఎకరాలకు నీరిచ్చే ప్రణాళిక

గతేడాది డిసెంబర్‌లో ఎస్సారెస్పీ, లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ)లలో నీటి నిల్వలకు అనుగుణంగా రబీకి నీరందించే ఆయకట్టును ఖరారు చేశారు. అప్పటికే ఎస్సారెస్పీలో లభ్యతగా ఉన్న 55.16 టీఎంసీలకు తోడు సింగూరు నుంచి మరో 5 టీఎంసీలు విడుదల చేసి.. మొత్తంగా 60.16 టీఎంసీలు వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఇందులో 15 టీఎంసీలను కాకతీయ కాల్వ ద్వారా ఎల్‌ఎండీకి విడుదల చేశారు. మిగతా లభ్యత నీటిలో తాగునీటికి 6.5 టీఎంసీలు పక్కనపెట్టి.. 28.88 టీఎంసీలను ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన 4 లక్షల ఎకరాలకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక ఎల్‌ఎండీ నీటిలో మిషన్ భగీరథకు 6.16 టీఎంసీలు కేటాయించారు. మరో 9.53 టీఎంసీలను డిసెంబర్ 15 నుంచి మార్చి 14 వరకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన 1.6 లక్షల ఎకరాలకు ఇచ్చేలా ప్రణాళిక వేశారు.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కాకతీయ కాల్వ నుంచి నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు

నీరంతా ఎగువనే ఖాళీ..

ఎస్సారెస్పీ నుంచి రోజుకు 6 వేల క్యూసెక్కుల మేర నీటిని వదిలితే... కాకతీయ కాల్వ 68వ కిలోమీటర్ వద్ద ఉన్న తాళ్లపేట, మేడిపల్లి ప్రాంతానికి వచ్చేసరికే 2 వేల క్యూసెక్కులకు తగ్గిపోతుంది. అక్కడి నుంచి దిగువన 116వ కిలోమీటర్ వరకు వెయ్యి క్యూసెక్కుల నీరు కూడా రావడంలేదు. ఇదేమిటని అధికారులు పరిశీలించగా.. రైతులు మోటార్లు పెట్టి కాల్వ నుంచి నీటిని తోడుకుంటున్నట్లు గుర్తించారు. ఎస్సారెస్పీ నుంచి 68వ కిలోమీటర్ వరకు ఏకంగా 2,600 మోటార్లు ఉండగా.. దిగువన మరో 700 మోటార్లు ఉన్నట్లు తేల్చారు. 24 గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో రైతులు భారీగా నీటిని తోడేస్తున్నారని, దీంతో దిగువకు నీటి రాక తగ్గిపోతోందని గుర్తించారు. రోజూ ఈ మోటార్ల ద్వారా సుమారు 800 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నట్లు అంచనా వేశారు.

చివరి భూముల రైతుల్లో గుబులు

ఎగువ నుంచి నీరు సరిగా రాక పోతుండటంతో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి ప్రాంతం (టెయిల్ ఎండ్)లోని.. పెద్దపల్లి, రామగుండం పరిధిలోని డి–83, డి–86 కాల్వలకు, జగిత్యాలలోని కొన్ని ప్రాంతాలకు నీటి కొరత ఏర్పడుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌ఎండీ దిగువన కూడా..

ఎల్‌ఎండీ దిగువన కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ 1.60 లక్షల ఎకరాల ఆయకట్టు కోసం 2,200 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా... దిగువకు వచ్చే సరికి 500 క్యూసెక్కులు కూడా ఉండటం లేదు. కొన్ని చోట్ల చివరి ఆయకట్టు వరకు నీరే రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు, మూడు కిలోమీటర్ల పొడవునా..

ప్రాజెక్టు కుడి, ఎడమ గట్ల పరిధిలోని బాల్కొండ నియోజకవర్గం మెండోరా, తిమ్మాపూర్, ఉప్పలూర్‌లతోపాటు జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. కాల్వల వద్ద మోటార్లు పెట్టి.. రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని పొలాలకు కూడా పైప్‌లైన్లు వేసి నీటిని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

వరి సాగు పెరగడంతో..

ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో 70:30 నిష్పత్తిన వరి, ఆరుతడి పంటలకు నీరివ్వాలని ప్రణాళిక వేశారు. కానీ ఎగువన రైతులంతా వరి సాగుకే మొగ్గు చూపడంతో.. ఈ నిష్పత్తి కాస్తా 85:15గా మారింది. దీంతో ఎగువ నీటి వినియోగం మరింత పెరిగింది.

క్రమబద్ధీకరణకే ప్రభుత్వం మొగ్గు

ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు రైతుల ఆందోళన నేపథ్యంలో 24 గంటల విద్యుత్‌పై నీటి పారుదల శాఖ ఇటీవల సమీక్ష నిర్వహించి.. రైతుల అభిప్రాయాలను తెలుసుకుంది. ఈ మేరకు 24 గంటల విద్యుత్‌ను క్రమబద్ధీకరిస్తే సాగు నీటి విషయంలో ఇబ్బందులు తప్పుతాయన్న యోచనకు వచ్చింది. ముఖ్యంగా ఎస్సారెస్పీ నుంచి దిగువకు నీటిని విడుదల చేసే సమయంలో ఆయకట్టు ఎగువ ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాను 24 గంటల నుంచి 9 గంటలకు పరిమితం చేయాలని నిర్ణయించింది. దీనివల్ల ఎగువన నీటి వినియోగం తగ్గి.. దిగువకు లభ్యత పెరుగుతుందని భావిస్తోంది. అదే నీటి విడుదలను నిలిపేసిన సమయంలో మాత్రం పూర్తిగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని యోచిస్తోంది. దీనిపై నాలుగు రోజుల కింద ప్రయోగాత్మకంగా ప్రధాన కాల్వల పరిధిలో 9 గంటల పాటు విద్యుత్ సరఫరాను తగ్గిస్తే దిగువకు ఏకంగా 400 క్యూసెక్కుల ప్రవాహం పెరిగినట్లుగా గుర్తించారు. దీంతో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని నిర్ణయానికి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ పెద్దల ఆమోదం తర్వాత దీనిని అమలు చేసే అవకాశముంది. దీనికితోడు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలతో కాల్వలపై నిరంతర పర్యవేక్షణ జరిపించాలని నీటి పారుదల శాఖ నిర్ణయించింది.

మార్కెట్లలో తూనికలు-కొలతల శాఖ దాడులు

- 'సాక్షి'కథనంతో స్పందన
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు
- 33 మందిపై కేసులు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: వివిధ సరుకులను తూకం వేయడంలో జరుగుతున్న మోసాలపై తూనికలు–కొలతల శాఖ శనివారం హైదరాబాద్‌లో విస్తృతంగా దాడులు చేసింది. అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేసింది. తూకంలో మోసాలపై 'తూచేస్తున్నారా.. దోచేస్తున్నారా?'శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆ శాఖ అధికారులు స్పందించారు. మూడు బృందాలుగా ఏర్పడి హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, ఎన్టీఆర్ నగర్ మార్కెట్, ఎల్‌బీ నగర్‌లలో తనిఖీలు నిర్వహించారు. కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, తూకంలో మోసం చేసేందుకు రకరకాల పద్ధతులను అనుసరిస్తున్నారని గుర్తించారు. ఇలా అక్రమాలకు పాల్పడుతున్న 33 మందిపై కేసులు నమోదు చేసినట్లు తూనికలు–కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మొక్క ఎండిందా.. సర్పంచి పదవి గోవిందా!

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ చట్టం మరింత పదునుగా రూపొందుతోంది. హరిత హారానికి రక్షణగా నిలవబోతోంది. హరిత హారం మొక్కలు 75 శాతం బతక్కపోతే సర్పంచ్‌ని డిస్మిస్ చేసేలా పంచాయతీరాజ్ చట్టం రాబోతోందని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన జిల్లా వ్యవసాయాధికారుల (డీఏవో)తో సమీక్షించారు. పంచాయతీరాజ్ చట్టంలో అనేక ప్రతిపాదనలు రూపొందిస్తున్నారని చెప్పారు. వ్యవసాయాధికారుల సాగు లెక్కలు, వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. 'అవును... మేం ఇచ్చిన నివేదికల కంటే క్షేత్రస్థాయిలో ఎక్కువగానే సాగైనట్లుగా ఉంద'ని నిజామాబాద్ అధికారి ఒప్పుకోవడంతో మంత్రి ఇంకాస్త మండిపడ్డారు. తక్కువ సాగు చూపిస్తే ఆహార పంటల ఉత్పత్తులు కూడా తక్కువగా నమోదవు తాయని పేర్కొన్నారు. ఈ రబీలో సాధారణంగా 32 లక్షల ఎకరాలే సాగవుతాయని చెబుతున్నారని, అది 40 లక్షల ఎకరాలకు మించి ఉంటుందని అంచనా వేశారు. కొత్తగా 851 మంది వ్యవసాయ విస్తరణాధికారులు రాబోతున్నారని, వారి సంఖ్య 2,638 అవుతుందన్నారు.

ట్రాక్టర్ల కోసం నా వద్దకు పంపుతారా?

సబ్సిడీ ట్రాక్టర్ల కోసం ఎమ్మెల్యేలను తన వద్దకు డీఏవోలు పంపుతుండటంపై పోచారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా వచ్చి ప్రత్యేక కోటా కింద ట్రాక్టర్లు అడుగుతున్నారని, ఫలితంగా తాను హైదరాబాద్ రావడానికే జంకాల్సి వస్తోందన్నారు. పూర్వ జిల్లాల ప్రకారం ట్రాక్టర్ల మేళా పెడితే బాగుంటుందని, ఒకేచోట ట్రాక్టర్లను పంపిణీ చేయాలన్నారు. ఖమ్మంలో ఒకేసారి వెయ్యి ట్రాక్టర్లు పంచుతున్నామని చెప్పారు. ఈసారి వ్యవసాయశాఖకు ప్రత్యేక బడ్జెట్ పెట్టబోతున్నామని, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ సొమ్ము రూ.5 వేల కోట్లు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ డీఏవోలను మంత్రి సన్మానించారు.

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చిన వారు.. వెళ్లక మానరు!

హంగామా చేశారు. కానీ ఆమె కూడా ఎక్కువకాలం ఉండలేకపోయారు.

- కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన కమతం రాంరెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తగిన ప్రాధాన్యత లేక పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు.
- మహబూబ్‌నగర్ శాసనసభ ఉప ఎన్నికలకు ముందు బీజేపీలో చేరిన యెన్నం శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి సంచలనం సృష్టించారు. కానీ పట్టుమని రెండేళ్లు కూడా ఆ పార్టీలో ఇమడలేకపోయారు.

..ఇలా చాలా మంది నేతలు బీజేపీలో చేరుతున్నా ఎక్కువ కాలం ఆ పార్టీలో ఇమడలేకపోతున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ విషయాన్ని ఓ సీనియర్ నేత వద్ద ప్రస్తావిస్తే.. 'బీజేపీ రాష్ట్ర శాఖకు ఏదో శాపం ఉన్నట్టు ఉంది'అని వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని కలుపుకొని పోయేందుకు రాష్ట్ర బీజేపీ నేతలు ఏ మాత్రం చొరవ చూపరని.. దశాబ్దకాలంగా అయితే దత్తాత్రేయ, లేదంటే కిషన్‌రెడ్డి, కాదంటే లక్ష్మణ్ అన్నట్లుగా పార్టీ నడుస్తోందన్న ప్రచారముంది. అయితే పార్టీలోకి వస్తున్న ఇతర పార్టీల నేతలు ఉండకపోవడాన్ని విశ్లేషిస్తూ.. ''ఇప్పటిదాకా ఆలోచించలేదు.. కానీ పార్టీలోకి వచ్చి, పోయిన వారిని గుర్తు చేసుకుంటే మాత్రం లోపం మాదేనని అంగీకరించక తప్పదు. ఇలాంటి పరిస్థితుల వల్లే కొత్తగా వేరే పార్టీ నుంచి రావడానికి భయపడుతున్నారు. కానీ ఇతర పార్టీల నుంచి వచ్చేవారు ఎవరైనా ఉంటే వారు నేరుగా ఢిల్లీలో మాట్లాడుకుని వచ్చి చేరుతున్నారు. ఇక్కడ రాష్ట్ర నేతలతో ఇమడలేకపోతున్నారు. ఇది కూడా కారణమై ఉండొచ్చు..''అని బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడొకరు పేర్కొన్నారు.

బీజేపీలో ఆదరణ ఏదీ..

ఇతర పార్టీల్లో చక్రం తిప్పిన నాయకులెందరో బీజేపీలో చేరాక తగిన ఆదరణ లేక అనామకులుగా మిగిలిపోయారు. దాంతో వచ్చినంత వేగంగా తిరిగి వెళ్లిపోతున్నారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో కీలకంగా వ్యవహరించిన డీకే సమరసింహారెడ్డి నుంచి నేటి నాగం జనార్దనరెడ్డి దాకా ఇదే పరిస్థితి. పార్టీలో ప్రాధాన్యత కోసం పోరాడి, ఆశించిన ప్రయోజనం లేకపోవడంతో పాత పార్టీలకు వెళ్లడమో, మరో మార్గం చూసుకోవడమో జరిగింది. ఇలా బీజేపీని వీడి వెళ్లిపోయిన వారిలో కొందరు ప్రాధాన్యత గల పదవులు కూడా పొందడం గమనార్హం. గత రెండు దశాబ్దాలుగా ఇదే తరహా పరిస్థితి నెలకొన్నా... రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీలో, ముఖ్యుల్లో ఎలాంటి మార్పు కనిపించడంలేదని ఆ పార్టీ నేతలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర పార్టీ నాయకులను ఇముడ్చుకోవడంలో, పార్టీని విస్తరించుకోవడంలో బీజేపీ విఫలమవుతోందని పేర్కొంటున్నారు.

ఇప్పుడు నాగం!

తెలుగుదేశం పార్టీని వీడి బీజేపీలో చేరిన నాగం జనార్దనరెడ్డి ఇప్పుడా పార్టీని వీడే యోచనలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి కొంతకాలంగా సంప్రదింపులు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఆయన కాంగ్రెస్‌లో చేరడం దాదాపుగా ఖాయమైందని... అయితే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు డీకే అరుణ, నంది ఎల్లయ్య, కె.దామోదర్‌రెడ్డి వంటివారు వ్యతిరేకిస్తుండడంతో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. బలమైన ప్రత్యర్థిని ఎదుర్కొనేందుకు అందరినీ కలుపుకొని పోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం గట్టిగా చెబుతున్నా.. రాష్ట్ర నేతలు పట్టించుకోవడం లేదని, నాగం జనార్దనరెడ్డిని ఆపేందుకు ప్రయత్నించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

ఇప్పటిదాకా ఎవరెవరు..?

- డీకే సమరసింహారెడ్డి, కమతం రాంరెడ్డి బీజేపీలో చేరినా ఎక్కువకాలం నిలవలేకపోయారు. సినీనటిగా దక్షిణ భారతదేశంలో పేరున్న విజయశాంతి కొంతకాలం బీజేపీలో పనిచేశారు. జాతీయస్థాయి నేతలతో మంచి సంబంధాలే ఉన్నా.. రాష్ట్ర నేతల తీరుతో ఇబ్బందిపడ్డారు. దాంతో బయటికి వెళ్లిపోయి తల్లి తెలంగాణ పార్టీ ఏర్పాటు చేశారు. అనంతరం ఆ పార్టీని టీఆర్‌ఎస్‌లో విలీనం చేసి.. మెదక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.
- ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఉన్న మంత్రి సి.లక్ష్మారెడ్డి కూడా కొంతకాలం బీజేపీలో పనిచేశారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు సుధాకర్, డాక్టర్ పరమేశ్వర్ వంటివారు ఎక్కువకాలం బీజేపీలో కొనసాగలేకపోయారు. టీఆర్‌ఎస్ నుంచి వచ్చిన కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇటీవలే బీజేపీకి రాజీనామా చేశారు.
- సమైక్య రాష్ట్రంలోనూ కొందరు ముఖ్య నేతలు బీజేపీలో ఇమడలేక తమదారి తాము చూసుకున్నారు. ముద్రగడ పద్మనాభం, మోహన్‌బాబు, నరేశ్, సుమన్ వంటివారు పార్టీని వీడారు. సినీనటుడు కృష్ణంరాజు కేంద్రమంత్రిగా పనిచేసినా.. పార్టీని వీడారు. మళ్లీ చేరినా అసంతృప్తితో కొనసాగుతున్నారు.
- విద్యార్థి దశ నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలున్న కొందరు నాయకులు కూడా బీజేపీ రాష్ట్ర పార్టీ నేతల వైఖరితో విసిగిపోయి వివిధ పార్టీల్లో చేరిపోయారు. ఆలె నరేంద్ర బీజేపీ నుంచి ఎంపీగా గెలిచినా రాష్ట్ర నాయకత్వంతో విభేదించి తెలంగాణ సాధన సమితిని ఏర్పాటుచేశారు. దీనిని టీఆర్‌ఎస్‌లో విలీనం చేసి.. తరువాత యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో వచ్చిన విభేదాల కారణంగా తిరిగి బీజేపీలో చేరినా.. తగిన ప్రాధాన్యత దక్కలేదు.
- ఇదే తరహాలో మందాడి సత్యనారాయణరెడ్డి, తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి), రవీంద్రనాథ్‌రెడ్డి వంటివారు బీజేపీ మూలాలున్నా బయటకు పోయి పదవులు పొందారు. జగ్గారెడ్డి తిరిగి బీజేపీ గూటికి వచ్చినా.. కొద్దిరోజులకే కాంగ్రెస్‌కు వెళ్లిపోయారు.

కోర్ కమిటీలోనే విభేదాలు

రాష్ట్ర బీజేపీ నాయకత్వమే పార్టీ ఎదుగుదలకు ప్రధాన శాపమని ఆ పార్టీ ముఖ్య నేతలే ఆరోపిస్తున్నారు. పార్టీ కోర్ కమిటీలో ఉన్న ఏ ఇద్దరు నాయకుల మధ్య కూడా సఖ్యత లేదని.. పార్టీలో సమష్టి పని విధానమే లేకుండా పోయిందని సీనియర్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా కీలక పదవుల్లో ఉన్న నేతల మధ్య తీవ్ర అగాధం ఉందని చెబుతున్నారు. మరికొందరు నేతల మధ్య అంతర్గత పోరు తీవ్రంగా ఉందని అంటున్నారు. అసలు రాష్ట్ర పార్టీ ముఖ్యుల్లో చాలా మంది తమ నియోజకవర్గాల్లో గెలవడం కోసం ప్రత్యర్థి పార్టీలతో రాజీపడుతున్నారని సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి బహిరంగంగా అసంతృప్తి వెలిబుచ్చుతుండడం గమనార్హం. పార్టీకి సారథ్యం వహించే నేతల మధ్య విభేదాలు, ఆధిపత్య పోరుతో సొంత పార్టీ నేతలకే ఇబ్బందులు వస్తుంటే.. బయటి నుంచి వచ్చే నాయకులు ఎలా స్థిరంగా ఉంటారని పలువురు సీనియర్లు ప్రశ్నిస్తున్నారు.



దివ్యమనోహరం.. లక్ష్మీనారసింహుడి కల్యాణం

యాదగిరికొండ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలోని పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణం ఆద్యంతం ఆసక్తిగా, కనులపండువగా సాగింది. స్వామి, అమ్మవారిని పెళ్లి కొడుకు, పెళ్లి కూతురుగా ముస్తాబు చేసి గజవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో సేవలను అధిష్టింపజేసి జీలకర్ర బెల్లం, కన్యాదానం, పాద ప్రక్షాళనం చేసి ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్ణయించిన సుముహూర్తానికి మాంగల్యధారణ చేశారు.

రామావతారంలో నారసింహుడు

అంతకుముందు ఉదయం స్వామివారిని రామావతారంలో అలంకారం చేశారు. అర్చకులు, రుత్విక్కుల వేద మంత్రాల నడుమ అభిషేకం చేశారు. అనంతరం పట్టు వస్త్రాలను ధరింపజేసి, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తజనం స్వామి వారి అలంకారంతో పాటు కల్యాణ ఘట్టాన్ని కనులారా తిలకించి తరలించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ స్థానాచార్యులు రాఘవాచార్యులు, దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు నల్లందీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నరసింహాచార్యులు, సురేంద్రాచార్యులు, సంపతాచార్యులు, ఆలయ అధికారులు దోర్బల భాస్కర శర్మ, మేడి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ రాజకీయ పార్టీగా ఆవిర్భవించబోదు!

పూర్తి వివరాలు ఫిబ్రవరిలో వెల్లడిస్తాం: కోదండరాం



సంగారెడ్డి జోన్: తెలంగాణ జేఏసీ రాజకీయ పార్టీగా ఆవిర్భవించబోదని కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. సంగారెడ్డిలో శనివారం టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అధ్యయన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత, గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని,, మంచి రాజకీయాలు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వాటి కోసం టీజేఏసీ బయట నుంచి ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. పూర్తి వివరాలు ఫిబ్రవరిలో వెల్లడిస్తామన్నారు. అయితే.. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్ర వ్యవసాయ విధానం రావాలన్న లక్ష్యంతో రైతుల సమస్యలను అధ్యయనం చేయడానికి క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించామని తెలిపారు. ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో అన్ని జిల్లాల నుంచి వచ్చిన నివేదికలపై అధ్యయనం చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

గంటలో మూడు ఘటనలు!

ఏజెన్సీలో మావోయిస్టుల బీభత్సం

- శుక్రవారం అర్ధరాత్రి 10 నుంచి 11 గంటల మధ్య..
- ఇన్‌ఫార్మర్ నెపంతో ఒకరి హత్య, మరొకరిపై కాల్పులు
- 3 పొక్లెయిన్లు, 4 లారీలు, ఒక ట్రాక్టర్ దహనం



గాయపడిన మడివి రమేశ్



పొడియం జోగయ్య(ఫైల్)

పినపాక: ఏజెన్సీలో మావోయిస్టులు శుక్రవారం అర్ధరాత్రి గంటలో మూడు ఘటనలకు పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట పంచాయతీ పరిధిలో రాత్రి పది గంటల నుంచి పదకొండు గంటల మధ్యలో ఇన్‌ఫార్మర్ల నెపంతో ఒకరిని కొట్టి చంపారు. మరొకరిపై కాల్పులు జరిపారు. 8 వాహనాలను తగులబెట్టారు. సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మూడు గ్రామాల్లో ఒకే సమయంలో దాడులకు పాల్పడటంతో ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

గోదావరి దాటి మూడు టీంలుగా...

సుమారు 50 మంది సాయుధులైన మావోయిస్టులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం సుబ్బేడు నుంచి గోదావరి(మోకాలి లోతులో నీరు ఉంది) దాటి పినపాక మండలం భూపతిరావుపేట సమీపం లోని ఇసుక క్వారీ వద్దకు చేరుకున్నారు. సుమారు 40 మంది మావోయిస్టులు అక్కడే ఉండగా, మరో పది మంది రెండు టీంలుగా విడిపోయి సుందరయ్యనగర్, ఉమేష్‌చంద్రనగర్ వైపు వెళ్లారు.

బరిసెతో పొడిచి..

ఉమేష్‌చంద్రనగర్(వలస ఆదివాసీ గ్రామం)కు ఐదుగురు మావోయిస్టులతో కూడిన యాక్షన్ టీం చేరుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న పొడియం జోగయ్య(38)ను బయటకు తీసుకొచ్చి గ్రామస్తులు చూస్తుండగానే బరిసెతో గొంతుపై పొడిచి.. తలపై తీవ్రంగా కొట్టి చంపివేశారు. జోగయ్య పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, 2016, మార్చి 1న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బొట్టెం వద్ద జరిగిన 9 మంది ఎన్‌కౌంటర్‌కు ప్రధాన కారకుడని, అందుకే హతమారుస్తున్నట్లు మావోయిస్టులు అక్కడ వదిలిన లేఖలో పేర్కొన్నారు. పొడియం జోగయ్య అలియాస్ రాము ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు మండలం ఎర్రంపల్లి గ్రామస్తుడు. బీజాపూర్, సుకుమా జిల్లాల్లో జనతన సర్కార్‌గా పనిచేస్తున్న జోగయ్య తర్వాత ఇన్‌ఫార్మర్‌గా మారి, దళాల సమాచారం పోలీసులకు చేరవేస్తున్నాడని, అతను ఇచ్చిన సమాచారంతోనే బొట్టెం వద్ద గ్రేహౌండ్స్ దళాలు ఎన్‌కౌంటర్ చేశాయని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. అప్పటి నుంచి అనారోగ్యం పేరుతో నటిస్తూ పారిపోయి వచ్చి ఇక్కడ తలదాచుకుని దండకారణ్యంలో దళాల సమాచారం తెలుసుకుంటూ, అదే విధంగా పోలీస్ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను కూడా తయారు చేస్తున్నాడని లేఖలో తెలిపారు. కాగా.. 2016 మార్చి అనంతరం నుంచి జోగయ్య ఉమేష్‌చంద్రనగర్‌లో నివసిస్తున్నాడు.

చనిపోయాడనుకొని..

ఐదుగురితో కూడిన మరో యాక్షన్ టీం సుందరయ్యనగర్‌లోని మడివి రమేశ్ ఇంటిని చుట్టుముట్టింది. అతడిని రోడ్డుపైకి లాక్కొచ్చి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. చనిపోయాడనుకుని వెళ్లిపోయారు. రమేశ్ తీవ్ర గాయాలతో జానంపేటకు చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చాడు. వారు పినపాక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మడివి రమేశ్ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, అందుకే అతనిని హతమారుస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. మడివి రమేశ్‌పై పోలీస్ ఇన్‌ఫార్మర్ అనే నెపంతో మావోయిస్టులు దాడికి పాల్పడటం ఇది నాలుగోసారి. ఇతను వలస వచ్చి ఇక్కడ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సీపీఎం మండల కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు.

వాహనాల దగ్ధం

గోదావరి ఒడ్డున ఇసుక డంపింగ్ పాయింట్ వద్ద పొక్లెయిన్లు, లారీలు, ట్రాక్టర్ల డ్రైవర్లు, కూలీలు సుమారు 50 మంది ఉండగా, వారిని బెదిరించి సెల్‌ఫోన్‌లు లాక్కున్నారు. మోకాళ్లపై కూర్చోపెట్టారు. తాము చెప్పింది చేయకపోతే కాల్చివేస్తామంటూ తుపాకులతో బెదిరించారు. వెంట తెచ్చుకున్న క్యాన్లలో ఉన్న పెట్రోల్‌ను వాహనాలపై పోసి నిప్పంటించారు. మూడు పొక్లెయిన్లు, నాలుగు లారీలు, ఒక ట్రాక్టర్‌ను దగ్ధం చేశారు. ఈలోగా రెండు యాక్షన్ టీంలు మళ్లీ అక్కడకు వచ్చాయి. అందరూ కలసి ఇద్దరి తమతో గోదావరి తీరం దాటే వరకు తీసుకెళ్లారు. అక్కడ అడవిలోకి వెళ్లిపోయారు. గంటన్నర తర్వాత తేరుకున్న కూలీలు, డ్రైవర్లు, ఆపరేటర్లు కొందరు పరుగులు పెట్టారు. మరికొందరు వాహనాల నిప్పు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. ఒకేసారి నాలుగు లారీలు, మూడు పొక్లెయిన్లు, ఒక ట్రాక్టర్‌ను తగులబెట్టడంతో డీజిల్ ట్యాంక్‌లు పేలి భారీ శబ్దాలు వచ్చాయి. భారీ స్థాయిలో మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో భూపతిరావుపేట గ్రామస్తులు మేల్కొని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మణుగూరు డీఎస్పీ ఆర్.సాయిబాబా ఆధ్వర్యంలో ఏడూళ్లబయ్యారం సీఐ జయపాల్‌రెడ్డి, పోలీసులు శనివారం ఉదయం మూడు ప్రాంతాలను సందర్శించారు. బాధిత కుటుంబాల నుంచి, ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించారు. ఏడూళ్లబయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భూపతిరావుపేటలో దగ్ధమవుతున్న లారీలు

సుజాతక్క నేతృత్వంలో..?

మూడు ఘటనలకు వారం రోజుల క్రితమే పక్కాగా రెక్కీ నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. మావోయిస్టు సుజాతక్క నేతృత్వంలో దాడులు జరిగినట్లు తెలుస్తోంది. మణుగూరు ఏరియా కమిటీ నెల రోజుల క్రితం ఏర్పడినట్లు సమాచారం. 50 మంది సభ్యులున్న మావోయిస్టుల బృందంలో సుమారు 10 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని, హిందీ, గొత్తికోయ భాషల్లో వారు మాట్లాడుకున్నారని అక్కడి వారు చెబుతున్నారు.

విదేశీయుల ‘ఫీల్ ద జైల్’



సంగారెడ్డి క్రైం: ఎవరైనా జైలు జీవితం అనుభవించాలని కలలో కూడా ఊహించరు. కానీ ఇద్దరు విదేశీయులు మాత్రం జైలు శిక్ష అనుభవించి చూడాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నారట! అయితే వారి కోరికను సంగారెడ్డి జైలు అధికారులు తీర్చారు. ఇటీవల సంగారెడ్డి జైలు అధికారులు ‘ఫీల్ ద జైల్’అనే కార్యక్రమాన్ని చేపట్టారు. మలేషియాకు చెందిన దంత వైద్యుడు క్వెన్, రెస్టారెంట్ వ్యాపారి కెల్విన్ ఆన్‌లైన్‌లో వీటి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఏకంగా వారు మలేషియా నుంచి ఇక్కడికి వచ్చారు. జైలు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్‌ను సంప్రదించి తమ మనసులోని మాటను చెప్పారు. నిబంధనల ప్రకారం జైలు మ్యూజియంలో రూ.500 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఖైదీల్లా కారాగారంలో అడుగు పెట్టారు. ఆన్‌లైన్‌లో ‘ఫీల్ ద జైల్’ గురించి వివరాలు తెలుసుకొని జైలు జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చామని క్వెన్, కెల్విన్ తెలిపారు. శిక్ష కాలంలో ఖైదీలకు అందించే ఆహారాన్నే తమకూ వడ్డించాలని వారు అధికారులను కోరారు.

కందుల నిల్వలపై దాడులు

సాక్షి, ఆదిలాబాద్: కంది అక్రమ నిల్వలపై శనివారం అధికార యంత్రాంగం కొరడా ఝులిపించింది. ఆదిలాబాద్ జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాలు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 1,600 క్వింటాళ్ల కందులను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి కందులను తక్కువ ధరకే కొనుగోలు చేసి ఇక్కడ ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధర రూ.5,450కి విక్రయించేందుకు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుంచి ‘కంది పరవళ్లు’అనే శీర్షికన ‘సాక్షి’మెయిన్‌లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. జిల్లాలో ఆదిలాబాద్, నార్నూర్, ఇచ్చోడ, భీంపూర్ మండలాల్లో దాడులు నిర్వహించారు.



మధ్యవర్తి బెదిరించాడా?

- గుడుంబా పునరావాసం లబ్ధిదారుడితో ఎక్సైజ్ అధికారుల ఆరా
- ‘గుడుంబా సొమ్ము గుటుక్కు’ కథనానికి స్పందన

నవాబుపేట: గుడుంబా పునరావాసం కల్పనలో ఏమైనా అక్రమాలు జరిగాయా అంటూ ఎక్సైజ్ అధికారులు లబ్ధిదారుడితో ఆరా తీశారు. గుడుంబా తయారీ, అమ్మకం మానేసిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తున్న విషయం విదితమే. అయితే.. ఎక్సైజ్ అధికారులు ఆ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ‘సాక్షి’మెయిన్‌లో శనివారం ‘గుడుంబా సొమ్ము గుటుక్కు’శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటకు చెందిన ప్రభాకర్ వాదన వచ్చింది. స్పందించిన ఎక్సైజ్ అధికారులు శనివారం ఉదయమే రంగంలోకి దిగారు. ప్రభాకర్‌కు అందిన ఆవులను ఎక్సైజ్ శాఖ మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ పరిశీలించారు. ఆవుల కొనుగోలు సమయంలో మధ్యవర్తి ఏమైనా బెదిరించాడా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ లబ్ధిదారులను ఎంపిక చేసి ఎంపీడీఓలకు అప్పగించడంతో తమ విధి పూర్తవుతుందని తెలిపారు. పథకం అమలును ఎంపీడీఓలు పర్యవేక్షిస్తారని చెప్పారు.

24 గంటల కరెంట్ వద్దు

- కరీంనగర్ జెడ్పీ ఏకగ్రీవ తీర్మానం
- 12 గంటల సరఫరా సరిపోతుంది..
- మంత్రి ఈటల సమక్షంలో నిర్ణయం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ‘24 గంటల కరెంట్ వద్దు.. 12 గంటలు చాలు’.. అంటూ కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శనివారం ఇక్కడి జెడ్పీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఈ తీర్మానాన్ని పార్టీలకు అతీతంగా సభ్యులందరూ ఆమోదించారు. 24 గంటల కరెంట్‌తో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, శ్రీరాంసాగర్, ఎల్ఎండీల ద్వారా సరఫరా చేసే నీరు చౌర్యానికి గురవుతుండగా, భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని ముస్తాబాద్, చొప్పదండిల జెడ్పీటీసీ సభ్యులు శరత్‌రావు, సాంబయ్య మంత్రి ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. 24 గంటల సరఫరాకు బదులు 12 గంటలు సరఫరా చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరగా, తీర్మానం చేస్తే పంపిద్దామని ఈటల రాజేందర్ సూచించారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ అనుమతితో సభ్యులు శరత్‌రావు తీర్మానం ప్రతిపాదించగా, పార్టీలకతీతంగా సభ్యులందరూ ఆమోదించారు. కాగా.. వ్యవసాయ శాఖపై చర్చ జరుగుతున్నప్పుడు యంత్రలక్ష్మి పథకం దళారులకు వరంగా మారిందని, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు సంబంధం లేకుండా, తెలియకుండా అనర్హులకు రాయితీ ట్రాక్టర్లు అందజేశారని టీఆర్ఎస్ జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఇప్పలపల్లి సాంబయ్య, లచ్చిరెడ్డి, శరత్‌తోపాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సభలో ప్రగతి నివేదిక అంటూ అంశాలు ప్రస్తావించారు కాబట్టి తాము అడుగుతున్నామని, ‘అంతా మా ఇష్టం’అని అధికారులు అంటే తామేమీ అడగమని, ఇంకా ఆ చర్చను ఆపి వేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్ హత్యను నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులు శోభారాణి, సదయ్య తదితరులు నల్లబ్యాడ్జీలతో హాజరయ్యారు. సుమారు ఎనిమిది గంటలపాటు జరిగిన సర్వసభ్య సమావేశంలో సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, దేవసేన, కృష్ణభాస్కర్, జగిత్యాల జేసీ బేతి రాజేశం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, బొడిగె శోభ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకోళ్ల ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకుంటున్నా..!

రైతు జహంగీర్ సూసైడ్‌నోట్

- ఆలస్యంగా వెలుగులోకి..
- ఆదుకోవాలని సీఎం, మంత్రికి వేడుకోలు



బాలానగర్: బ్యాంకు అధికారుల ఒత్తిడితోనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ రైతు రాసిన సూసైడ్ నోట్ ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దరేవల్లికి చెందిన జహంగీర్ డిసెంబరు 22న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో సాధారణ మృతిగానే భావించినా.. ఆయన రాసిన లేఖ బయటపడటంతో కలకలం సృష్టించింది. జహంగీర్ సీఎం కేసీఆర్‌కు, మంత్రి లక్ష్మారెడ్డికి రాసిన లేఖలో తాను ఆత్మహత్య చేసుకునేందుకు దారి తీసిన కారణాలను వివరించాడు. తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకున్నాడు. యాదిరాల బ్యాంకులో రూ.3 లక్షల అప్పు తీసుకుని రెండు బోర్లు వేశాని, కొంత కాలం తర్వాత రెండూ ఎండిపోయాయన్నాడు. అనారోగ్య పరిస్థితుల కారణంగా ఎంత కష్టపడినా బ్యాంకు అప్పు తీరలేదని, బ్యాంకు అధికారులు మహబూబ్‌నగర్ కోర్టులో కేసు వేసి కోర్టు చుట్టూ తిప్పారన్నారు. తన కుమారుడు ఎమ్మెస్సీ, బీఈడీ చదివినా నౌకరీ రాలేదని వాపోయాడు. ప్రస్తుతం అప్పు రూ.12 లక్షలకు చేరిందని, భూమిని జప్తు చేస్తామని కోర్టు వారు అంటున్నారని పేర్కొన్నాడు. ‘మీరు ఆపద్బాంధవుడు.. తన కుటుంబసభ్యులను ఆదరించి కుమారుడు రవీందర్‌ను నౌకరీ ఇప్పించాలని ప్రాధేయపడ్డాడు.

‘కాళేశ్వరం’ దేశ ప్రగతికి నాంది

నిర్మాణ పనులను పరిశీలించిన ఇంజనీరింగ్ బృందం

మహదేవపూర్/కాళేశ్వరం/ధర్మారం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీ, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం–సాయంపేట శివారులో చేపట్టిన ప్యాకేజీ–6 టన్నెల్ నిర్మాణ పనులను రాష్ట్ర ఇంజనీరింగ్ బృందం శనివారం పరిశీలించింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అడ్మిన్ ఇన్ చీఫ్ నాగేందర్‌రావు, నీటిపారుదలశాఖ ప్రాజెక్టు ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో 22 మంది బృందం సభ్యులు పనుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు చోట్ల సమీక్ష నిర్వహించారు. లంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశ ప్రగతికి నాంది అని, దండకారణ్యంలో అధికారులను సమన్వయపరుస్తూ ఇంత వేగంగా పనులు చేపట్టడం ఎక్కడా చూడలేదని నాగేందర్‌రావు, అనిల్‌కుమార్‌లు అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ అన్నపూర్ణగా మారుతుందన్నారు. మునుపెన్నడు లేని విధంగా మూడు షిఫ్టుల్లో పని చేయడం, ఇక్కడ జరుగుతున్న పనులను రాజధాని నుంచి పర్యవేక్షించడం అబ్బురపరిచే విషయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అద్భుతమైందని, దేశ ప్రగతిలో రాబోయే రోజుల్లో ముఖ్య భూమిక పోషిస్తుందని చెప్పారు. అన్నారం బ్యారేజీ 2018 జూలై వరకు, మేడిగడ్డ బ్యారేజీ డిసెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు శ్రమిస్తున్న తీరును ఆయన అభినందించారు. ఆయన వెంట ఆదిలాబాద్ సీఈ భగవంతరావు, టీఎస్ఐడీసీ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్యాంసుందర్, హైడ్రాలజీ సీఈ శంకర్, గోదావరి బేసిన్ సీఈ మధుసూదన్‌రావు, బ్యారేజీ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.



సాక్షి
నల్లగొండ
ఆదివారం I జనవరి I 28 I 2018
www.sakshi.com

శరద్ పవార్ (ఎన్.సి.పి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

'సంవిధాన్ బచావ్' సక్సెస్ అయింది! రిపబ్లిక్ డే రోజు ముంబైలో పెద్ద ర్యాలీ తీశాం. సీతారాం ఏచూరి, శరద్ యాదవ్, ఒమర్ అబ్దుల్లా, పృథ్వీరాజ్ చవాన్, హార్దిక్ పటేల్, అల్పేశ్ ఠాకూర్, ఇంకా.. నేను తెలిసినవాళ్లు, నాకు తెలియనివాళ్లు చాలామంది వచ్చారు.

ర్యాలీ మధ్యలో ఎవరో నా వెనుక నుంచి నా ముందుకు వచ్చి.. "మీకెందుకు పవార్‌జీ.. శ్రమ" అని నా దగ్గర్నుంచి ఏదో లాక్కుపోయారు.

ర్యాలీలో శరద్ యాదవ్ నా పక్కనే ఉన్నాడు.

"యాదవ్.. నా దగ్గర్నుంచి ఎవరో ఏదో లాక్కుపోయారు, వాళ్లెవరో చూడొద్దు కానీ, ఏం లాక్కుపోయారో చూసి చెప్పు" అన్నాను.

"మీ దగ్గర ఏం ఉండేదో గుర్తు చేసుకుంటే, మీ దగ్గర్నుంచి ఏం లాక్కుపోయారో తెలుస్తుంది కదా సర్" అన్నాడు హార్దిక్ పటేల్!

కుర్రాడు షార్ప్‌గా ఉన్నాడు. "పోనీ, నువ్వు చెప్పు. నువ్వూ నా పక్కనే ఉన్నావు కదా" అన్నాను.

"మీ దగ్గర్నుంచి ఏం లాక్కెళ్లారో చెప్పలేను కానీ, మీ దగ్గర్నుంచి ఎవరు లాక్కెళ్లారో చెప్పగలను సర్" అన్నాడు హార్దిక్ పటేల్.

"మనది ఎవరు లాక్కెళ్లారో మనకెందుకయ్యా. మనది ఏం లాక్కెళ్లారో ముఖ్యం కానీ" అన్నాను.



"కానీ సర్, మనది ఏం లాక్కెళితే మనకెందుకు? మనది ఎవరు లాక్కెళ్లారో ముఖ్యం కానీ" అన్నాడు.

జనరేషన్ గ్యాప్!

ర్యాలీ అయ్యాక అంతా ఒకచోట కూర్చున్నాం. "29న ఢిల్లీకి ఎవరొస్తారో చేతులెత్తండి" అన్నాను. కొంతమంది ఎత్తారు. కొంతమంది ఎత్తలేదు!

ఎత్తినవాళ్లు ఎందుకు ఎత్తారో అడిగాను. "మీరు ఎత్తమన్నారు కాబట్టి ఎత్తాం" అన్నారు. ఎత్తనివాళ్లు ఎందుకు ఎత్తలేదో అడిగాను. "ఆ రోజు మేము ఢిల్లీలోనే ఉంటాం కాబట్టి ఎత్తలేదు" అన్నారు!

"ఉంటే మాత్రం? చెయ్యెత్తకూడదా?" అన్నాను.

"ఢిల్లీలో లేనివాళ్లు ఢిల్లీ రావడానికి చెయ్యెత్తాలి కానీ, ఢిల్లీలో ఉండేవాళ్లు ఢిల్లీ వస్తామని చెయ్యెత్తడానికి ఏముంటుంది పవార్‌జీ?" అన్నారు!

"అక్కడ మళ్లీ ఇంకొక ర్యాలీనా సర్" అన్నాడు అల్పేశ్ ఠాకూర్ ఉత్సాహంగా.

"ర్యాలీ కోసం కాదయ్యా.. అందరం కూర్చొని మాట్లాడుకోడానికి. ఇవాళెందుకు ర్యాలీ తీశాం? రాజ్యాంగాన్ని రాయిలా చేత్తో పట్టుకుని తిరుగుతున్నాడనే కదా మోదీ! ఆయన చేతుల్లోంచి రాజ్యాంగాన్ని లాగేసుకోవడం ఎలా అని ఆ రోజు ప్లాన్ చేస్తాం" అని చెప్పాను.

హార్దిక్ పటేల్ నా చేతికి జాతీయ జెండా అందించాడు!!

"ఏంటయ్యా ఇది? కాంప్లిమెంటా!" అన్నాను.

"లాక్కెళ్లినవాడి దగ్గర్నుంచి లాక్కొచ్చాను సార్" అన్నాడు!


అతడివైపు చూశాను.

లాక్కొచ్చే పనికి బాగా పనికొచ్చేలా ఉన్నాడు.

"రా.. నా పక్కన కూర్చో" అన్నాను.

బహుళత్వంతోనే భవితవ్యం

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

ఈ రోజున ప్రధాని నరేంద్రమోదీ దేశంలో అత్యంత జనాదరణ కలిగిన నాయకుడు అనడంలో ఎవ్వరికీ సందేహం లేదు. అర్ణబ్‌గోస్వామి రిపబ్లిక్ టీవీ, అరుణ్ పురీ ఇండియా టుడే చానల్ తాజాగా నిర్వహించిన సర్వేల ఫలితాలలో కొన్ని అంకెలలో వ్యత్యాసం ఉండవచ్చును కానీ తాత్పర్యం ఒక్కటే. 2019 సార్వత్రిక ఎన్నికలలో సైతం బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమి అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందనీ, ప్రధానిగా నరేంద్రమోదీ కొనసాగుతారనే. నిజానికి, మోదీ నాయకత్వం కారణంగానే బీజేపీకీ, దాని మిత్రపక్షాలకీ మెజారిటీ స్థానాలు లభిస్తాయన్న మాట కూడా స్పష్టమే. నేపాల్‌లోని లుంబిని గౌతమ బుద్ధుడి జన్మస్థానం. అక్కడి నుంచి లక్నో వరకూ బుధ, గురువారాలలో ముగ్గురు మిత్రులతో కలసి కారులో చేసిన ప్రయాణం ఈ రచయితకు గయ వెళ్ళి బోధివృక్షం కింద కూర్చునే అవసరం లేకుండానే ఒక రకమైన రాజకీయ జ్ఞానోదయం కలిగించింది. ఉత్తరప్రదేశ్ (యూపీ) ఈశాన్య ప్రాంతం అంతా చూశాం. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధిపతిగా ఉన్న గోరఖ్‌పూర్ మఠం సందర్శించాం. బుద్ధుడి మహాపరినిర్వాణం జరిగిన కుశీనగర్‌లో మకాం చేశాం. వివాదాస్పదమైన అయోధ్య నగరంలో కొద్దిసేపు ఆగి తాజా సమాచారం సేకరించాం. రామ జన్మభూమి పోలీసు పర్యవేక్షణలో బ్యారికేడ్ల మధ్య బిక్కుబిక్కుమంటూ ఉంది. హైవేకు రెండు వైపులా కనుచూపు ఆనినంతవరకూ ఆకుపచ్చని తివాచీ పరచినట్టు వరి, జనుము, గోధుమ పొలాలు. కొద్దిగా లోపలికి వెడితే కటిక పేదరికంలో ముస్లిం గ్రామాలు. పూర్వం బౌద్ధం పరిఢవిల్లిన ప్రాంతాలలో అత్యధికంగా ముస్లింలు కనిపించారు. మధ్య ఆసియా నుంచి వచ్చిన దురాక్రమణదారుల దాడుల నుంచి బౌద్ధులకు రక్షణ లేక ఇస్లాంను ఆశ్రయించారంటూ అంబేడ్కర్ చేసిన ప్రతిపాదనను రుజువు చేసే ఆధారాలలో ఇది ఒకటి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో నా మదిలో మెదిలిన ఆలోచనలు మనవి చేస్తాను.

యూపీ ప్రయోగం

2011 నాటి జనాభా లెక్కల ప్రకారం యూపీలో ముస్లింలు 19.25 శాతం. 2017 నాటి అసెంబ్లీ ఎన్నికలలో మొత్తం 403 నియోజకవర్గాలలో ముస్లిం అభ్యర్థిని ఒక్కరిని కూడా నిలబెట్టకుండా బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడంలోని రహస్యం తెలుసుకోవాలంటే యూపీ ప్రయోగం క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మొత్తం 19 బీజేపీ పాలిత రాష్ట్రాలలో అదే ప్రయోగం అటూ ఇటుగా అమలు జరుగుతోంది. రేపు కర్ణాటకలోనూ అదే వ్యూహం అమలు చేసి ఘనవిజయం సాధించేందుకు అమిత్‌షా పావులు కదుపుతున్నారు. మైనారిటీలను పూర్వపక్షం చేసి మెజారిటీ మతస్థులను ఏకం చేయడం ద్వారా అధికారం సాధించడం, ఇందుకు క్షేత్రవాస్తవికతను సవ్యంగా అర్థం చేసుకొని చాకచక్యంగా వ్యూహం రచించడం, పకడ్బందీగా అమలు జరపడం. బ్రిటన్, ఫ్రాన్స్‌లో (అనేక ఐరోపా దేశాలలో) లాగా, పాకిస్తాన్‌లో అత్యధికులు ఒకే మతానికి చెందినవారూ, ఒకే భాష మాట్లాడేవారూ, ఒకే వారసత్వం ఉన్నవారూ, ఒకే సంస్కృతి కలిగినవారూ ఉండటం. 'క్లాష్ ఆఫ్ సివిలిజేషన్స్' రచయిత శామ్యూల్ హంటింగ్టన్ అమెరికాను వైట్–ఆంగ్లో ప్రొటెస్టెంట్ (వాస్ప్) దేశంగా అభివర్ణించాడు. ఇండియాను ఆ విధమైన మూసలోకి మార్చడం సాధ్యమా? ప్రస్తుతానికి కాకపోవచ్చు. ఆ దిశగా ప్రయత్నానికి ఊతం మాత్రం కొంత దొరికింది.

బీజేపీ జయప్రదంగా అనుసరిస్తున్న వ్యూహంలో ముఖ్యమైన అంశం దేశభక్తిని పూర్తిగా సొంతం చేసుకోవడం. దేశభక్తికీ, బీజేపీకీ అభేదం పాటించడం. బీజేపీని కానీ మోదీని కానీ విమర్శించినవారి దేశభక్తిని అడ్డంగా ప్రశ్నించడం. దీన్ని జింగోయిజంగా ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వంటి మేధావులు అభివర్ణిస్తున్నారు. దీనికి బదులు రాజ్యాంగబద్ధమైన దేశభక్తి (కానిస్టిట్యూషనల్ పేట్రియాటిజమ్) ఉండాలన్నది ఆయన వాదన. అందుకే గుజరాత్ దళిత నాయకుడు, అసెంబ్లీ సభ్యుడు జిగ్నేశ్ మేవానీ ఒక చేత్తో మనుస్మృతినీ, రెండో చేత్తో రాజ్యాంగాన్ని పట్టుకొని పార్లమెంటుకు ప్రదర్శనగా వెళ్ళి ప్రధాని మోదీకి సమర్పించి ఆ రెండింటిలో దేన్ని స్వీకరిస్తారో చెప్పాలని అడగబోతున్నట్టు ప్రకటించాడు. మనువాదం అంటే స్థూలంగా ఇప్పుడు బీజేపీ అనుసరిస్తున్న విధానమని అతని వాదన. బీజేపీ వ్యూహం ఆరంభమైంది అద్వాణీ అయోధ్యయాత్రతో. మలుపు తిరిగింది బాబ్రీమసీదు విధ్వంసంతో. లక్ష్యం నెరవేరింది 2014లో మోదీ నాయకత్వంలో బీజేపీ అద్భుత విజయంతో. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన 'ఇండియా దటీజ్ భారత్'కూ ప్రస్తుతం బలంగా వేళ్ళూనుకుంటున్న భావజాలానికీ పొంతన లేదు. రాజ్యాంగ నిర్మాతలు ఇండియన్ రిపబ్లిక్‌కు షరతులు లేని ప్రజాస్వామ్యం, మత, భాషాపరమైన బహుళత్వం, కుల, లింగ సమానత్వం, పేదరికం నిర్మూలన, వివక్షను అంతం చేయడం పునాది కావాలని భావించారు. ఇప్పటి ధోరణులు ఇంతవరకూ దేశ ప్రజలు విశ్వసించిన దేశ స్వరూపస్వభావాలకు ('ఐడియా ఆఫ్ ఇండియా') విరుద్ధమైనవనీ బీజేపీ భావజాలాన్ని వ్యతిరేకిస్తున్నవారు ముక్కుమీద గుద్దినట్టు చెబుతున్నారు. యూపీలో వచ్చే ఎన్నికలలో కూడా బీజేపీ గెలుస్తుందని ఎవరినడిగినా చెబుతారు. ఆ రాష్ట్రంలో మొన్నటి వరకూ యాదవ కులాధిపత్యం ఉండేది. ఇప్పుడు ఠాకూర్ల మాటకు విలువ పెరిగిందని అంటున్నారు. యోగి ఆదిత్యనాథ్ పూర్వాశ్రమంలో ఠాకూర్. అతని ప్రమేయం లేకుండానే ఆ కుల ప్రముఖుల ప్రాబల్యం పెరుగుతుంది. ఎందుకంటే మన ప్రజలు నాయకులను ప్రేమించడంతో ఆగరు. వారినీ, వారి చుట్టూ ఉన్నవారినీ ఆరాధిస్తారు. నాయకులను పూజించే స్వభావాన్ని ప్రజలు విడనాడకపోతే, ప్రశ్నించే తత్వాన్ని ఒంటబట్టించుకోకపోతే పరిస్థితి విషమించి నియంతృత్వానికి దారి తీస్తుంది. రాజ్యాంగ పరిషత్తులో అంబేడ్కర్ చేసిన ఆఖరి ప్రసంగంలో చేసిన హెచ్చరిక గమనించండి: 'మతం పట్ల భక్తి (వ్యక్తుల) ముక్తికి దారి తీయవచ్చు. కానీ రాజకీయాలలో భక్తి లేదా వ్యక్తిపూజ పతనానికీ, నియంతృత్వానికీ తిరుగులేని మార్గం' (Bhakti in religion may be a road to the salvation of the soul. But in politics, Bhakti or hero - worship is a sure road to degradation and to eventual dictatorship). అంబేడ్కర్ హెచ్చరికను కాంగ్రెస్ నాయకులు పెడచెవిన పెట్టబట్టే ఇందిరాగాంధీ ఆత్యయిక పరిస్థితిని విధించే సాహసం చేశారు. 'ఇండియా ఈజ్ ఇందిరా, ఇందిరా ఈజ్ ఇండియా' అనే నినాదం చేసిన నాటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవ్‌కాంత్ బారువా ప్రమాదకరమైన పరమభక్తుడుగా నవభారత చరిత్రలో నల్లటి అక్షరాలతో నమోదై దోషిగా మిగిలిపోయాడు. ఇప్పుడు మోదీ పట్ల, కొందరు ముఖ్యమంత్రుల పట్ల అంధభక్తుల వీరవిధేయత చూస్తే భయం కలుగక మానదు.

కాంగ్రెస్ తప్పిదం

స్వాతంత్ర్య యోధులలో అత్యధికులు తమ మతాన్ని ప్రేమించినవారే. స్వామి వివేకానంద వంటి వివేకవంతులైన హిందూమత ప్రబోధకులను అంగీకరించినవారే. ఆయన రచనలు చదవడం వల్ల తన దేశభక్తి వందవంతులు పెరిగిందని గాంధీ అన్నాడు. భారతదేశాన్ని అర్థం చేసుకోవాలంటే వివేకానందుడి రచనలను అధ్యయనం చేయాలన్నాడు టాగోర్. జాతీయోద్యమాన్ని నిర్మించిన మహానుభావులలో వివేకానంద అగ్రగణ్యుడని నెహ్రూ అంటాడు. సుభాష్‌చంద్రబోస్, రాజగోపాలాచారి తదితరులకు కూడా ఆయనే ప్రేరణ. దేశభక్తితో పాటు వివేకానందనూ, పటేల్‌నూ, అంబేడ్కర్‌నూ సొంతం చేసుకోవడానికి బీజేపీ, దాని అనుబంధ సంస్థలూ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. ఆ సంస్థలకు ఇటువంటి అవకాశం ఎట్లా వచ్చింది? కాంగ్రెస్ స్వాతంత్ర్య సమర సేనానులందరినీ విస్మరించి నెహ్రూ–ఫిరోజ్‌గాంధీ కుటుంబ వృక్షాన్ని మాత్రమే పట్టుకొని వేళ్ళాడటం ఇందుకు ప్రధాన కారణం. ఇందిరాగాంధీని పూజించినట్టు సోనియాను కాంగ్రెస్‌లో బారువా వారసులు తనివితీరా సేవించారు. 19 సంవత్సరాలు పార్టీపై ఏకచ్ఛత్రాధిపత్యం చెలాయించిన సోనియా మనోగతానికి భిన్నంగా మాట్లాడే సాహసం ఒక్కరికీ లేకపోయింది. ప్రధానిగా ఐదేళ్ళు పని చేసి, దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రగతికి బాటలు వేసిన పీవీ నరసింహారావును పదవీ విరమణ తర్వాతనే కాకుండా మరణానంతరం సైతం అవమానపరచడం తప్పని చెప్పిన నాయకుడు ఒక్కడూ లేడు. ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ళు ప్రతిపక్ష స్థానంలో చతికిలబడిన కాంగ్రెస్‌ను సమరానికి సమాయత్తం చేసి 2004లో, 2009లో విజయాలు సాధించి, అధిక సంఖ్యలో ఎంపీలను గెలిపించి, కేంద్రంలో యూపీఏ సర్కార్ ఏర్పడటానికి దోహదం చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడిని ప్రతిపక్ష తెలుగుదేశంతో కుమ్మక్కయి సీబీఐ విచారణ పేరుతో 16 మాసాలు జైలులో ఉంచడం విశ్వాస ఘాతుకమని అధినేతకు చెప్పే గుండెగల నాయకుడు ఒక్కడూ లేకపోయాడు. 1998లో సోనియా కాంగ్రెస్ అధ్యక్షపదవి చేపట్టిన నాటి నుంచి




నేటి వరకూ ఆ పార్టీ సారథ్యం ఆమె చేతి నుంచి పుత్రుడు రాహుల్ చేతిలోకి మారింది. అదే బీజేపీలో 1998 నుంచి ఇప్పటి వరకూ బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తి, అద్వాణీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాలు పార్టీ అధ్యక్షులుగా పని చేశారు. సాధారణ కార్యకర్తలు బీజేపీ అధ్యక్షులుగా, ప్రధానులుగా ఎదిగారు. ముస్లింలలో ఛాందసం పెంచి పోషించడంలోనూ (షాబానో కేసు), వారిని ఓటు బ్యాంకు రాజకీయాలకు వినియోగించుకోవడంలోనూ కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు కూడా బీజేపీ వ్యూహం విజయం సాధించడానికి అవకాశం ఇచ్చాయి. ఇస్లామిక్ దేశాలలో కూడా లేని 'త్రిపుల్ తలాఖ్'దురాచారాన్ని అంతం చేసే ప్రయత్నం చేయడానికి డెబ్బయ్ ఏళ్ళు ఎందుకు పట్టింది? కాంగ్రెస్ హయాంలో పెచ్చుమీరిన అవినీతి కూడా 2014లో మోదీ ప్రభంజనానికి దోహదం చేసింది. కమ్యూనిస్టు పార్టీలు నేల విడిచి సాము చేయడం, విదేశీ అనుభవాలనూ, భావజాలాలనూ అరువు తెచ్చుకోవడానికి ప్రయత్నించడం ద్వారా చీలికపేలికలై కృశించి నశించడానికి సిద్ధంగా ఉండటం కూడా బీజేపీ భావజాలం బలపడటానికి దారి తీసింది.

కింకర్తవ్యం?

కాంగ్రెస్ ఎన్ని తప్పులు చేసినా అంబేడ్కర్, నెహ్రూ, తదితర వైతాళికులు నిర్మించిన నవభారతం సమైక్యంగా, సమగ్రంగా మనగలగడానికి కారణం ఏమిటి? దళితులకూ, ఆదివాసులకూ ఉద్యోగాలలో, చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించడం. భాషాప్రాతిపదికపైన రాష్ట్రాల పునర్నిర్మాణానికి అంగీకరించడం. హిందీని రుద్దరాదన్న తమిళుల డిమాండ్‌ను ఆమోదించడం. పాకిస్తాన్ ఆవిష్కరణ జరిగిన వెంటనే జిన్నా ఢాకా వెళ్ళి ఉర్దూ నేర్చుకోవలసిందేనని తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీలకు కటువుగా చెప్పాడు. అందుకే పాతికేళ్ళకే తూర్పు పాకిస్తాన్ విడిపోయి బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించింది. తమిళులపైన సింహళ భాషను బలవంతంగా రుద్దబట్టే శ్రీలంకలో మూడు దశాబ్దాలపాటు నరమేధం సాగింది. మన దేశంలో ప్రభుత్వాలు పట్టువిడుపులు ప్రదర్శించిన కారణంగానే, ప్రజల ఆకాంక్షలను ఆలకించినందువల్లనే బహుళత్వంలో ఏకత్వం అనే ఆదర్శం ఇప్పటి వరకూ బతికి బట్టకట్టింది. ఈ ఆలోచనా విధానానికి విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా రాజ్యాంగ నిర్మాతల స్వప్నం భగ్నమౌతుంది. పది మంది 'ఆసియాన్'దేశాధినేతల సమక్షంలో శుక్రవారం సగర్వంగా జరుపుకున్న రిపబ్లిక్ దినోత్సవం సార్థకం కావాలంటే భారత గణతంత్రంలోని బహుళ సంస్కృతినీ, బహుముఖీనతనూ పరిరక్షించుకోవడం తప్పనిసరి. ఇప్పుడు కలవరపెడుతున్న పెడధోరణులను అరికట్టడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఇప్పటికైనా నడుంబిగిస్తే అది హృదయపూర్వకంగా ఆహ్వానించదగిన పరిణామం అవుతుంది. అటువంటి పూనిక ప్రభుత్వం తరపు నుంచి లేకపోతే ఏమి చేయాలన్నది ప్రశ్న. ఉదార హిందూత్వ అంటూ 'సాఫ్ట్ హిందూత్వ' విధానాన్ని రాజీవ్‌గాంధీ హయాం (అయోధ్యలో శిలాన్యాస్) నుంచీ అనుసరిస్తున్న కాంగ్రెస్‌కి ఇంతటి గురుతరమైన బాధ్యతను నిర్వర్తించే చిత్తశుద్ధీ, సామర్థ్యం ఉన్నాయని చెప్పలేం. న్యాయవ్యవస్థను రక్షించుకోండి అంటూ సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇటీవల ప్రజలకు విజ్ఞప్తి చేసినట్టే అన్ని మతాలనూ, ప్రాంతాలనూ, భాషలనూ, సంస్కృతులనూ సమాదరించే అద్భుతమైన దేశంగా ఇండియాను కాపాడుకోండని ప్రజలకు పురమాయించడం వినా మరో మార్గం కనిపించడంలేదు.

విశ్వాసాన్ని వమ్ముచేసిన విద్యామంత్రి



కరణ్ థాపర్

సత్యపాల్ సింగ్ నన్ను దిగ్భ్రాంతికి గురిచేశారు. ఈయన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ జూనియర్ మంత్రి (విద్య) మాత్రమే కాదు. ముంబై మాజీ పోలీస్ కమిషనర్ కూడా. ఇలాంటి వ్యక్తులు సాధారణంగా హేతుబద్ధంగా, అప్రమత్తంగా ఉంటారు, తాము చెప్పింది వాస్తవాలకు అనుగుణంగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటారు కూడా. కానీ సత్యపాల్ సింగ్ ఇటీవల చార్లెస్ డార్విన్ పరిణామవాదాన్ని బహిరంగంగా ఖండించారు.

ఆయన ఏమన్నారంటే, 'డార్విన్ సిద్ధాంతం శాస్త్రీయంగా తప్పు... మన వారసులతో సహా ఏ ఒక్కరూ రాతపూర్వకంగా లేక మౌఖికంగా.. మనిషిగా మారిన వానరాన్ని తాము చూశామని చెప్పలేదు'. అంతేకాదు.. 'మనం పాఠశాల, కళాశాలల కరిక్యులమ్ మార్చాల్సిన అవసరముందని' మంత్రి పేర్కొంటూ, డార్విన్ సిద్ధాంతం తప్పు అని నిరూపించడానికి అంతర్జాతీయ కార్యక్రమం నిర్వహించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

మంత్రి ప్రకటనపై భారత్ లోని మూడు అగ్రశ్రేణి సైన్స్ అకాడమీలు ఆగ్రహం ప్రదర్శించాయి. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ దీనిపై ఉమ్మడి ప్రకటన చేస్తూ, 'మంత్రి ప్రకటనలో శాస్త్రీయ పునాది లేదు. పరిణామ వాదానికి డార్విన్ చేసిన ప్రభావవంతమైన దోహదం సర్వామోదం పొందింది. పరిణామ వాదానికి చెందిన ప్రాథమిక సత్యం పట్ల శాస్త్రీయ వివాదం ఏదీ లేదు. ఇది శాస్త్రీయ సిద్ధాంతం' అని స్పష్టం చేశాయి.

సీనియర్ మంత్రులు తనను మందలించినప్పటికీ సింగ్ తన ప్రకటనకు కట్టుబడ్డారు. తాను శాస్త్రజ్ఞుడినని, రసాయన శాస్త్రంలో పీహెచ్‌డి చేశానని చెప్పిన మంత్రి 'డార్విన్ సిద్ధాంతాన్ని ప్రపంచవ్యాప్తంగా సవాలు చేశారు. డార్వినిజం ఒక భ్రమ' అనేశారు.

మరోవైపున, రెండు వేలమంది శాస్త్రజ్ఞులు సంతకం చేసిన ఒక విడి ప్రకటన ఇంటర్నెట్‌లో ఉంది. 'శాస్త్రీయ సమాజం పరిణామ సిద్ధాంతాన్ని తిరస్కరించిందని ప్రకటించడం సత్యదూరం. తద్భిన్నంగా, వెలుగులోకి వస్తున్న ప్రతి కొత్త ఆవిష్కరణా డార్విన్ సూత్రీకరణలకు మద్దతు తెలుపుతూనే ఉంది.'

డార్విన్ సిద్ధాంతంపై సత్యపాల్ సింగ్ చేసిన ప్రకటన గురించి నేను అయిదు ముఖ్య విషయాలు చెబుతాను. మొదటిది, ఆయన సైన్స్ చదువుకుని ఉండవచ్చు కానీ, కెమిస్ట్రీలో పీహెచ్.డి పట్టా.. డార్విన్ వాదంపై వివాదం రేపే అర్హతను ఆయనకు కలిగించదు. ఆయన హోదా.. జన్యుశాస్త్రం అంటే వేదాంత అధ్యయన శాస్త్రం అని భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు చేసే ప్రకటనతో సమానం. కనీస శాస్త్ర విశ్వసనీయత కూడా తనకు లేదు.

రెండోది, డార్విన్ సిద్ధాంతాన్ని మంత్రి స్పష్టంగా తప్పుగా అర్థం చేసుకున్నారు. మనిషిగా మారిన వానరాన్ని తాము చూసినట్లు.. ఎవరూ చెప్పలేదని మంత్రి తెలిపినప్పుడు, కోట్లాది సంవత్సరాల క్రమంలో సాగిన పరిణామ ప్రక్రియ గురించి కాకుండా, ఆకస్మికంగా జరిగిన సంపూర్ణ పరిణామం గురించి డార్విన్ మాట్లాడినట్లుగా అర్థం చేసుకున్నారు. 'మన తాతముత్తాతలు' ఎన్నడూ పేర్కొనలేదు అని మంత్రి చెప్పినప్పుడు, ఒకవేళ వారు చూసి ఉంటే అది అద్భుతమయ్యేదన్న వాస్తవాన్ని మంత్రి గుర్తించడం లేదు.

ఆదిత్య హృదయం



మూడు, డార్విన్ సిద్ధాంతం గురించి లేవనెత్తిన ప్రశ్నలను కూడా మంత్రి తప్పుగా అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఆ ప్రశ్నలు డార్విన్ వాదాన్ని ఖండించడం కాకుండా, జీవానికి సంబంధించిన అన్ని సంక్లిష్టతలను పరిణామ వాదం పూర్తిగా వివరించలేదని మాత్రమే చెబుతున్నాయి. మరో మాటలో చెప్పాలంటే, పరిణామ వాదం వివాదాస్పదం కాలేదు. కానీ అది అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేదు. నాలుగు, ఒక విద్యాశాఖ మంత్రి ఇలా మాట్లాడటమే వైపరీత్యం. శాస్త్రవేత్తల మాటల్లో చెప్పాలంటే, 'శాస్త్రీయ ఆలోచనలు, హేతుబద్ధతను ప్రచారం చేయడానికి శాస్త్రీయ సమాజం చేస్తున్న ప్రయత్నాలను ఈ ప్రకటన దెబ్బతీస్తుంది.. పైగా ప్రపంచ స్థాయిలో దేశ ప్రతిష్టను ఇది పలుచన చేయడమే కాకుండా, భారతీయ పరిశోధకుల నిజమైన పరిశోధనపై విశ్వాసాన్ని ఇది తగ్గిస్తుంది'.

చివరగా, మంత్రి తన రాజ్యాంగపరమైన విధిని ఉల్లంఘించారు. 'శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవడం ప్రతి ఒక్క పౌరుడి విధి' అని ఆర్టికల్ 51 ఎ (హెచ్) ప్రకటిస్తోంది. విద్యామంత్రిగా, ఎంపీగానే కాకుండా పౌరుడిగా కూడా ఈ విషయంలో డాక్టర్ సత్యపాల్ సింగ్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు.

కాబట్టి, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి ప్రభుత్వంలో కొనసాగవచ్చా? కనీసం అతడిని విద్యా శాఖ నుంచి మరో పోర్ట్‌ఫోలియోకు తక్షణం మార్చవలసిన అవసరం లేదా? ఏ ఇతర విశిష్ట ప్రజాస్వామిక దేశంలో అయినా సరే, డార్విన్ పరిణామవాదాన్ని భ్రమ అని పేర్కొనే వ్యక్తిని చూసి నవ్విపోతారని నేను నమ్మకంగా చెప్పగలను. భారత్‌లో ఇది జరగనట్లయితే మన ప్రజాస్వామ్యాన్ని, విజ్ఞానశాస్త్రం పట్ల మన గౌరవాన్ని, మనల్ని పాలిస్తున్నవారి విశ్వసనీయతను గురించి ఏమని చెప్పాలి?

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : karanthapar@itvindia.net

వేయి కాళ్లు లేకున్నా...

కొన్ని పరిశోధనలు మతి పోగొడతాయి. జెర్రి అనే ఒక విషక్రిమి విషయంలో ఇది రుజువైంది. వాపులకి విరుగుడు మందును దీని విషం నుంచి తీయడానికి పరిశోధనలు చేస్తున్నారు. ఇది కుడితే మనుషులకి బాగా వాచిపోతుంది. అది కాదు అసలు విషయం. ఒక విషపూరిత జెర్రి తన కంటే 15 రెట్లు పెద్దదైన మరో ప్రాణిని అవలీలగా ఆరగిస్తుందట. ఎలుక విషయంలో జెర్రి విషం ప్రాణాంతకం. ఈ భూ ప్రపంచం మీద ఉండే అతి పెద్ద మాంసాహార జీవులలో బ్లూవేల్ ఒకటి. ఇది రోజుకి లక్షల సంఖ్యలో క్రిల్ అనే జలచరాలను తింటుందట. అయితే అవి ఆస్ప్రిన్ మాత్ర అంతే ఉంటాయట. చైనాలో కనిపించే బంగారు రంగు తల ఉండే జెర్రి 45 గ్రాములు ఉండే తెల్ల ఎలుకని కూడా కుట్టి చంపి, తింటుందట. గుహల గోడల మీద ఉండే జెర్రులు గబ్బిలాలనూ కుట్టి చంపేసి తినగలవని వెనిజులా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నకిలీ వార్తల్ని మించిన పెను సమస్య!

మన దేశంలో డేటా వినియోగం గత కొన్ని సంవత్సరాలుగా అయిదు రెట్లు మించి పెరిగింది. అనేకులు స్మార్ట్‌ఫోన్లవైపు మొగ్గడం, వాట్సాప్‌లో వచ్చే అంశాలను అందరికీ పంపే ధోరణి పెరగడం ఇందుకు రుజువు. ఈ కారణంగా మాధ్యమం విస్తృతి ఎంతగానో పెరిగింది. ఇలాంటపుడు సహజంగానే నకిలీవార్తల బెడద ఎక్కువగా ఉంటుంది. అయితే మనకు దీన్ని మించిన మరో సమస్య ఉంది. నిజమైన వార్తలపై ఆసక్తి కొరవడటమన్నదే ఆ పెను సమస్య.

అవలోకనం



ఆకార్ పటేల్

కోల్‌కతాలో జరిగే సాహితీ సంరంభానికి వచ్చి ఈ వ్యాసం రాస్తున్నాను. గత పదేళ్లుగా ఇలాంటి పండుగలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇతర దేశాలకంటే మన దేశంలోనే ఇవి ఎక్కువ. నాకిది అసాధారణమే అనిపిస్తుంది. ఏదైనా రాయడం, సాహిత్యాన్ని చదవడం అనే సంస్కృతి మనకుంది. అలాగని మన సమాజంపై రచయిత ప్రభావం పెద్దగా ఉండదు. చెక్ రిపబ్లిక్ తొలి అధ్యక్షుడిగా ఎన్నికైన వాక్లవ్ హావెల్ లాంటివారు ఇక్కడ ఉద్భవించే అవకాశం లేదు. ఉపాధ్యాయుల్లాగే రచయితలపై కూడా అందరికీ గౌరవం ఉంటుంది. కానీ వారిని అనుసరించే తత్వం ఎక్కడా ఉండదు. మరి ఇన్ని సాహితీ సంరంభాలెందుకు? ఒక్కో సంరంభానికి ఇన్ని వేలమంది, వారిలో అత్యధికంగా యువతే ఎందుకుంటున్నారు? నా పరిశీలనలో తేలిందేమంటే, ఇతరచోట్ల... ప్రత్యేకించి విశాల ప్రజానీకంలో చర్చించడానికి సాధ్యపడని అంశాలకు ఇలాంటి సమూహాల్లో చోటుండటమే అందుకు కారణం. కనుకనే చాలా సాహితీ ఉత్సవాల్లో పుస్తకాల గురించి, రచయితల గురించి కాక సమకాలీన ఘటనలపైనా, మారుతున్న సమాజ స్వభావంపైనా చర్చించడమే ఎక్కువ కనబడుతుంది. ఈ వారం నేను నకిలీ వార్తల (ఫేక్ న్యూస్)పై జరిగిన బృంద చర్చలో పాల్గొన్నాను.

ఈ నకిలీవార్తలను మనం రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. ఒకటి– అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాన్ని అర్థం చేసుకున్న తీరులో. ఆయనకు న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, సీఎన్ ఎన్‌లు ఆ కోవలో కనిపిస్తాయి. మిగిలిన ప్రపంచం, ప్రత్యేకించి పాత్రికేయ లోకం ఈ పత్రికలనూ, చానెళ్లనూ ప్రశంసించదగ్గవిగా, సాధికారమైనవిగా భావిస్తాయి. తనను విమర్శిస్తాయి గనుక ట్రంప్ దృష్టిలో ఇవి నకిలీవార్తలను తయారుచేసేవే. ఈ ఫేక్‌న్యూస్‌ను మనం మరో రకంగా చెప్పొచ్చు. తప్పుడు వార్తగా, వండివార్చిన వార్తగా తెలిసినా దాన్ని దురుద్దేశంతో ప్రత్యేకించి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంలో పెట్టే వార్తల్ని నకిలీ వార్తలని అనొచ్చు. ప్రపంచంలో ఒక మూల జరిగిన హింసాత్మక ఘటన తాలూకు ఫొటోను మరొకచోట జరిగినట్టుగా చూపే ప్రయత్నం చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. అలాగే ఒక పరి స్థితిని లేదా ఒకరి వ్యక్తిత్వాన్ని వివరించే పేరిట అవాస్తవాలను 'నిజాలు'గా ప్రచారం చేయడం కూడా ఈ కోవకిందికే వస్తుంది. వాట్సాప్ ద్వారా ఇలాంటి సరుకు అందరికీ వస్తూనే



ఉంటుంది కనుక ఇంతకుమించి దీని లోతుల్లోకి వెళ్లను.

ఫేక్‌న్యూస్ చర్చలో పాల్గొన్న బృందంలో నాతోపాటు అహ్మదాబాద్‌కు చెందిన ప్రతీక్ సిన్హా కూడా ఉన్నారు. ఆయన ఆల్ట్‌న్యూస్ డాట్ ఇన్(altnews.in) అనే వెబ్‌సైట్‌ను నడుపుతున్నారు. జనబాహుళ్యంలో ప్రచారంలో ఉన్నవాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవి తప్పుడు వార్తలో, నిజమైనవో తేల్చడం ఆయన పని. దేశ పౌరులను తప్పుడు వార్తలతో, నిర్ధారణ కాని వార్తలతో చీల్చడానికి ప్రయత్నించేవారిని బట్టబయలు చేయడంలో ఆ వెబ్‌సైట్ ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోంది. గత మే నెలలో పిల్లల కిడ్నాపర్ల గురించి ప్రచారంలోకొచ్చిన ఒక తప్పుడు వార్త పర్యవసానంగా జార్ఖండ్‌లో ఏడుగురిని ప్రజలు కొట్టిచంపారు. ప్రతీక్‌సిన్హా కొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. మన దేశంలో డేటా వినియోగం గత కొన్ని సంవత్సరాల్లో అయిదు రెట్లు మించి పెరిగింది. ప్రజల్లో అనేకులు స్మార్ట్‌ఫోన్‌ల వైపు మొగ్గడం, వాట్సాప్‌లో వచ్చే అంశాలను అందరికీ పంపే ధోరణి పెరగడం ఇందుకు రుజువు. మాధ్యమం విస్తృతి పెరిగి అది ఎన్నో రకాలుగా రూపాంతరం చెందడం వల్ల చిన్న స్థాయి సంస్థలు, వ్యక్తులు కూడా ప్రచురణకర్తలుగా మారారు. ఇలాంటి పరిస్థితుల్లో దేన్నయినా ధ్రువీకరించగలిగే వర్గాల సంఖ్య కూడా పెరగాలి. అయితే మనకున్న పెద్ద సమస్య తప్పుడు వార్తలు కాదు... నిజమైన వార్తలపై ఆసక్తి కొరవడటమేనని నాకనిపిస్తుంది. ఉదాహరణకు మన దేశం ఆరోగ్య రంగానికి కేటాయించే మొత్తానికి పదిరెట్లు ఎక్కువగా రక్షణపై వ్యయం చేస్తుంది (ఆరోగ్యానికి చేసే ఖర్చు రూ. 40,000 కోట్లయితే... రక్షణ వ్యయం రూ. 4లక్షల కోట్లు). ఇది ఇటీవలి సంగతి కాదు. మనమెప్పుడూ ఆసుపత్రులు, వైద్యులు, మందుల కంటే శతఘ్నులు, విమానాలు, నౌకలు కొనడానికి ఎక్కువ ఖర్చుపెడుతుంటాం. అన్ని ప్రభుత్వాలూ ఇలాగే చేస్తాయి. ఏ పార్టీ కూడా దీన్ని వ్యతిరేకించదు.


ఈశాన్య భారతంలో ఆంతరంగిక భద్రత కోసం సైన్యాన్ని ఉపయోగించడం ప్రారంభించి ఈ ఏడాదితో అరవైయ్యేళ్లవుతుంది. ఇంత సుదీర్ఘకాలం దేశ పౌరులు సైనిక పాలనలో ఎందుకుండాలని మనం ప్రశ్నించలేమా? పదాల గారడీని పక్కన బెట్టి మాట్లాడుకోవాలంటే సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం కింద బలవంతంగా ఒక జనాభా మొత్తాన్ని ఉంచడం సైనిక పాలన అనే అనాలి. కానీ దీనిపై మన రాజకీయ పార్టీలకు లేదా దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన పౌరులకు ఆసక్తే ఉండదు. నేను చెప్పబోయే మూడో ఉదాహరణ ఇటీవలికాలానిదే. మన పాలక పార్టీ జాతీయవాదానికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పుకుంటుంది. కానీ ఆచరణలో రాజకీయ వివక్షను పాటిస్తుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం ఎమ్మెల్యేల సంఖ్యను ఒకసారి చూద్దాం: గుజరాత్–సున్నా, ఉత్తరప్రదేశ్–సున్నా, మహారాష్ట్ర–సున్నా, మధ్యప్రదేశ్–సున్నా, చత్తీస్‌గఢ్–సున్నా, జార్ఖండ్–సున్నా. ఇతరచోట్ల నామమాత్రం. మత ప్రాతిపదికన భారతీయుల్ని విడగొట్టడం మన కళ్లముందే జరుగుతోంది. మరి ఎందుకని అందరూ దాన్ని ఉపేక్షిస్తారు? ఎందుకని చర్చించరు? ఎందుకంటే అసమ్మతి స్వరాలు వినబడవు గనుక. అవి కేవలం సాహితీ ఉత్సవాల వంటి చోటే లేవనెత్తుతారు గనుక. ట్రంప్‌కూ, పాశ్చాత్య ప్రపంచానికీ నకిలీ వార్తల బెడద అంత ముఖ్యమూ కాదు. వాటికి పర్యవసానాలూ ఉండవు. కానీ భారత్‌లో అలాంటి వార్తలు ప్రాణాలు తీసే పరిస్థితులు కూడా ఉన్నాయి. అయితే నకిలీ వార్తల బెడద ఇక్కడ ఉన్నా లేకున్నా మన సమస్యలు ఎప్పటికీ ఇలాగే ఉంటాయని మాత్రం మనం అంగీకరించితీరాలి.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత I a

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం
ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం
తిథి శు.ద్వాదశి రా.2.45 వరకు, తదుపరి త్రయోదశి
నక్షత్రం మృగశిర రా.11.30 వరకు, తదుపరి ఆరుద్ర
వర్జ్యం ఉ.6.17 నుంచి 7.46 వరకు
దుర్ముహూర్తం సా.4.17 నుంచి 5.03 వరకు
అమృతఘడియలు ప.3.14 నుంచి 4.44 వరకు.

నమాజ్ వేళలు



ఫజర్	:	5.34
జొహర్	:	12.29
అసర్	:	4.33
మగ్రీబ్	:	6.09
ఇషా	:	7.24

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.48
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

టాప్‌లో 'భారత్ అంటే బిజినెస్'



వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్న 'భారత్ అంటే బిజినెస్' హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ఎక్కువ సార్లు ప్రస్తావనకు వచ్చిన విషయంగా నిలిచింది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రముఖంగా వినిపించిన అంశాలపై అమెరికాకు చెందిన టాక్‌వాకర్ అనే సంస్థ చేసిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. 'భారత్ అంటే బిజినెస్' హ్యాష్‌ట్యాగ్ అత్యధికంగా 39,252 సార్లు ప్రస్తావనకు రాగా, తరువాతి స్థానాల్లో వరసగా మహిళలు(35,837), అమెరికా ఫస్ట్(31,449), సంపద(22,896), కృత్రిమ మేధ(19,018), ప్రపంచీకరణ(16,513), వాతావరణ మార్పులు(15,477)అనే హ్యాష్‌ట్యాగ్‌లున్నాయి. వ్యక్తుల పరంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (2.73 లక్షల సార్లు) అగ్ర భాగంలో నిలిచారు. ఆ తరువాత ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్, బ్రిటన్ ప్రధాని థెరిసా, జర్మన్ చాన్స్‌లర్ మెర్కెల్ ఉన్నారు. ఈసారి దావోస్ పేరు సామాజిక మాధ్యమాల్లో 20.20 లక్షల సార్లు ప్రస్తావనకు వచ్చినట్లు టాక్‌వాకర్ వెల్లడించింది. కాగా, గణతంత్ర దినోత్సవం సందర్భంగా రికార్డు స్థాయిలో నెటిజెన్లు 10 లక్షల ట్వీట్లు చేసినట్లు సిలికాన్ వ్యాలీ కేంద్రంగా పనిచేస్తున్న సోషల్ మీడియా సంస్థ ఒకటి వెల్లడించింది. శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా రిపబ్లిక్ డే హ్యాష్‌ట్యాగే ఎక్కువగా ప్రచారమైనట్లు పేర్కొంది.

హోం వర్క్ చేయనందుకు
168 చెంపదెబ్బలు
తోటి విద్యార్థినులతో కొట్టించిన ఉపాధ్యాయుడు

జాబువా: హోం వర్క్ చేయనందుకు ఆరో తరగతి చదువుతున్న ఓ బాలికను ఉపాధ్యాయుడు తోటి విద్యార్థినులతో 168 చెంపదెబ్బలు కొట్టించారు. మధ్యప్రదేశ్‌లోని తాండ్లా పట్టణంలోని నవోదయ విద్యాలయలో జరిగిన ఈ ఘటన.. బాధిత విద్యార్థిని తండ్రి పోలీసులకు చేసిన ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగుచూసింది. అయితే దీన్ని తీవ్రంగా తీసుకోవాల్సిన పనిలేదని, ఇది స్నేహపూర్వకంగా విధించిన శిక్ష అని పాఠశాల ప్రిన్సిపల్ తేలిగ్గా కొట్టిపారేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు సూచనల మేరకు జనవరి 11–16 మధ్య తన కూతురును 14 మంది బాలికలు రెండేసి సార్లు చొప్పున ఆరు రోజులు చెంపదెబ్బలు కొట్టారని ఆమె తండ్రి ఆరోపించారు. అనారోగ్యంతోనే ఆమె హోం వర్క్ పూర్తిచేయలేదని అన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి స్కూల్‌కు కూడా తెలుసని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

52 ఏళ్ల తర్వాత ఖాళీచేస్తున్నాడు



సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు ఖాళీ చేస్తున్న కిరాయిదారుడు

న్యూఢిల్లీ: గుజరాత్‌లో ఓ వ్యక్తి 52 ఏళ్లుగా కోర్టు ఆదేశాలను పెడచెవినపెడుతూ తాను కిరాయికి ఉంటున్న ఇంటిని ఖాళీ చేయడం లేదు. ఎట్టకేలకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆయనకు చీవాట్లు పెట్టి ఆ ఇంటిని యజమానికి అప్పగిస్తూ తీర్పునిచ్చింది. కిరాయిదారుడు నెలలోపు ఖాళీచేయాలని, లేదంటే ఆయన సామాన్లు బయట పడేయాలని పోలీసులకు హుకుం జారీచేసింది. బీఎం పటేల్ అనే వ్యక్తి ఎంకే బ్యారట్‌కు తన ఇంటిని అద్దెకిచ్చారు. ఆ ఇంటిని మరో వ్యక్తికి అద్దెకిచ్చిన పటేల్..బ్యారట్‌ను ఖాళీ చేయించాలనుకున్నాడు. 1965లో ఇందుకు అనుకూలంగా స్థానిక కోర్టు నుంచి ఉత్తర్వులు కూడా తెచ్చుకున్నారు. ఈ నిర్ణయాన్ని సవాలుచేస్తూ బ్యారట్ పిటిషన్ దాఖలుచేసి కేసులో తదుపరి చర్యలు చేపట్టకుండా ఇంతకాలం అడ్డుకున్నారు. గతేడాది గుజరాత్ హైకోర్టు కూడా ఖాళీచేయాల్సిందేనని బ్యారట్‌ను ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలుచేస్తూ సుప్రీంకోర్టు చేరిన ఆయనకి గట్టి దెబ్బే తగిలింది. గురువారం ఈ కేసు విచారణకు రాగా అసలు విషయం తెలిసి జడ్జీలు జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్ షాక్‌కు గురయ్యారు. 52 ఏళ్లుగా కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న బ్యారట్‌ను కోర్టు తీవ్రంగా మందలించారు. నెలలోపు ఖాళీచేయాలని ఆయన తరపు లాయర్‌కు స్పష్టం చేశారు.

పదివేల ఏళ్ల నాటి క్రేయాన్‌ను ఇంగ్లండ్‌లో కనుగొన్నారు. జంతువుల చర్మానికి రంగులేయటం, చిత్రలేఖనం కోసం వీటిని వినియోగించి ఉంటారని పురాతత్వ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



అఫ్గాన్‌లో మారణహోమం

కాబూల్‌లో అంబులెన్స్ బాంబుతో తాలిబన్ దాడి

95 మంది మృతి, 151 మందికి గాయాలు

కాబూల్

అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో శనివారం తాలిబన్లు మారణహోమం సృష్టించారు. నగరంలో రద్దీగా ఉన్న ప్రాంతంలో ఆత్మాహుతి దాడికి పాల్పడి 95 మంది ప్రాణాల్ని బలితీసుకున్నారు. ఈ దాడిలో 151 మంది గాయపడ్డారు. అంబులెన్స్‌లో భారీగా పేలుడు పదార్థాలు నింపి దానిని పేల్చేయడంతో ఈ ఘోరం జరిగింది. ఏం జరిగిందో తెలియక కొద్ది సేపు షాక్‌కు గురైన ప్రజలు వెంటనే తేరుకుని పరుగులు తీశారు. పేలుడు తమ పనేనని ఉగ్రవాద సంస్థ తాలిబన్ ప్రకటించుకుంది. తాలిబన్ అనుబంధ సంస్థ హక్కానీ నెట్‌వర్క్ పాత్ర ఉండవచ్చని అఫ్గాన్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అంతర్యుద్ధంతో తీవ్రంగా దెబ్బతిన్న కాబూల్‌లో ఇటీవల కాలంలో చోటుచేసుకున్న అతిపెద్ద దాడి ఇదే.

భీతావహ వాతావరణం

పేలుడు ధాటికి పలు భవంతులు, కార్యాలయాలు పాక్షికంగా ధ్వంసం కాగా.. మృతదేహాలు, రక్తమోడుతోన్న క్షతగాత్రులతో ఆ ప్రాంతం భీతావహ వాతావరణాన్ని తలపించింది. రెండు కిలోమీటర్ల దూరంలోని భవనాల అద్దాలు సైతం పగిలిపోయాయి. సమీపంలోని చిన్న భవనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఉగ్రదాడిలో 95 మంది ప్రాణాలు కోల్పోయారని, 151 మంది గాయపడ్డారని అఫ్గాన్ వైద్య శాఖ ప్రతినిధి వహీద్ చెప్పారు. అవయవాలు తెగిపడి, రక్తమోడుతున్న క్షతగ్రాతులతో కాబూల్‌లోని జమూరియతే ఆసుపత్రి నిండిపోయింది. ఇటాలియన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డేజన్ మాట్లాడుతూ.. 131 మంది క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించామని చెప్పారు. పేలుడు ప్రాంతానికి సమీపంలోని షాపు యజమాని అమినుల్లా ఆ భీతావహ పరిస్థితిని వెల్లడిస్తూ'మా బిల్డింగ్ ఊగిపోయింది. కిటికీ అద్దాలన్నీ పగిలిపోయాయి. మార్కెట్‌లోని ప్రజలంతా షాక్‌లో ఉన్నాం' అని చెప్పారు. 'పదుల సంఖ్యలో ప్రజలు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. రక్తపు మడుగులు ప్రవహించాయి' అని మరో వ్యక్తి పేర్కొన్నాడు.



తీవ్రంగా గాయపడిన చిన్నారి

పోలీసుల కళ్లుగప్పి..

నిరంతరం భారీ భద్రత నడుమ ఉండే ప్రాంతంలోనే పేలుడు జరగడంతో కాబూల్ ఉలిక్కిపడింది. పేలుడు సంభవించిన ప్రాంతానికి సమీపంలో అంతర్జాతీయ సంస్థలు, విదేశీ రాయబార కార్యాలయాలు, మంత్రిత్వ శాఖల భవనాలు ఉన్నాయి. 'ఆస్పత్రికి రోగిని తీసుకెళ్తున్నట్లుగా నటిస్తూ అంబులెన్స్ డ్రైవర్ వీధి ప్రారంభంలోని మొదటి చెక్ పోస్టులో తనిఖీ లేకుండానే ముందుకెళ్లాడు. రెండో చెక్ పాయింట్ వద్ద పోలీసులు అంబులెన్స్‌ను ఆపేందుకు ప్రయత్నించగా వేరే దారిలోకి డ్రైవర్ వాహనాన్ని మళ్లించాడు. పోలీసులు అంబులెన్స్‌కు అడ్డుపడడంతో.. పేలుడు పదార్థాలతో నిండిన ఆ వాహనాన్ని డ్రైవర్ పేల్చేశాడు' అని హోం శాఖ ప్రతినిధి నస్రత్ తెలిపారు. ఈ దాడిని నాటోతో పాటు, అమెరికా, బ్రిటన్ సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. కాబూల్ ఘటనను భారత్ తీవ్రంగా ఖండిస్తూ.. సూత్రధారుల్ని, వారి మద్దతుదారుల్ని చట్టం ముందు నిలబెట్టాలని విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.



కాబూల్‌లో బాంబు దాడి ధాటికి ధ్వంసమైన వాహనాలు

నదిలో పడిన బస్సు.. 13 మంది మృతి



సాక్షి ముంబై: ప్రయాణికులతో వెళ్తున్న ఓ మినీబస్సు నదిలో పడటంతో 13 మంది మృతిచెందారు. ఘటన మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుల్లో తొమ్మిది నెలల పాప సహా ఏడుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. మితిమీరిన వేగంతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి పంచగంగ నదిలో పడిపోయిందని అధికారులు తెలిపారు. స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ మద్యం సేవించడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతులంతా పుణేకి చెందిన వారిగా గుర్తించారు.

2017 సంవత్సరపు హిందీ పదంగా 'ఆధార్'

జైపూర్: ఆధార్ కార్డుతో దేశవాసుల మనసుల్లో బాగా నాటుకుపోయిన 'ఆధార్'కు 2017 సంవత్సరపు హిందీ పదంగా గుర్తింపు లభించింది. జైపూర్ సాహితీ వేడుకలో భాగంగా శనివారం 'ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీస్' అంశంపై జరిగిన చర్చలో దీనిపై ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆధార్ తర్వాత మిత్రోన్(అసలు రూపం మిత్రో), నోట్‌బందీ, గోరక్షక్ అనేవి హిందీ పదాలు కూడా బాగా ప్రాచుర్యం పొందినట్లు వివిధ రంగాల నిపుణులు పేర్కొన్నారు. అయితే, జనం నోళ్లలో అత్యధికంగా నానిన పదం మాత్రం ఆధారేనని ఈ చర్చ సందర్భంగా పాత్రికేయుడు ద్వివేది వెల్లడించారు.

దేశంలో తొలి మహిళా ఇమామ్!



మలప్పురం: ఇటీవల దళితుల్ని ఆలయాల్లో పూజారులుగా నియమించిన కేరళలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. దేశచరిత్రలోనే తొలిసారిగా ఓ మహిళ శుక్రవారం ప్రార్థనల(జుమ్మా నమాజ్)కు ఇమామ్‌గా వ్యవహరించింది. మలప్పురంలోని ఖురాన్ సున్నత్ సొసైటీ కార్యదర్శి జమిథా(34) తమ సంస్థ కార్యాలయంలో శుక్రవారం నమాజ్‌కు నేతృత్వం వహించారు. ఈ ప్రార్థనలకు పలువురు మహిళలు సహా 80 మంది హాజరయ్యారు. ఈ విషయమై జమిథా స్పందిస్తూ.. పవిత్ర ఖురాన్ పురుషులు, స్త్రీల మధ్య ఎలాంటి వివక్ష చూపదని చెప్పారు. మహిళలు ఇమామ్ కాకూడదని ఖురాన్‌లో ఎక్కడా లేదని వెల్లడించారు.

విభేదాలు సహజమే!



ప్రజాస్వామ్యంలో ఐకమత్యం కోసం కృషిచేయాలి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యంలో భేదాభిప్రాయాలు ఉండొచ్చని.. కానీ ప్రతి ఒక్కరు ఐకమత్యం కోసం కృషిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సమాజంలోని మూఢవిశ్వాసాలను తరిమేసేందుకు, సమాజంలో మార్పు తీసుకురావటంలో బాధ్యత తీసుకోవాలని ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, శకటాల కళాకారులకు ప్రధాని సూచించారు. 'బలోపేతమైన, ప్రగతిశీల దేశాన్ని నిర్మించేందుకు అవసరమైన శక్తి అందరు ఐకమత్యంగా ఉంటేనే లభిస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అభిప్రాయాలు వేర్వేరుగా ఉండటంలో తప్పులేదన్నారు. కులం, మతం, సమాజం వంటి జాఢ్యాలను పక్కనపెట్టి సమాజాన్ని ఏకం చేసేందుకు ప్రతిఒక్కరు ప్రయత్నించాలన్నారు. మూఢనమ్మకాలను పారద్రోలటాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంటినుంచే ప్రారంభించాలని యువతకు సూచించారు. 2019 కల్లా స్వచ్ఛభారత్ లక్ష్యాలను చేరటంలో చొరవతీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశసేవలో భాగంగా పౌర,మిలటరీ పురస్కారాలను పొందిన వారి గురించి యువత తెలుసుకుని ప్రేరణ పొందాలని మోదీ తెలిపారు.

కంబోడియాతో 4 ఒప్పందాలు

భారత్–కంబోడియాల మధ్య రక్షణ బంధాల బలోపేతానికి కృషిచేయాలని ఇరుదేశాల ప్రధానులు నిర్ణయించారు. ఉగ్రవాద నిర్మూలనలో... ఉగ్రవాద నిర్వీర్యం చేయటంలో అంతర్జాతీయ సమాజాన్ని ఏకం చేయటంపై కలిసి పోరాడాలని పేర్కొన్నారు. ఇద్దరి మధ్య మధ్య రక్షణ, భద్రత, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో పరస్పరసాయానికి చర్చలు జరిగాయి. అనంతరం వీరిరువురి సమక్షంలో ఇరుదేశాల మధ్య 4 ఒప్పందాలపై శనివారం ఢిల్లీలో ఒప్పందాలు జరిగాయి. నేరస్తుల అప్పగింత, నేర సంబంధిత విచారణకు న్యాయసాయం, కంబోడియాలోని స్వా హబ్ నీటి వనరుల అభివృద్ధి ప్రాజెక్టుకు భారత రుణసాయం (దాదాపు రూ.234 కోట్లు) అంశాలపై ఈ ఒప్పందాలు చేసుకున్నారు. తర్వాత మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కంబోడియాకు ఆరోగ్యం, రోడ్ల అనుసంధానత, డిజిటల్ అనుసంధానత తదితర అంశాల్లోనూ రుణసాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉగ్రవాదం మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ అని.. ప్రపంచశాంతికి ఇది పెనువిఘాతం కల్గిస్తోందని మండిపడ్డారు. కాగా, ప్రధాని మోదీ ఫిబ్రవరి 9నుంచి నాలుగురోజుల పాటు విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. వరుసగా పాలస్తీనా, యూఏఈ, ఒమన్ దేశాల్లో మోదీ పర్యటించనున్నారు.

రాష్ట్రపతిని కలిసిన రాహుల్


న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశమయ్యారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా వీరిద్దరు భేటీ అయ్యారు. 'రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో రాష్ట్రపతి భవన్‌లో సమావేశం అయ్యాను. చాలా ఆనందంగా ఉంది' అని రాహుల్ ట్వీట్ చేశారు. గతేడాది డిసెంబర్‌లో సోనియా నుంచి అధ్యక్ష బాధ్యతలు అందుకున్న అనంతరం గౌరవసూచకంగానే రాష్ట్రపతిని రాహుల్ కలిశారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

జీఎస్టీ రేట్లలో మరిన్ని మార్పులు: జైట్లీ

న్యూఢిల్లీ: భవిష్యత్తులో జీఎస్టీ రేట్లలో మరిన్ని మార్పులు జరుగుతాయని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. అమల్లోకి వచ్చిన ఏడాదిలోనే ఈ విధానానికి స్థిరత్వం వచ్చిందని తెలిపారు. దీని పరిధిని విస్తరించటంతోపాటు రేట్లలో హేతుబద్ధత సాధిస్తామని చెప్పారు. జీఎస్టీతో పరోక్ష పన్నుల విధానంలో సమూల మార్పులు వచ్చాయని జైట్లీ తెలిపారు. జీఎస్టీకి తుదిరూపు తెచ్చేందుకు మిగతా దేశాలతో పోలిస్తే చాలా స్వల్ప సమయం పట్టిందన్నారు.

కాస్‌గంజ్‌లో పెరిగిన ఉద్రిక్తత

రిపబ్లిక్ డే ర్యాలీపై రాళ్లదాడి ఘటనతో ఇరువర్గాల ఘర్షణ



ఆందోళనకారులు నిప్పంటించిన బస్సులు

కాస్‌గంజ్: పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ పట్టణంలో గణతంత్ర దినోత్సవ ర్యాలీ సందర్భంగా రేగిన ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయి. శనివారం కూడా కొందరు ఆగంతకులు విధ్వంసానికి పాల్పడ్డారు. ఓ బస్సు, మూడు దుకాణాలను, ఇతర వాణిజ్య సముదాయాలను తగలబెట్టారు. దీంతో పట్టణంలో శాంతిభద్రతల పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు 144 సెక్షన్ (కర్ఫ్యూ) కొనసాగిస్తున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి 49 మందిని పోలీసులు అరెస్టు చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలో ఓ విద్యార్థి సంఘం చేపట్టిన తిరంగా ర్యాలీపై మరో వర్గం రాళ్లు రువ్వటంతో చందన్‌గుప్తా ఓ యువకుడు చనిపోగా మరో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. దీంతో వివాదం రేగింది. శనివారం గుప్తా అంత్యక్రియల అనంతరం ఓ వర్గం బస్సును తగులబెట్టగా.. ప్రత్యర్థి వర్గం దుకాణ సముదాయాలపై దాడులు చేసిందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోనే ఉందని.. ముందు జాగ్రత్త చర్యగా నిషేధాజ్ఞలు కొనసాగిస్తున్నామని యూపీ పోలీసు అదనపు డీజీ ఆనంద్ తెలిపారు. ఈ అల్లర్ల ఘటన దురదృష్టకరమని యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులను వదిలిపెట్టబోమన్నారు.

కర్ణిసేన నేత అరెస్ట్

పద్మావత్‌కు వ్యతిరేకంగా హింసకు పాల్పడిన కేసులో

గుర్గావ్: బాలీవుడ్ చిత్రం పద్మావత్‌కు వ్యతిరేకంగా హింసకు పాల్పడిన కేసులో స్థానిక కర్ణిసేన చీఫ్ ఠాకూర్ కుషాల్‌పాల్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గుర్గావ్‌లో విధ్వంసానికి కారణమైన వారిలో ఇప్పటి వరకూ 24 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పద్మావత్ చిత్ర ప్రదర్శనను నిరసిస్తూ ఆందోళనకారులు బుధవారం గుర్గావ్‌లో ఓ పాఠశాల బస్సుపై దాడిచేయడంతో పాటు ప్రభుత్వ బస్సుకు నిప్పు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నిందితుల్ని అరెస్ట్‌చేసి కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు పోలీస్ పీఆర్వో రవీందర్ కుమార్ చెప్పారు.

బ్రెజిల్ నైట్‌క్లబ్‌లో కాల్పులు

14 మంది మృతి

రియో డీ జనీరో: ఈశాన్య బ్రెజిల్‌లోని ఫోర్టలేజా నగరంలోని ఓ నైట్ క్లబ్‌లో ఆగంతకులు కాల్పులు జరపటంతో 14 మంది మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రుల పరిస్థితి తీవ్రంగా ఉందని ప్రభుత్వాధికారులు వెల్లడించారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి (స్థానిక కాలమానం ప్రకారం) 1.30 గంటలకు మూడు వాహనాల్లో వచ్చిన కొందరు సాయుధులు పార్టీలో ఉన్న వారిపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. గాయపడిన వారిలో ఓ పన్నెండేళ్ల బాలుడు కూడా ఉన్నాడు. 'ఇది కిరాతకమైన చర్య. ఇంత క్రూరమైన ఘటన ఎప్పుడూ చూడలేదు' అని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొంతకాలంగా స్థానికంగా ఉండే రెండు డ్రగ్స్ అక్రమరవాణా బృందాల మధ్య ఘర్షణ నెలకొందని.. ఈ ఘటన కూడా ఈ రెండు వర్గాల మధ్య గొడవేనని స్థానిక మీడియా పేర్కొంది. వీరి ఘర్షణలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. జనవరి 7న ఫోర్టలేజా శివార్లలోనూ ఓ పార్టీలో జరిగిన ఘర్షణలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.



కాల్పులు జరిగిన క్లబ్ ఇదే

చైనాలో స్పై విమానం



బీజింగ్: సముద్రాల్లో విమాన వాహక నౌకల నుంచి నియంత్రించగలిగే కొత్త గూఢచర్య విమానాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది. శత్రు దేశాల డ్రోన్లు, జెట్‌ల కదలికలను కనిపెట్టడానికి వీలుగా దీనికి ఏఈఎస్‌ఏ రాడార్‌ను అమర్చారు. కేజే–600 అనే పేరుగల ఈ గూఢచర్య విమానాన్ని చైనా అభివృద్ధిపరుస్తున్నట్లు ఆ దేశ అధికారిక మీడియా సోమవారం తొలిసారిగా బయటపెట్టిందంటూ హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. చైనా సముద్ర జలాల్లో ఇప్పటికే రెండు విమాన వాహక నౌకలు సేవలందిస్తుండగా, మూడో దానిని షాంఘైలో నిర్మిస్తోంది. తాజాగా అభివృద్ధి చేస్తున్న గూఢచర్య విమానాలను మూడో విమాన వాహక నౌకపై మోహరించే అవకాశం ఉన్నట్లు పత్రిక పేర్కొంది. గగనతలంలో అమెరికాకు దీటుగా తన సామర్థ్యాలను పెంపొందించుకునేందుకే కేజే–600ను చైనా నిర్మిస్తోందని సమాచారం. దీనిని దక్షిణ చైనా సముద్రం, హిందూ మహాసముద్రంలో మోహరించే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

యుగాంతానికి 2 నిమిషాలే!

డూమ్స్‌డే క్లాక్‌లో సమయం 30 సెకన్ల ముందుకు
గడియారంలో సమయం రాత్రి 11:58

వాషింగ్టన్

ప్రపంచ వినాశనం అత్యంత దగ్గరపడుతోందనడానికి సూచికగా డూమ్స్‌డే క్లాక్‌లో నిమిషాల ముల్లును మరో 30 సెకన్లు ముందుకు జరిపారు. ప్రస్తుతం డూమ్స్ డే క్లాక్‌లో సమయం రాత్రి 11.58 గంటలు. అంటే డూమ్స్ డే గడియారం ప్రకారం వినాశనానికి (12 గంటల సమయాన్ని వినాశనానికి గుర్తుగా భావిస్తారు) మనం రెండే నిమిషాల దూరంలో ఉన్నామన్నమాట. డూమ్స్ డే గడియారం ఎవరు నిర్వహిస్తారు, వినాశనానికి ఎంత దూరంలో ఉన్నామనేవి ఆసక్తికరంగా మారాయి.

1947లో ఏర్పాటు...

మానవాళి తన మతిలేని చర్యల వల్ల ప్రపంచ వినాశనానికి చేజేతులా ఎంత దగ్గరగా వెళుతోందో హెచ్చరించేందుకు ఏర్పాటు చేసిందే ఈ డూమ్స్‌డే గడియారం. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో మొదటిసారి అణ్వాయుధాలను తయారుచేసిన మాన్‌హట్టన్ ప్రాజెక్టులో భాగస్వాములైన అమెరికా సైంటిస్టులు 1945లో 'బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్' అనే జర్నల్‌ను ప్రారంభించారు. ఈ జర్నల్‌ను శాస్త్రవేత్తలే నిర్వహిస్తున్నారు. వారే 1947లో తొలిసారిగా డూమ్స్ డే గడియారం విధానాన్ని ఏర్పాటు చేశారు. తొలుత అణ్వాయుధాలు, అణు యుద్ధాల వల్ల పొంచి ఉన్న ప్రమాదాన్ని మాత్రమే డూమ్స్‌డే గడియారం ద్వారా హెచ్చరించేవారు. 2007 నుంచి వాతావరణ మార్పుల వల్ల కలిగే ముప్పును కూడా దీని ద్వారా హెచ్చరిస్తున్నారు.

అర్ధరాత్రి 12 అంటే వినాశనమే

గడియారంలో సమయం అర్ధరాత్రి 12 గంటలు అయ్యిందంటే ప్రపంచం అంతమైపోయినట్లే లెక్క. దీనిలో సమయం అర్ధరాత్రి 12కు ఎంత దగ్గరగా ఉంటే ప్రపంచం అంత ప్రమాదంలో ఉందని అర్థం. ఎంత దూరంగా ఉంటే అంత సురక్షితంగా ఉన్నట్లు భావిస్తారు. 1947 నుంచి ఇప్పటి వరకు ఈ గడియారంలో సమయాన్ని 20 సార్లు మార్చారు. మానవాళి వినాశనానికి ఎంత దూరంలో ఉందన్న దానిని బట్టి సమయాన్ని ముందుకు, వెనక్కు మారుస్తూ ఉంటారు. 1991లో అమెరికా, సోవియట్ రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక గడియారంలో సమయాన్ని రాత్రి 11.43కు మార్చారు. అంటే నాడు ప్రపంచం వినాశనానికి 17 నిమిషాల దూరంలో ఉందని అర్థం.

రెండోసారి రెండు నిమిషాల వ్యవధి

ప్రపంచం వినాశనానికి అత్యంత దగ్గరగా ఉన్నట్లు తొలిసారిగా 1953లో ఈ గడియారం చూపించింది. ఆ ఏడాది అమెరికా, సోవియట్ యూనియన్‌లు హైడ్రోజన్ బాంబులు పరీక్షించడంతో సమయాన్ని 11.58కి మార్చారు. అంటే వినాశనానికి రెండు నిమిషాల దూరంలో ప్రపంచం ఉందని అర్థం. మళ్లీ ఈ ఏడాది, ఈ నెలలోనే దీనిని 11.58కి మార్చారు. అణ్వాయుధాలు, వాతావరణ మార్పులకు సంబంధించి రేకెత్తుతున్న ఆందోళనలపై ప్రపంచ దేశాల అధినేతలు సరైన విధంగా స్పందించడం లేదంటూ ఈ నెలలో సమయాన్ని 11.58కి మార్చారు. ఉత్తర కొరియాపై అణు దాడికి సిద్ధంగా ఉన్నామంటూ ట్రంప్ పరోక్షంగా ప్రకటించడం, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగాలని ట్రంప్ నిర్ణయం తీసుకోవడం తదితరాలను ఇందుకు కారణాలుగా భావించవచ్చు.

గడియారంలో ముఖ్య ఘట్టాలు

- 1947లో ఏర్పాటు చేసినప్పుడు సమయం రాత్రి 11:53. అంటే వినాశనానికి ఏడు నిమిషాల దూరం.
- 1949లో సోవియట్ యూనియన్ తొలి అణుపరీక్ష. సమయం 4 నిమిషాల ముందుకు. అంటే 11:57
- 1953లో అమెరికా తొలి హైడ్రోజన్ బాంబు పరీక్ష. మరో నిమిషం ముందుకు. అంటే 11:58.
- 1991లో ప్రచ్ఛన్న యుద్ధం యుగియడంతో 14 నిమిషాలు వెనక్కు జరిపారు. అంటే11:43గా మార్చారు.
- 1998లో భారత్, పాక్‌లు అణ్వాయుధాలను పరీక్షించడంతో ఎనిమిది నిమిషాలు ముందుకు జరిపారు. అంటే 11:51
- 2016– తీవ్రమైన వాతావరణ మార్పులు, భారీ అణ్వాయుధ పరీక్షలు. 2 నిమిషాలు ముందుకు–11:57
- 2017– అణ్వాయుధాల ఆధునికీకరణ, వాతావరణ మార్పులతో సమయం 30 సెకన్లు ముందుకు–11:57:30



'డూమ్స్‌డే క్లాక్' సవరణ తరువాత మీడియాతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కళలు, విద్య, పరిశ్రమలు, సాహిత్యం, సైన్స్, ఆటలు, మెడిసిన్, సమాజ సేవ, ప్రజా కార్యక్రమాల రంగాల్లో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు.



తెలిసింది మిస్టరీ.. సృష్టిస్తా హిస్టరీ!



లాటరీలు అంటే మనకు అంతగా పరిచయం లేదుగానీ.. విదేశాల్లో వాటికి ఉండే క్రేజే వేరు. తమదైన రోజున అనేకమంది అనామకులు లాటరీ అదృష్టం తగిలి రాత్రికిరాత్రే వేలకోట్లకు అధిపతులయ్యారు. చైనాలోని వాంగ్ చెంగ్ జౌ అనే వ్యక్తికి ఇలాంటి లాటరీ పిచ్చే ఉంది. లాటరీ టికెట్లు కొనడం.. తన టికెట్ ప్రైజ్‌మనీ గెలుచుకుందో లేదో చూసుకుంటూ ఉండేవాడు. 2004లో బహుమతి గెలుచుకున్న ఓ లాటరీ టికెట్‌ను చూసిన వాంగ్ దీని వెనుక ఏదో పెద్ద గణిత సూత్రం ఉందని భావించి.. దాన్ని ఎలాగైనా కనుక్కోవాలని అనుకున్నాడు. ఇక అంతే ఇళ్లు, కుటుంబసభ్యులను వదిలేసి కొంత డబ్బు తీసుకుని పాడుబడ్డ బ్రిడ్జి కింద ఉన్న గుహకు చేరాడు. లాటరీ గుట్టును ఛేదించే పనిలో పడ్డాడు. లాటరీ గుట్టును రట్టు చేసి రాత్రికిరాత్రే కోటీశ్వరుడు అయిపోవడమే తన జీవిత లక్ష్యంగా మార్చుకుని పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ఓ చానల్ ఈ విషయాన్ని తెలుసుకుని కథనాన్ని ప్రసారం చేసింది. దీన్ని చూసిన వాంగ్ తల్లి అతన్ని ఇంటికి రావాలని కోరగా.. గుట్టు ఛేదించే వరకు ఇంటి గడప తొక్కనని శపథం చేశాడు. ఎట్టకేలకు 10 ఏళ్ల కష్టపడి లాటరీల వెనుకున్న రహస్యాన్ని గుర్తించాడు. అయితే ఆ రహస్యాన్ని తెలపాల్సిందిగా మీడియా కోరగా.. రహస్యాన్ని బయటపెట్టలేనిని సున్నితంగా తిరస్కరించాడు. అయితే త్వరలో దీన్ని పుస్తక రూపంలో తెస్తానని అన్నాడు. ఒకసారి పుస్తకం విడుదలైతే తన వద్దకు వందల మిలియన్లు వచ్చి పడతాయని వాంగ్ తెగ సంబరపడిపోతున్నాడు.

'స్వీట్' లేడీ!





తీరైన కనుబొమ్మలు... జాలువారే కురులు.. చూడచక్కని రూపం.. రాజసం ఉట్టిపడే వస్త్రధారణ.. కలిగిన ఈ ఫోటోలోని బొమ్మను చూస్తే ఓహో అనాల్సిందే! కానీ దీన్ని కేవలం బొమ్మ అనుకుంటే మీరు పొరబడినట్లే! అందమైన ఈ బొమ్మరూపంలో ఉన్నది ''కేకు'' అని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు.! చైనాకు చెందిన జోయా అనే వ్యక్తి వీటిని ఇలా అద్భుతంగా చాలా జాగ్రత్తగా తయారు చేస్తాడు. అందుకే ఇతడిని 'షుగర్ కింగ్' అని అక్కడి జనం ముద్దుగా పిలుచుకుంటారు. చైనాలోనే ది బెస్ట్ కేకులు తయారు చేసే వ్యక్తిగా జోయాకి పేరుంది. అయితే ఈ కేకుల తయారీలో అంతర్జాతీయ కేకు పోటీల్లో మూడు బంగారు, రెండు కాంస్య పతకాలు దక్కించుకున్నాడు. ఇంకేముంది మనోడు ప్రపంచవ్యాప్తంగా ఫేమస్ అయిపోయాడు. ముఖ్యంగా చైనా సంస్కృతి, సంప్రదాయాలకు తన కేకుల్లో రూపం పోస్తాడు.

కేసీఆర్‌ను గద్దె దించే రోజులు దగ్గర్లోనే

సీఎం జిల్లాలోనే రైతు ఆత్మహత్యలెక్కువ: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావును గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రోజుకో కొత్త మాటతో ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలోనే ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని, అయినా ఆయనలో చలనం లేదని నిప్పులు చెరిగారు. శనివారం గాంధీభవన్‌లో సిద్దిపేట జిల్లాకు చెందిన జేఏసీ నేత భూపతిరెడ్డితో పాటు వివిధ పార్టీల నేతలు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హామీల గురించి ప్రశ్నిస్తే సీఎం సహించలేకపోతున్నారని ఆరోపించారు.

✦ ప్రగతిభవన్‌ను ప్రజాస్పత్రిగా మారుస్తాం

హైదరాబాద్: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా ఆసుపత్రిగా మారుస్తామని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ తెలిపారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రగతి భవన్‌లో సీఎం విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బస్తీబస్తీకి తెలుగుదేశం పార్టీ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యిందన్నారు.

✦ 6న కలెక్టరేట్ల వద్ద నిరాహార దీక్షలు

హైదరాబాద్: వచ్చే నెల 6న రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నామని బీసీ సంక్షేమ సంఘం నేత, ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నామన్నారు.

✦ ప్రశ్నించే గొంతులను నొక్కడమే: శ్రవణ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని వేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 506, 507 సెక్షన్లను సవరిస్తూ నిర్ణయం తీసుకుందని పీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛను హరించే హక్కు ముఖ్యమంత్రికి ఎక్కడిదని ప్రశ్నించారు. కోర్టు అనుమతి లేకుండానే విచారించి, జైలులో పెట్టే హక్కును పోలీసులకు ఇవ్వడం అంటే, పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కును కాలరాయడమే అవుతుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా కేసులు పెట్టడానికి, జైలులో పెట్టడానికే ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుందన్నారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టులో నిలదీస్తామని అన్నారు.

వీరేశాన్ని విచారించాలి

డీజీపీని కోరిన టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, నేతలు

- కోమటిరెడ్డి అనుచరుడి హత్య వెనుక ఆయన పాత్ర ఉంది
- చర్యలు తీసుకోకుంటే సీబీఐ విచారణ కోసం పోరాడతాం
- తనను చంపేందుకూ కుట్ర: ఎమ్మెల్యే కోమటిరెడ్డి



శనివారం డీజీపీకి వినతిపత్రం సమర్పించి వెలుపలకు వచ్చిన పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి. చిత్రంలో రాజగోపాల్ రెడ్డి, వీహెచ్, గీతారెడ్డి, షబ్బీర్, కోమటిరెడ్డి, దాసోజు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో టీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాత్రపై విచారణ జరపాలని డీజీపీని కోరారు. ఈ మేరకు ఉత్తమ్ నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ నేతలు శనివారం డీజీపీ మహేందర్‌రెడ్డిని కలసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ హత్యపై పూర్తి విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వీరేశం పాత్రపైనా విచారించాలని డిమాండ్ చేశారు. కొద్ది రోజులుగా నల్లగొండలోనే మకాం వేసి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను టీఆర్ఎస్‌లో చేరాలని వీరేశం బెదిరిస్తున్నారని, అందులో భాగంగానే శ్రీనివాస్ హత్య జరిగిందని తాము భావిస్తున్నామని ఆరోపించారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోకపోతే సీబీఐ విచారణ కోసం పోరాడతామని స్పష్టం చేశారు.

కేసీఆర్ అండతో రెచ్చిపోతున్నారు: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఎమ్మెల్యే వీరేశం కనుసన్నల్లోనే తన అనుచరుడి హత్య జరిగిందని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి అండతో వీరేశం రెచ్చిపోతున్నారని, తమను కూడా హతమార్చేందుకు కుట్రలు పన్నుతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతోపాటు చిరుమర్తి లింగయ్యకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, దీనిపై విచారణ జరపాలని డీజీపీని కోరామని తెలిపారు. శ్రీనివాస్ హత్యలో తనపై ఆరోపణలు చేస్తున్న టీఆర్ఎస్ నేతలు.. నిందితులు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో తెలుసుకోవాలని కోమటిరెడ్డి సూచించారు. బీసీలే టార్గెట్‌గా ప్రభుత్వం వేధిస్తోందని, నిందితులందరినీ ఎన్‌కౌంటర్ చేయాలని మాజీ ఎంపీ వీహెచ్ డిమాండ్ చేశారు. కోమటిరెడ్డికి ఏమైనా జరగరానిది జరిగితే రాష్ట్రం అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. డీజీపీని కలసిన వారిలో షబ్బీర్ అలీ, గీతారెడ్డి, మల్లు రవి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, దాసోజ్ శ్రవణ్ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

టీఆర్ఎస్‌కు సంబంధం లేదు

హతుడు, నిందితులంతా కాంగ్రెస్ వారే: కర్నె ప్రభాకర్
ఏ ఘటన జరిగినా తమ పార్టీకి ఆపాదిస్తున్నారని ధ్వజం



శ్రీనివాస్ హత్య కేసు నిందుతులు కోమటిరెడ్డితో దిగిన ఫొటోను చూపిస్తున్న కర్నె ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో టీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా దాన్ని టీఆర్ఎస్‌కు ఆపాదించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలసి కర్నె శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, నల్లగొండలో జరిగిన శ్రీనివాస్ హత్యకు మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, చివరకు సీఎం బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేతలు కోరడం విడ్డూరంగా ఉందన్నారు. హతుడు శ్రీనివాస్, నిందితులు రాంబాబు, మల్లేశ్, శరత్‌లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచర బృందంలోని వారేనన్నారు. జానారెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వీహెచ్ తదితరులు నల్లగొండకు వెళ్లి శవ రాజకీయాలు చేస్తున్నారని కర్నె విమర్శించారు. శ్రీనివాస్ హత్యపై న్యాయ విచారణ జరగాలని తామూ కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే వీరేశం ఫోన్‌కాల్స్ లిస్ట్ బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ... కోమటిరెడ్డి ఫోన్‌కాల్స్ జాబితాను కూడా బయట పెట్టాల్సిందిగా కోరాలన్నారు. ఫొటోలే విచారణకు ప్రామాణికమైతే నిందితులంతా కోమటిరెడ్డితో ఫొటోలు దిగారని, ప్రెస్‌మీట్‌లో ఆ ఫొటోలను విడుదల చేశారు. ఎమ్మెల్యే వీరేశంతో నిందితులు దిగిన ఫొటో ఆయన పీజీ పరీక్ష రాసేందుకు వచ్చినప్పుడు కాలేజీ వద్ద దిగినదని, యువ శాసన సభ్యుడు కాబట్టి వీరేశంతో వారు ఫొటోలు దిగారన్నారు.

దళితులు ప్రశ్నించడమే నేరమా?

మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణ

- అప్పుడు కేసీఆర్, కేటీఆర్‌లను ఎందుకు జైల్లో పెట్టలేదు
- నేను ప్రశ్నిస్తే ఒకే నెలలో రెండు సార్లు అరెస్టు చేశారు
- జస్టిస్ కర్ణన్‌కు ఒక న్యాయం, అగ్రవర్ణ జడ్జీలకు మరో న్యాయమా?
- ఎస్సీ వర్గీకరణపై సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: దళితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణతోనే దళితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. శనివారం టీజేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. 'ఉమ్మడి రిజర్వేషన్ల విధానం విఫలమైంది. దళితుల్లో అభివృద్ధి చెందిన కులాలే రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నాయి. ఎస్సీ వర్గీకరణ కోసం చర్యలు తీసుకోమంటే కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అందుకే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. కానీ ప్రశ్నించే హక్కును ప్రభుత్వం హరిస్తోంది. నిలదీసే వ్యక్తిని అక్రమంగా జైల్లో పెడుతోంది. నన్ను ఒకే నెలలో రెండుసార్లు అరెస్టు చేశారు. నేను చేసిన నేరమేంటో ప్రభుత్వం చెప్పాలి' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

దళితుడిని కావడంతోనే జైల్లో పెట్టారు

తెలంగాణ ఉద్యమంలో భాగంగా 'మిలియన్ మార్చ్'జరిగిన సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కోదండరాంలపై పదుల సంఖ్యలో కేసులు నమోదైనప్పటికీ ఒక్కరినీ జైల్లో పెట్టలేదని మంద కృష్ణ అన్నారు. కానీ తాను దళితుడు కావడంతో నిర్దాక్షిణ్యంగా జైల్లో పెట్టారన్నారు. 'సుప్రీంకోర్టు కొలీజియం తీరును జస్టిస్ కర్ణన్ తప్పుబడితే ఆయనను జైల్లో పెట్టాలని ఓ జడ్జి తీర్పునిచ్చారు. కానీ అదే కొలీజియం తప్పులు చేస్తోందని, పక్షపాతంగా వ్యవహరిస్తోందని సుప్రీంకోర్టు జడ్జీలు గొంతెత్తి మీడియా ముందుకొచ్చారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం వారితో సంప్రదింపులు చేస్తోంది. ఒక దళితుడు ప్రశ్నిస్తే నేరం.. అగ్రవర్ణాలు, సంపన్నులు ప్రశ్నిస్తే మాత్రం సంప్రదింపులు చేస్తారా'అంటూ మండిపడ్డారు. దళితులపై అణచివేతకు ఇంతకంటే పెద్ద ఉదంతం అవసరం లేదన్నారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని, పరుష పదజాలం వాడితే కోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా అరెస్టు చేయాలని నిర్ణయించడం దారుణమని అన్నారు. తాము అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ చెప్పిందని.., మరి కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి ఇంకా వందరోజులు కాలేదా? అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక బృందాన్ని ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. వర్గీకరణపై సోమవారం హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ముగిసిన కేటీఆర్ దావోస్ పర్యటన

సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ దావోస్ పర్యటన ముగిసింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ఆయన పలు సమావేశాల్లో ప్రసంగించడంతో పాటు అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు, చైర్మన్లతో చర్చలు జరిపారు. కేటీఆర్ బృందం నిర్వహించిన ఈ పర్యటన విజయవంతమైందని ఆయన కార్యాలయం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, టీఎస్ఐపాస్ పనితీరు, సింగిల్ విండో విధానంలో అనుమతులు తదితర అంశాలపై వివరించారంది. ఈ సదస్సులో జరిగిన చర్చల ద్వారా వరంగల్‌లో టెక్ మహీంద్ర కార్యాలయం ఏర్పాటుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఐటీ రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు ఇది అద్భుత స్పందన అని పేర్కొన్నారు.

72వ రోజు

27-01-2018, శనివారం
తిమ్మసముద్రం,
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా



దివ్యాంగుల జీవితాల్లో చీకటి నింపుతున్నారు

ఈ రోజు ఉదయం.. కొందరు పేదింటి పిల్లలు చేతుల్లో గులాబీ పూలతో స్వాగతం పలికారు. ఆ చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలంటే.. వారిని బాగా చదివించాలని వారి తల్లులకు చెబుతూ.. వారి చదువులకు మన ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ యాత్ర ప్రారంభించాను. కాస్త దూరం నడవగానే, రంగారెడ్డి అనే సోదరుడు నవ్వుతూ నా వద్దకు వచ్చి 'ఒక ఫొటో తీసుకుందామన్నా..' అంటూ నాతో ఫొటో దిగాడు. ఇడుపులపాయలో యాత్ర మొదలైనప్పటి నుంచి నాతో నడుస్తున్నాడు. ఆ అన్నకు నాన్నగారన్నా, నేనన్నా అమితమైన అభిమానమట. మధ్యాహ్నం వేళకు ఒక వార్త వినగానే దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆ సోదరుడికి గుండెపోటు వచ్చిందని, ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు కన్నుమూశాడన్న మాట వినగానే.. ఒక్కసారిగా స్తంభించిపోయాను. బాధతో మనసంతా మెలిపెట్టినట్లయింది. విధి రాత ఒక్కోసారి అలానే ఉంటుందేమో! ఆయన భౌతికకాయానికి నివాళులర్పించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఇంత పెద్ద కష్టాన్ని తట్టుకునే శక్తిని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆ దేవుడిని ప్రార్థించాను.

ఈ రోజు వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కలిశారు. ఈ ప్రభుత్వం తమపట్ల చూపుతున్న నిర్లక్ష్యం గురించి బాధగా వివరించారు. 'అన్నా.. దివ్యాంగులమై మేము కూడా మా హక్కుల కోసం పోరాడాల్సి వస్తోంది. వికలాంగులకు రూ.1,500 పింఛన్ అంటూ మేనిఫెస్టోలో బాబు గారు స్పష్టంగా చెప్పారు. కానీ.. వైకల్యంలో కూడా శాతాల లెక్కలేసి, 80శాతం వరకూ ఉన్నవారికి రూ.1,000, 80శాతం పైన ఉన్నవారికి రూ.1,500 ఇస్తున్నారు. అయితే.. దివ్యాంగ సమాజం మొత్తానికి రూ.1,500 ఇస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. 2016లో చేసిన వికలాంగుల హక్కుల చట్టాన్ని కూడా అమలు చేయడం లేదు. మా కార్పొరేషన్‌ను గాలికొదిలేశారు. ఆఖరికి వికలాంగ సర్టిఫికెట్ తెచ్చుకోవడానికి సైతం నరకయాతన అనుభవిస్తున్నాం. గ్రామాల్లో జన్మభూమి కమిటీలు మా హక్కులను కాలరాస్తున్నాయి. మా లాంటి వారు సైతం లంచాలివ్వాల్సిందే. మా పట్ల కూడా పార్టీల వివక్ష చూపిస్తున్నారు'అని చెబుతూ ఉంటే.. ఇది అసలు ప్రజా ప్రభుత్వమేనా? అనిపించింది. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులతో పాటు ప్రయాణించే సహాయకులకు ఇచ్చే రాయితీని కూడా తీసేశారట. వికలాంగులకు ఇచ్చే ఉపకరణాలలో కూడా కోత విధించారట. చాలా బాధనిపించింది. దివ్యాంగులు సమాజంలో సగర్వంగా జీవించాలని నాన్నగారు తాపత్రయ పడ్డారు. దివ్యాంగుల పట్ల ప్రభుత్వ వైఖరి పూర్తిగా మారాల్సిన అవసరం ఉంది. వారికి సర్టిఫికెట్లు మంజూరు చేసి పింఛన్లు ఇచ్చే దగ్గర్నుంచి.. ఉద్యోగాల వరకూ అన్ని విషయాల్లో వారికి అనుకూలంగా సమగ్ర మార్పులు తీసుకొస్తాం. ఈ రోజు సూళ్లూరుపేట నియోజకవర్గం పూర్తయి గూడూరు నియోజకవర్గంలోకి ప్రవేశించాను. సీఎం గారికి నాదో ప్రశ్న.. ఈ జిల్లాలో ఇంత వరకు నా పాదయాత్ర జరిగిన 2 నియోజ కవర్గాలనే చూద్దాం.. సూళ్లూరుపేట నియోజకవర్గంలో శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు లాంటి సెజ్‌లు, గూడూరు నియోజక వర్గంలో స్వర్ణముఖి బ్యారేజీ, కండలేరు నుంచి గూడూరుకు తాగునీటి పథకం, రైల్వే ఫ్లైఓవర్ వంటి ఎన్నెన్నో కార్యక్రమాలు.. నాన్నగారి హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనాలు. మరి అత్యంతకాలం సీఎంగా పనిచేశానని గొప్పగా చెప్పుకొనే మీరు.. ఈ ప్రాంతాలకు చేసిన ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్నైనా చూపించగలరా? సీఎంగా ఇంతకాలం ఉండి ఏం లాభం?

వై.యస్. జగన్.

అరాచకాలు భరించలేకపోతున్నాం..

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమని అధికార పార్టీ నేతల కక్ష

- ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎదుట గోడు వెళ్లబోసుకున్న జనం
- చెరువులకు నీళ్లివ్వకుండా వేధిస్తున్నారు.. ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు
- మనందరి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని జగన్ హామీ

ప్రజా సంకల్పయాత్ర నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి :

'విపక్షం అంటేనే టీడీపీ వాళ్లు విరుచుకు పడుతున్నారు.. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమని తెలిస్తే చాలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు.. కనీస మానవత్వం కూడా మరచిపోతున్నారు..వారి అరాచకాలు భరించలేకపోతున్నాం. ఒకటా? రెండా? చెప్పుకుంటూపోతే మా బాధలు వర్ణనాతీతం..'అని టీడీపీ నేతలు, ప్రస్తుత ప్రభుత్వ తీరుతో ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రజలు ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆయన (చంద్రబాబు) మాటలు నమ్మి న్యాయం చేస్తారని ఓట్లు వేసి గెలిపించాం. నాలుగేళ్లుగా ఒక్క హామీ నెరవేరకపోగా, కొత్త కష్టాలు చుట్టుముట్టాయ'ని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 72వ రోజు శనివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఓజిలి మండలం చిలమానుచేను క్రాస్ నుంచి మొదలైన జగన్ పాదయాత్ర గూడూరు నియోజకవర్గంలోని తిమ్మసముద్రం వరకూ సాగింది. పూలబాటలతో ప్రతీ పల్లె ఘన స్వాగతం పలికింది. కాండ్రా గ్రామంలో ఇసుకేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. తమ కష్టాలు వినే నాయకుడు వచ్చాడంటూ చిన్నా పెద్దా.. అభిమాన నేత అడుగులో అడుగులేస్తూ తమ బాధను చెప్పుకున్నారు. అందరి సమస్యలను ఓపికగా విన్న జగన్.. 'ఇంకో ఏడాది ఓపిక పట్టండి.. మనందరి ప్రభుత్వం వస్తుంది. అందరి కష్టాలు తీరుతాయి. అన్ని వర్గాల వారినీ ఆదుకుంటాం'అని ధైర్యం చెబుతూ ముందుకు సాగారు.

ఏకంగా చెరువులే ఎండగట్టారు..

పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామ రైతులు చిలమాను క్రాస్ రోడ్డు వద్ద జననేతను కలిసి కష్టాలు చెప్పుకున్నారు. అనంతరం రైతులు లింగమనాయుడు, రవి, చలపతి తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉండటాన్ని అధికార పార్టీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. తెలుగు గంగ నుంచి నీళ్లు వెళ్తున్నా చుక్క నీరివ్వకుండా వేధిస్తున్నారని, దీంతో పెల్ల కూరు మండలంలో 26 చెరువులు ఎండి పోయాయని, ఆ పరిధిలోని భూముల్లో పంటలు వేయలేదన్నారు. ప్రతిపక్షం పట్ల ఇంత దారుణంగా వ్యవహరిస్తారా? ఇదేనా ప్రజాస్వామ్యం? అంటూ కన్నీరు పెట్టుకున్నారు.



శనివారం వెంకటేశుపల్లిలో దివ్యాంగురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న వైఎస్ జగన్

ఐకమత్యంగా ఉన్నామని జైల్లో పెట్టారు

సంఘం ఏర్పాటు చేసుకుని ఐకమత్యంగా ఉన్నందున ప్రభుత్వ పెద్దలు తమపై కక్షగట్టి జేసి జైలుకు పంపారని పాదయాత్ర సాగుతున్న ప్రాంతానికి దగ్గర్లోని టోల్‌ప్లాజాలో పని చేస్తున్న కార్మికులు జగన్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. కనీసపాటి హక్కుల సాధన కోసం అందరం ఐకమత్యంగా ఉన్నామని తమ యజమాని మంత్రి నారాయణ అండతో కక్షగట్టి జేశారని చెప్పారు. ఉద్యోగాల నుంచి తొలగించారని, ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపారని వాపోయారు. పెల్లకూరు మండల ప్రజలు స్వర్ణముఖి నది గుండె కోతను జననేత ముందుంచారు. అడ్డగోలుగా ఇసుక తీసు కెళ్తున్నారని, లారీలకు టీడీపీ జెండా కన్పిస్తే చాలు పోలీసులూ ఏమీ అనడం లేదని, చెన్నైకి తరలించి కోట్ల రూపాయలు దండుకుంటున్నారని వివరించారు.

మా బడి పరిస్థితి చూడండన్నా..

చిలమాను క్రాస్ దాటి ముందుకెళ్తున్న పాదయాత్ర ఒక్కసారిగా గురుకుల పాఠశాల వద్ద ఆగింది. 'అన్నా.. 1994లో మా స్కూలు నిర్మించారు. పక్కనే క్వారీ ఉంది. ప్రహరీ గోడ లేదు. పిల్లలు అటుగా వెళ్తూ క్వారీలో పడి చనిపోతున్నారు. ఇలా ఎంతో మంది ప్రాణాలు పోయాయయన్నా' అని చిన్నారులు వివరించారు. అధిపార్టీ నేతలు, అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. ఆర్మేనిపాడు గ్రామం వద్ద దివ్యాంగులు జననేతను కలిశారు. తమ లాంటి వాళ్లు ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు పొదుపు సంఘాలను నిండా ముంచారని సంపూర్ణమ్మ, సుమతి, చెంగమ్మలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

వెయ్యి కిలోమీటర్లకు చేరువలో పాదయాత్ర

ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర సోమవారం వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని దాటనుంది. మూడు వేల కిలోమీటర్ల లక్ష్యంతో గత ఏడాది నవంబర్ 6న ఇడుపులపాయ నుంచి మొదలైన పాదయాత్ర వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పూర్తి చేసుకుని ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగుతోంది. నాలుగేళ్లగా తాము ఎలాంటి కష్టాలు అనుభవి స్తున్నారో వివిధ వర్గాల ప్రజలు జగన్‌కు దారిపొడవునా వివరిస్తున్నారు. పాదయాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని దాటే సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాక్ విత్ జగన్ కార్యక్రమాన్ని చేపట్టింది. జగన్‌కు సంఘీభావంగా ఇప్పటికే దుబాయ్ తదితర దేశాలలో 'వాక్ విత్ జగన్'కార్యక్రమాన్ని నిర్వహించారు.. మరికొన్ని చోట్ల ఇంకా నిర్వహిస్తున్నారు. వెయ్యి కిలోమీటర్ల పాదయాత్రకు గుర్తుగా నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం సమీపంలోని కైవల్య నది వద్ద 25 అడుగుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు. పాదయాత్రకు గుర్తుగా ఈ స్థూపం నిలువనుంది. స్థూపం శిఖరాగ్రాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకం ఎగిరేలా ఏర్పాటు చేశారు. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వాక్ విత్ జగన్ కార్యక్రమం జరగనుంది.

అవ్వా.. నీ మనవడినొచ్చాను..

పాదయాత్ర కాండ్రా గ్రామం మీదుగా సాగుతున్నప్పుడు ఓ ఇంటి వద్ద 80 ఏళ్ల వృద్ధురాలు కూర్చుని ఉంది. ఆమె ముఖంలో ఏదో ఆతృత.. మధ్య మధ్యలో పొన్నుకర్ర సాయంతో పైకి లేవడానికి విఫలయత్నం.. జనసంద్రంలోంచే ఆ దృశ్యాన్ని గమనించిన జగన్.. సరాసరి ఆ అవ్వ వద్దకు వెళ్లారు. ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. ఆ అవ్వకు కళ్లు కూడా కన్పించవని తెలుసుకుని 'అవ్వా నీ మనవడిని.. జగన్‌ను వచ్చాను'అంటూ పలకరించాడు. ఆ అవ్వ కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. నోట మాట రాలేదు. ఈ ఉద్విగ్న భరిత సన్నివేశం అక్కడున్న వారందరినీ కాసేపు కట్టిపడేసింది.

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ
ఆదివారం ॥ 28-1-2018



ఫొటోలు: శివ మల్లాల

ప్రగ్యా జైస్వాల్

'కంచె'లో సీతగా తెలుగు స్క్రీన్‌కి కనెక్ట్ అయిన జబల్పూర్ అమ్మాయి... ప్రగ్యా జైస్వాల్. అందులో ఆమె.. వెల్ మెచ్యూర్డ్. చీర వల్ల ఆ మెచ్యూరిటీ వచ్చిందా.. లేక, చిరునవ్వు వల్ల వచ్చిందా.. చెప్పడం కష్టం. మొత్తానికైతే.. ఆమె చీర కొంగు కంచెలో చిక్కుకుపోయింది! ఆ తర్వాత ప్రగ్యా ఎన్నో సినిమాల్లో మెరిశారు. కానీ 'కంచె' దాటలేకపోతున్నారు! సీతకు కంచె దాటాలని ఉంది.. ట్రెడిషనల్‌గానే కాదు.. ట్రెండీగా కూడా అందరూ తనను ఇష్టపడాలని ఉంది.

ప్రగ్యకు కంచె?

సాక్షి ఎక్స్‌క్లూజివ్

● ఎలా ఉన్నారు సీతగారూ?

మీరూ అలానే పిలిచారా? 'కంచె' రిలీజై రెండేళ్లకు పైనే అయినా ఆ సినిమాలో నేను చేసిన సీత క్యారెక్టర్‌ని మాత్రం ఎవరూ మరచిపోవడంలేదు. 'ఆ సినిమాలో మీరు సూపర్ అండి. బాగా యాక్ట్ చేశారు' అని ఇప్పటికీ కాంప్లిమెంట్స్ వస్తున్నాయి.

● అంత ఇంపాక్ట్ చూపించింది కాబట్టే, మీరు చీరల్లోనే కనపడాలని చాలామంది కోరుకుంటున్నారు..

మీరన్నది కరెక్టే. మొన్నా మధ్య మోకాళ్లకు కొంచెం పైన ఉండే డ్రెస్ ఒకటి వేసుకున్నాను. సోషల్ మీడియాలో ఆ ఫొటో షేర్ చేస్తే 'మీరిలాంటి డ్రెస్సులు వేసుకోవద్దు. మీరు ప్రిన్సెస్. సీతలా ఉండండి' అని రిక్వెస్ట్ మెసేజులు వచ్చాయి. 'కంచె'తో సీత ఓవర్. ప్రతి రోజూ నేను చీరలు కట్టుకోలేను కదా. ఇప్పుడు వేరేలా కనిపించాలన్నది నా ఆలోచన.

● ఒక ఆర్టిస్ట్ మీద ఏదైనా ఇమేజ్ పడితే దాన్నుంచి బయటపడటం టఫ్ కదా..

అవునండి. అలాగని ఆ ఇమేజ్‌కి తగ్గ క్యారెక్టర్సే చేస్తే రొటీన్ అంటారు. నిజానికి నాకు అన్ని రకాల రోల్స్ చేయాలని ఉంది. గ్లామరస్‌గా కనిపించడానికి నాకేం అభ్యంతరం లేదు. మంచి కథల్లో కనిపించాలనుకుంటా. ఆ కథకు న్యాయం చేయడానికి అవసరమైతే చీర లేకపోతే జీన్స్, డీసెంట్‌గా ఉండే షార్ట్ డ్రెస్సెస్.. ఇలా ఏదైనా నాకు ఓకే. స్క్రిప్ట్ ముందు ఇమేజ్ ముఖ్యం కాదు కదా.

● ఇమేజ్‌లో ఇరుక్కుపోయినా, డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయకపోయినా, ఎమోషన్స్ కంట్రోల్ చేసుకోలేకపోయినా కెరీర్‌కి నష్టం. ఎంతైనా మీ ప్రొఫెషన్ చాలా డిఫికల్ట్ అండి బాబూ...

ఈ మాటలు కొంతవరకూ నిజమే. అందుకే నేను డిఫరెంట్ రోల్స్ చేయడానికి ట్రై చేస్తున్నాను. సినిమా పరిశ్రమలోకి వచ్చాక నేను నేర్చుకున్న ముఖ్యమైన విషయం 'బ్యాలెన్సింగ్'. ఎమోషన్స్ కంట్రోల్ చేసుకోవడం అలవాటైంది. లొకేషన్‌లో బోలెడంత మంది ఉంటారు. అందరూ ఒకేలా ఉండరు. మనం వాళ్లలా ఉండం. అలాంటప్పుడు కొంచెం జాగ్రత్తగానే డీల్ చేయాలి. ఈ నాలుగేళ్లల్లో నేనది నేర్చుకున్నాను. సహనం పెరిగింది. మెంటల్లీ చాలా మెచ్యూర్టీ వచ్చింది.

● ఏ క్యారెక్టర్ అయినా మీరు బాగానే చేస్తారు కానీ పెద్ద రేంజ్‌కి ఎందుకు చేరుకోలేకపోతున్నారు?

అనుకున్న రేంజ్ రావడం లేదన్నది కరెక్టే. అయితే ఏదీ మన చేతుల్లో ఉండదు. ప్రతిదానికీ ఓ టైమ్ ఉంటుంది. నేను కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతాను. కెరీర్‌కి ఉపయోగపడుతుందని నమ్మి చేసిన కొన్ని సినిమాలు వర్కవుట్ కాలేదు. అయితే ఎవర్నీ నిందించడంలేదు. ఎందుకంటే కావాలని ఎవరూ బ్యాడ్ మూవీ తీయరు కదా. 'కంచె' తర్వాత నా మీద ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. తెలుగు ప్రేక్షకులు ఆ సినిమా గురించి ఇప్పటికీ మాట్లాడుతున్నారంటే సీత వాళ్లకు బాగా నచ్చేసింది. ఈ మధ్య ముంబై వెళితే అక్కడ కూడా ఈ క్యారెక్టర్ గురించే మాట్లాడారు. అందుకే నేను డబుల్ హ్యాపీ. ఆ పాత్ర కోసం పడిన కష్టమే మిగతావాటికీ పడుతున్నాను. అయినా సీతను మరచిపోవడంలేదు.

● హీరోయిన్‌గా చేస్తూ అప్పుడప్పుడూ గెస్ట్ రోల్స్ కూడా చేస్తున్నారు. వాటివల్ల అడ్వాంటేజ్ ఏంటి?

రాఘవేంద్రరావుగారిలాంటి డైరెక్టర్ సినిమాలో చిన్న పాత్ర అయినా బాగానే ఉంటుంది. అందుకే 'నమో వెంకటేశాయ'కి అడగ్గానే ఒప్పుకున్నాను. నేను అనుకున్నట్లు ఆ సినిమా నాకు మంచి గుర్తింపు తెచ్చింది. నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. ఆ సినిమాలో 'చిన్మయానందం..' సాంగ్‌కి మంచి స్కోప్ దొరికింది. ఇక, బోయపాటి శ్రీనుగారు ఎంత మంచి డైరెక్టరో తెలుసు. 'జయ జానకి నాయక'లో నాది గ్లామరస్ క్యారెక్టర్. 'కంచె' సీత ఇమేజ్ నుంచి కొంచెం బయటపడటానికి స్కోప్ ఉన్న క్యారెక్టర్ ఇచ్చారు. ఏ పాత్ర అయినా చేయగలుగుతానని ప్రూవ్ చేసుకోవడానికి ఈ సినిమా ఓ మంచి చాన్స్. భవిష్యత్తులో ఎవరైనా గెస్ట్ రోల్స్‌కి అడిగితే కెరీర్‌కి ఉపయోగపడేలా ఉంటేనే ఒప్పుకుంటాను.

● అవునూ.. ఈ నాలుగేళ్లల్లో మీ గురించి 'లింక్ అప్స్', 'కాంట్రవర్సీస్' రాలేదు. ఎలా జాగ్రత్తపడుతున్నారు?

(నవ్వుతూ). ఏదైనా చేస్తే కదా జాగ్రత్తపడటానికి. ఒకరితో ఎక్కువ ఒకరితో తక్కువ అన్నట్లుగా కాకుండా అందరితోనూ ఫ్రెండ్లీగా ఉంటాను. టైమ్‌కి షూటింగ్‌కి వెళ్లకపోయినా, షూటింగ్ స్పాట్‌లో అతిగా బిహేవ్ చేసినా వివాదాలు వచ్చేవి. నేనెప్పుడూ అలా చేయలేదు.

● మీతో పాటు మీ పేరెంట్స్ కనిపించరు.. నార్త్ నుంచి సౌత్ వచ్చి సోలోగా మేనేజ్ చేయడం గొప్ప విషయమే..

ఒంటరిగా లైఫ్ లీడ్ చేయడం నాకు కొత్త కాదు. కాలేజ్ డేస్‌లో హాస్టల్‌లో ఉండేదాన్ని. అమ్మవాళ్లు జబల్‌పూర్‌లో ఉంటే, నా హాస్టల్ పుణేలో. చదువు పూర్తయ్యాక ముంబైలో ఉండేదాన్ని. ఇప్పుడూ అక్కడే. అమ్మానాన్న ఫిజికల్‌గా నాతో లేకపోయినా రోజూ ఫోన్‌లో మాట్లాడుతుంటారు. ఏ మూమెంట్‌లోనూ నేను వీక్ అవ్వనంత సపోర్ట్ ఇస్తారు.

● ఆడపిల్ల ధైర్యంగా దూసుకెళ్లడానికి తండ్రి లేక తల్లి.. ఒక్కో ఇంట్లో ఇద్దరూ కారణమవుతారు. మీ ఇంట్లో?

ఇద్దరూ. బట్ మా అమ్మ స్ట్రాంగ్ లేడీ. తన కూతురు కూడా అలాగే ఉండాలని కోరుకుంది. నాకు కరాటే నేర్పించింది. బేసిక్‌గా నేను సెన్సిటివ్ గర్ల్. సేమ్ టైమ్ స్ట్రాంగ్ గర్ల్. ఆ క్రెడిట్ పూర్తిగా మా అమ్మకే దక్కుతుంది.

● స్కూల్ డేస్‌లో కరాటే నేర్చుకున్నారంటే అబ్బాయిలు మీ జోలికి రావడానికి భయపడేవాళ్లేమో?

భయం సంగతి పక్కపెడితే నేను చాలా బోరింగ్. వెరీ గుడ్ స్టూడెంట్‌ని. పైగా నేను చదువుకున్నది అమ్మాయిల స్కూల్‌లోనే. ప్లస్ వన్, ప్లస్ టూ అప్పుడు నేను కాలేజ్ 'హెడ్ గర్ల్'. అంత పెద్ద రెస్పాన్సిబుల్టీ ఇచ్చారంటే ఎంత మంచి స్టూడెంట్‌నో ఊహించుకోవచ్చు.

● స్వీయానుభవంతో చెప్పండి... అమ్మాయిలందరూ సెల్ఫ్ డిఫెన్స్ ఆర్ట్ నేర్చుకోవాల్సిన అవసరం ఉందంటారా?

తప్పకుండా. కూతురు అందంగా ఉండాలి. బాగా చదివించాలి. మంచి అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేయాలని కలలు కంటారు. దాంతో పాటు ఏదైనా జరగకూడనిది జరిగితే మన అమ్మాయి ఎదుర్కోగలుగుతుందా? అని కూడా ఆలోచించాలి. నీడలా ఉండాలి కానీ వెలుగు లేనప్పుడు ఒంటరిగా నడిచే ఆత్మస్థయిర్యాన్ని కూడా ఇవ్వాలి. అడ్వైస్ చేస్తున్నాననుకోకండి... అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించండి.

● ప్రతి అమ్మాయి లైఫ్‌లో ఏదో ఒక టైమ్‌లో ఓ 'బ్యాడ్ మేన్' తారసపడకుండా ఉండడు. లేకపోతే లక్కీయే.. మరి మీ లైఫ్‌లో?

మీరన్న లక్కీ గర్ల్స్‌లో నేనూ ఉన్నాను. నాకు తెలిసినవాళ్లు 'ఫిల్మ్ ఇండస్ట్రీలో చెడ్డవాళ్లు ఎక్కువట. ఎలా డీల్ చేస్తున్నావ్' అని అడుగుతుంటారు. అందరూ అంటున్న ఈ చెడ్డ అబ్బాయిలు ఎక్కడున్నారు? మనకెందుకు తారసపడలేదు అనుకుంటుంటా. నిజంగా ఇండస్ట్రీలో కాలు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ నాకు ఒక్క చేదు అనుభవం ఎదురు కాలేదు. లొకేషన్లో అందరూ చాలా కేర్ తీసుకుంటారు. 'ఐయామ్ బ్లెస్డ్'.

● బయటికెళ్లినప్పుడు ఆటోగ్రాఫ్స్, ఫొటోగ్రాఫ్స్ అంటూ కామన్ పీపుల్ ఎగ్జైట్ అవుతుంటారు కదా.. అప్పుడెలా అనిపిస్తుంది?

ఐ లవ్ ఇట్. అసభ్యంగా ప్రవర్తించనంతవరకూ ఏదైనా బాగానే ఉంటుంది. ఆటోగ్రాఫ్స్ ఇవ్వడానికి, ఫొటోలు దిగడానికి ఇబ్బంది ఏం ఉంటుంది? మమ్మల్నే అడుగుతున్నారంటే మా మీద ఉన్న క్రేజే కారణం. ఆ క్రేజ్ వచ్చింది కూడా వాళ్లు మమ్మల్ని చూడటంవల్లే అని నా ఫీలింగ్.

● ఫైనల్లీ.. కలల రాకుమారుడు ఎవరైనా? ఇలాంటి అబ్బాయినే పెళ్లాడాలని ఏమైనా?

ఎవరూ లేరండి. అమ్మాయిలకు, అబ్బాయిలకు లైఫ్ పార్టనర్ గురించి ఓ లిస్ట్ ఉంటుందనుకుంటా. అమ్మాయి అయితే అబ్బాయి అందగాడు, తెలివిగలవాడు, కేరింగ్‌గా చూసుకునేవాడు అయ్యుండాలని కోరుకుంటారు. తీరా ఎవరైనా నచ్చితే వాళ్లకు ఆ లిస్ట్‌లో ఉన్న క్వాలిటీస్ అన్నీ అతనిలో ఉన్నాయా? అని చూడటం మరచిపోతారేమోనని నా ఫీలింగ్ (నవ్వుతూ). నాకు పెద్ద పెద్ద ఎక్స్‌పెక్టేషన్స్ ఏవీ లేవు. చూడచక్కగా ఉండాలి. తెలివైనవాడు, మంచి వ్యక్తి అయ్యుండాలి. మంచి ఎత్తు ఉండాలి. తను తనలానే ఉండాలి. ఒకర్ని ఇంప్రెస్ చేయడం కోసం తన మనస్తత్వాన్ని మార్చుకోకూడదు.

– డి.జి. భవాని



● హీరోయిన్ అవుతానంటే మీ ఇంట్లో ఏమన్నారు?

మా ఇంట్లో ఫిల్మ్ ఇండస్ట్రీకి సంబంధించినవాళ్లెవరూ లేరు. అయితే నాకు ముందు మోడలింగ్‌లోకి ఎంటరై, ఆ తర్వాత హీరోయిన్ అవ్వాలని ఉండేది. అమ్మానాన్న నన్ను డాక్టర్‌గానో, ఇంజినీర్‌గానో చూడాలనుకున్నారు. పిల్లల మీద తల్లిదండ్రులకు కోరికలు ఉండటం సహజం. అయితే 'లా' చదవాలనుకున్నాను. అమ్మానాన్న కాదనలేదు. చదువు పూర్తయ్యాక సినిమాల్లో ట్రై చేస్తానంటే ఎంకరేజ్ చేశారు.

చెట్టు నీడ

వినకపోతివి!

> **మనిషిని బట్టి మన స్వభావం మారకూడదు. మన స్వభావాన్ని బట్టే ఎప్పుడూ మన నడవడిక ఉండాలి.**

ఒక మనిషి అడవి గుండా వెళుతున్నాడు. పిల్లిపిల్ల ఒకటి సన్నటి గోతిలో పడి బయటికి రాలేక, 'మ్యావ్ మ్యావ్' అంటూ మొత్తుకోవడం అతడికి వినిపించింది. దగ్గరికి వెళ్లి చూశాడు. గోతిలోంచి పిల్లిపిల్ల పైకి చూస్తూ జాలిగా అరుస్తోంది. ఆ వ్యక్తి తన చేతిని గోతిలోకి దూర్చి పిల్లిపిల్లను బయటికి తియ్యడానికి ప్రయత్నించాడు. అది తన గోళ్లతో రక్కింది. ఆ నొప్పికి తట్టుకోలేక అతడు తన చేతిని పైకి లాక్కుని, మళ్లీ వెంటనే గోతిలోకి చెయ్యి పెట్టాడు. మళ్లీ రక్కింది ఆ పిల్లిపిల్ల. ఇదంతా ఆ దారినే వెళుతున్న ఒక వ్యక్తి చూశాడు. ''వదిలెయ్యవయ్యా.. బాబు. చూడు నీ చెయ్యి ఎలా గీరుకుపోయి, రక్తం కారుతోందో'' అన్నాడు. ఈయన వినలేదు. చేతిని మళ్లీ ఆ సన్నటి గోతిలోకి దూర్చి, పిల్లిపిల్లను భద్రంగా బయటికి తీసి, అడవిలోకి వదిలిపెట్టాడు. అప్పుడు కూడా అతడి చేతిని రక్కేసి ఆ పిల్లిపిల్ల పారిపోయింది.

''చెబుతుంటే, వినకపోతివి'' అన్నాడు ఆ మనిషి ఈ మనిషితో.

ఈ మనిషి నవ్వాడు. ''భయం కలిగినప్పుడు రక్కడం పిల్లి స్వభావం. ఆపద నుంచి ఆదుకోవడం మనిషి స్వభావం. రక్కుతోందని దానిని గట్టెక్కించకుండా వెళితే నేను మనిషినెలా అవుతాను'' అని, తన దారిన తను వెళ్లిపోయాడు.

మనిషిని బట్టి మన స్వభావం మారకూడదు. మన స్వభావాన్ని బట్టే ఎప్పుడూ మన నడవడిక ఉండాలి.

సెటైర్

మోదీవాలా

మోదీజీ ఫీల్డ్‌లోకి రాక ముందే మనకో సెలబ్రిటీ 'చాయ్‌వాలా' ఉన్నాడు! చాయ్‌వాలా అంటే చాయ్‌వాలా కాదు. చాయ్‌వాలాల్ని పైకెత్తిన సినీవాలా.. మన చిరంజీవి! 'యే.. చాయ్, చటుక్కునా తాగరా భాయ్' అని చిరు డాన్స్ చేసిన 'మృగరాజు' మూవీ 2012లో రిలీజ్ అయింది. 'ఈ చాయ్ చమక్కులే చూడరా భాయ్' అని కూడా అందులో చిరు పాడారు. చాయ్ చేసిన ఓ చమక్కు.. మోదీజీ మన ప్రధాని కావడం! మృగరాజుతో ఒక్క ఆంధ్రాలోనే (అప్పటికింకా తెలంగాణ రాలేదు) చాయ్ ఫేమస్ అయితే, 2014లో మోదీరాజు రాకతో అన్నీ రాష్ట్రాల్లోనూ చాయ్ సెలబ్రిటీ అయింది. చాయ్ తాగేవాళ్లూ సెలబ్రిటీలు అయ్యారు. హార్డ్‌వర్క్‌కి, మంచి ఆడ్మినిస్ట్రేషన్‌కీ, మాటకారితనానికీ చాయ్ ఇప్పుడు బ్రాండ్ అంబాసిడర్! 'నేనూ ఒకప్పుడు చాయ్‌వాలానే' అని మోదీ చెప్పాకా, చాయ్‌వాలాలందరికీ పీయెంకి వచ్చినంత ఫేమ్ వచ్చేసింది. విషయం ఏంటంటే.. హైదారాబాద్ అంటే బిర్యానీ అన్నట్లు, ఇండియా అంటే 'చాయ్' అనే పేరొచ్చేసిందని తాజా సమాచారం.



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
ఆదివారం
28-1-2018


● రామ్‌చరణ్

చిట్టిబాబు ఇంట్రడక్షన్

వయ్యారంతో పరవళ్లు తొక్కుతున్న గోదావరి సొగసులను సూర్యకిరణాలు ముద్దాడుతున్న వేళ.. అక్కడే ఉన్న ఆంజనేయస్వామి అభయమిస్తుంటే... కిర్రు చెప్పులతో కేక పుట్టించేలా చిందేస్తున్నారట చిట్టిబాబు. ఇదంతా 'రంగస్థలం' సినిమాలోని సాంగ్ విజువల్స్ గురించే. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రం 'రంగస్థలం'. ఇందులో సమంత కథానాయిక. వినికిడి లోపం ఉన్న చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్ కనిపించనున్నారు. రీసెంట్‌గా విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం చెబుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. సినిమాలో రామ్‌చరణ్ ఇంట్రడక్షన్ సాంగ్‌ను షూట్ చేస్తున్నారు. ఇందుకోసం భారీ ఆంజనేయస్వామి విగ్రహం, ఎడ్ల బండ్లు, పడవలతో గోదావరి ఒడ్డును కలర్‌ఫుల్‌గా చేశారట చిత్రబృందం. ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు, అనసూయ, ఆది పినిశెట్టి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను మార్చి 30న విడుదల చేయాలనుకుంటున్నారు.


● వంశీ, వినాయక్, వక్కంతం వంశీ, రవితేజ, సీరత్, రాశీఖన్నా, నల్లమలుపు బుజ్జి, విక్రమ్

అందరికీ వయసు పెరుగుతుంది కానీ రవితేజకు మాత్రం తగ్గుతోంది - వినాయక్

''**అం**దరికీ సినిమా సినిమాకు వయసు పెరుగుద్ది కానీ రవితేజకి మాత్రం తగ్గుతోంది. 'విక్రమార్కుడు' సినిమా చూసి ఎలా ఫీల్ అయ్యామో 'టచ్ చేసి చూడు' చూసి కూడా అలానే ఫీల్ అవుతాం'' అన్నారు దర్శకుడు వీవీ వినాయక్. రవితేజ, రాశీఖన్నా, సీరత్ కపూర్ హీరో హీరోయిన్లుగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ మోహన్ నిర్మించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. ఈ సినిమా ప్రీ–రిలీజ్ వేడుకలో వినాయక్ మాట్లాడుతూ– ''ఈ సినిమా నాకు స్పెషల్. కారణం నిర్మాతలు బుజ్జి, వంశీ మోహన్‌గారు. దర్శకుడు విక్కీ (విక్రమ్) నాతో కలిసి పని చేశాడు. రెండు రీళ్లు చూశాను. చాలా బాగా తెరకెక్కించాడు'' అన్నారు. ''మా టెక్నీషియన్స్ రామ్–లక్ష్మణ్, రవివర్మన్, వెంకట్ ఫైట్ మాస్టర్స్ ఒక్కొక్కరు ఒక్కో ఫైట్ చేశారు. నా ప్రొడ్యూసర్స్ ఇద్దరూ నా ఫ్రెండ్స్. విక్రమ్ సిరికొండ నాకు 'మిరపకాయ్' సినిమా నుంచి తెలుసు. వక్కంతం వంశీ అందించిన కథను విక్రమ్ బాగా హ్యాండిల్ చేశాడు. జామ్ 8 అద్భుతమైన సాంగ్స్ ఇచ్చారు'' అన్నారు రవితేజ. ''నేను ఇండస్ట్రీలో నిలబడటానికి కారణం హీరో రవితేజగారి 'కిక్' సినిమానే. 'టచ్ చేసి చూడు' ఫుల్ కమర్షియల్‌గా ఉంటుంది'' అన్నారు వక్కంతం వంశీ. విక్రమ్ సిరికొండ మాట్లాడుతూ – ''నా సినిమా గురు వినాయక్‌గారికి థాంక్స్. ఈ సినిమా స్టార్ట్ అవ్వడానికి కారణం బుజ్జిగారు. నా మాస్ రాజా ఎనర్జీ గురించి అందరికీ తెలుసు కానీ ఆయనకు ఇంకో క్వాలిటీ ఉంది. అదేంటంటే ఆ ఎనర్జీని చుట్టూ ఉన్న వాళ్లకి పాస్ చేస్తారు'' అన్నారు. ''రవితేజగారితో 'కృష్ణ' సినిమా తీయలేకపోయాను. పది సంవత్సరాల తర్వాత ఆయనతో సినిమా చేసే అవకాశం దొరికింది. చక్కటి స్క్రిప్ట్, మంచి డైరెక్టర్'' అన్నారు వంశీమోహన్.

ఈ 'ఆపరేషన్' కూడా సక్సెస్ అవ్వాలి - కృష్ణంరాజు


● శ్యామల, కృష్ణంరాజు, శ్రీకాంత్, కరణం బాబ్జీ

శ్రీకాంత్, యజ్ఞశెట్టి జంటగా కరణం బాబ్జీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆపరేషన్ 2019'. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనేది ఉపశీర్షిక. అలివేలు ప్రొడక్షన్ బ్యానర్ పై అలివేలు నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను సీనియర్ నటుడు కృష్ణంరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – ''శ్రీకాంత్ 'సింహ గర్జన' సినిమాలో నాకు తమ్ముడిగా, 'మా నాన్నకు పెళ్లి' సినిమాలో కొడుకుగా యాక్ట్ చేశారు. శ్రీకాంత్ మంచి నటుడే కాదు మంచి మనసున్న వ్యక్తి కూడా. 'ఆపరేషన్ దుర్యోధన'లాగా ఈ సినిమా కూడా మంచి హిట్ కావాలని ఆశిస్తున్నాను. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనే క్యాప్షన్ చూస్తుంటే ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు చూస్తే వ్యాపారవేత్తలు ఓట్లను కొంటున్నారు. పబ్లిక్ కూడా డబ్బుకు ఆశ పడుతున్నారు. ఈ సినిమా పబ్లిక్‌ను ఎడ్యుకేట్ చేస్తుంది అనుకుంటున్నాను. టీమ్‌కు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''కృష్ణంరాజుగారు మా సినిమా టీజర్‌ను విడుదల చేయటం చాలా ఆనందంగా ఉంది. కరణం బాబ్జీ గారితో ఇంతకు ముందు 'మెంటల్ పోలీస్' అనే సినిమా చేశా. అది వివాదాల కారణంగా సరిగ్గా ఆడలేదు. ఈసారి కాంట్రవర్సీ లేకుండా సినిమా చేద్దాం అనుకున్నాం. నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు'' అన్నారు శ్రీకాంత్. ''శ్రీకాంత్‌గారు అన్ని విధాలా సహకరించారు. ఆయనతో పాటు ఈ సినిమాలో ఇద్దరు యంగ్‌స్టర్స్ నటిస్తున్నారు. వారెవరో త్వరలో ప్రకటిస్తాం'' అన్నారు దర్శకుడు బాబ్జీ. ''శ్రీకాంత్‌గారి సహకారం మరువలేనిది. కృష్ణంరాజుగారి దంపతులు టీజర్ రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది'' అన్నారు నిర్మాత అలివేలు.


● ఆకుల శివ, సి. కల్యాణ్, వినాయక్, బాలకృష్ణ, సాయిధరమ్ తేజ్, సీవీ రావు

సెన్సేషనల్ హిట్ సాధించాం అనిపిస్తోంది - సి. కల్యాణ్

''**ఆ**ర్టిస్టుల నుంచి ఎలా నటన రాబట్టుకోవాలో వినాయక్‌కి బాగా తెలుసు. ఆయన దర్శకత్వంలో మెగా ఫ్యామిలీ నుంచి మరో నటవారసుడు సాయిధరమ్ తేజ్ హీరోగా రూపొందిన 'ఇంటిలిజెంట్' హిట్ అవ్వాలి. సీకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నా సొంత బేనర్‌తో సమానం. కళ్యాణ్‌గారు పెద్ద హీరోలతో, చిన్న హీరోలతో ఇంకా సినిమా చేయాలి. ఈ సినిమా విషయానికి వస్తే వినాయక్, ఆకుల శివ కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన సినిమాలు వచ్చాయి. టీజర్ చాలా బాగుంది. సినిమా ఎప్పుడు చూడాలా అనిపిస్తోంది. మెగా అభిమానులకు, ఇది నా బేనర్ కాబట్టి నా అభిమానులకు, ముఖ్యంగా యూత్‌కి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది'' అన్నారు హీరో బాలకృష. సాయిధరమ్ తేజ్ హీరోగా వీవీ వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సి. కల్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం టీజర్‌ను బాలకృష్ణ విడుదల చేశారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ– ''మా బాలయ్యబాబు టీజర్ రిలీజ్ చేయడంతో నేను పెద్ద సెన్సేషన్ హిట్ సాధించినట్లుగా భావిస్తున్నాను. 2018 ప్రారంభంలో బాలకృష్ణగారు 'జై సింహా' హిట్ రూపంలో నాకు మంచి ఎనర్జీ ఇచ్చారు. ఫిబ్రవరిలో రిలీజ్ కాబోతున్న 'ఇంటిలిజెంట్' సూపర్‌హిట్ గ్యారంటీ'' అన్నారు. ''మేం అడగ్గానే బాలకృష్ణగారు రావడంతో ఈ సినిమా సూపర్‌హిట్ అయిపోయిందన్న ఫీలింగ్ వచ్చేసింది'' అన్నారు వినాయక్. ''కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చెయ్యడానికి బాలకృష్ణగారు ముందుంటారని అందరూ అంటారు. మా సినిమాకి ఆశీస్సులు అందించడానికి రావడంతో మరోసారి అది ప్రూవ్ అయ్యింది'' అన్నారు సాయిధరమ్ తేజ్. ఫిబ్రవరి 4న ఈ చిత్రం ప్రీ–రిలీజ్ వేడుకను రాజమండ్రిలో జరపాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు: శివ ఆకుల, సహ నిర్మాతలు: సి.వి.రావు, నాగరాజ పత్సా.

ఆశా భోంస్లేకు యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్

ప్రముఖ దర్శక–నిర్మాత యశ్ చోప్రా అంటే కళాబంధు టి.సుబ్బరామిరెడ్డికి ఎనలేని అభిమానం. చోప్రాతో టీయస్సార్‌కి మంచి అనుబంధం ఉండేది. అందుకే ఆయన భౌతికంగా దూరమయ్యాక టి. సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ తరపున 'నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్' అవార్డ్‌ను ప్రారంభించారు. 2013లో మొదలుపెట్టి ఇప్పటివరకూ లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, షారుక్ ఖాన్‌లకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈసారి టి. సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు బోనీకపూర్, మాధుర్ భండార్కర్, హనీ ఇరానీ, పద్మినీ కొల్హాపురి, సుబ్బరామిరెడ్డి ఈ అవార్డును ప్రముఖ గాయని ఆశాభోంస్లేకు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని శనివారం అధికారికంగా ప్రకటించారు. ఫిబ్రవరి 16న ముంబైలో ఈ అవార్డు వేడుక జరగనుంది. ఈ వేడుకలో అమితాబ్ బచ్చన్, ఆమిర్ ఖాన్, షారుక్ ఖాన్, శ్రీదేవి, జయప్రద తదితరులు పాల్గొనబోతున్నారు.


● ఆశా భోంస్లే

నేను మిస్‌ఫిట్!

ఇలియనా.. ఈ బ్యూటీ టాలీవుడ్‌లో కనిపించి చాలాకాలం అయింది. ఆమె నటించిన లాస్ట్ సినిమా పూరీ జగన్నాథ్ డైరెక్షన్‌లో వచ్చిన 'దేవుడు చేసిన మనుషులు'. 'బర్ఫీ'తో బాలీవుడ్‌కి వెళ్లి, అక్కడ కూడా పెద్దగా సినిమాలు చేయడంలేదు. ఏడాదికి ఒక సినిమా చేస్తూ రిలాక్స్ అవుతున్నారు. ఇటు తెలుగుకి దూరమై అటు హిందీ సినిమాలు చేస్తున్నారు కాబట్టి బాలీవుడ్ బాగా నచ్చిందన్నది కొందరి ఊహ. ''నచ్చింది కానీ నేను బాలీవుడ్‌కు 'మిస్ ఫిట్'' అని ఓ సందర్భంలో ఇలియానా పేర్కొన్నారు. ఎందుకలా అన్నారనే సీక్రెట్‌ని ఆమె బయట పెట్టలేదు. నంబర్ గేమ్స్ గురించి మాట్లాడుతూ – ''నాకీ నంబర్ గేమ్స్ అంటే చిరాకు. ఈ రేసులో నేనెప్పుడూ పరిగెత్తలేదు. నంబర్ వన్ కావాలంటే ఏం చేయాలో కూడా నాకు తెలియదు. అయినా 'నంబర్ వన్' అని ఎలా డిసైడ్ చేస్తారు?. ఒక్కో సినిమాకి నేను గ్యాప్ తీసుకుంటున్నాను. అయినా ఫర్వాలేదు. ఎందుకంటే కంటెంట్ ఉన్న సినిమాలే చేస్తున్నాను. అవి సక్సెస్ అవుతున్నాయి. హ్యాపీగా ఉంది'' అన్నారు ఇలియానా. ప్రస్తుతం అజయ్ దేవగన్ 'రెయిడ్' సినిమాలో నటిసున్నారామె.


● ఇలియానా

పరి పరిశోధన

స్టాటిన్ మందుల వాడకంపై కొత్త ఆలోచన...

గుండె జబ్బు చేస్తే... శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గించే మందులు జీవితాంతం వాడాలని డాక్టర్లు చెబుతూంటారు. స్టాటిన్లు అని పిలిచే ఈ మందులతో దుష్ప్రభావాలు చాలా ఎక్కువ. అయితే చిన్న రక్త పరీక్ష ద్వారా గుండె జబ్బు చేసిన వారికి నిజంగానే స్టాటిన్ల అవసరం ఉందా? లేదా? అన్నది తేల్చవచ్చునని అంటున్నారు ఓ విలేకరి. ఆశ్చర్యంగా ఉందా? నిజమే. ఆస్ట్రేలియన్ సైన్స్ రిపోర్టర్ మేరియానే దిమాసీ అంచనా ప్రకారం... కొలెస్ట్రాల్ మోతాదును అంచనా వేసేందుకు చేస్తున్న పరీక్షల్లో తప్పులున్నాయి. శరీరానికి చెడు చేస్తుందని భావిస్తున్న ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ మోతాదును కాకుండా... ప్రతి ఎల్‌డీఎల్ కణానికి అతుక్కుని ఉండే అపోలిపోప్రోటీన్ బీ100 (అపోబ్ బీ)ను లెక్కపెట్టడం మంచిదంటున్నారు దిమాసీ. దీనివల్ల శరీరంలో ఎల్‌డీఎల్ కణాలు ఎన్ని ఉన్నాయో స్పష్టంగా తెలుస్తుందని, తదనుగుణంగా స్టాటిన్ల వాడకంపై ఒక నిర్ణయానికి రావచ్చునని దిమాసీ అంచనా. అపోబ్ బీ ప్రొటీన్ కూడా గుండె జబ్బులను గుర్తించేందుకు మెరుగ్గా ఉపయోగపడుతుందని సైన్స్ చెబుతోంది. అయితే ఈ పరీక్ష కొంచెం ఖరీదైంది కాబట్టి.. చౌకగా చేయగల ఎల్‌డీఎల్, నాన్ హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ పరీక్షలు చేస్తున్నారని.. ఫలితంగా అవసరం లేని వారు కూడా స్టాటిన్లు వాడుతూ దుష్ప్రభావాల బారిన పడుతున్నారని అంటున్నారు.



చక్కెరలు తక్కువ, క్యాల్షియం ఎక్కువ చేస్తే కేన్సర్‌కు చెక్?

చక్కెరలు తక్కువగా అందేలా చేస్తే కేన్సర్‌ను జయించవచ్చునని చాలామంది చెబుతూంటారు. అయితే ఈ పద్ధతి అన్ని కేన్సర్ల విషయంలో ఉపయోగపడకపోవచ్చునని అంటున్నారు సింగపూర్ శాస్త్రవేత్తలు. కొన్ని రకాల కేన్సర్లు చక్కెరలు తగ్గినా సాధారణంగా విస్తరించాయని.. ఇంకొన్నింటి విస్తరణ వేగం మందగించిందని తాము ప్రయోగపూర్వకంగా తెలుసుకున్నామని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న శాస్త్రవేత్త డాక్టర్ ఈగన్ ఓగ్రీస్ తెలిపారు. అయితే ఈ ప్రయోగాల సందర్భంగా తాము ఒక కొత్త విషయాన్ని గుర్తించామని.. చక్కెరలు బాగా తగ్గిన సందర్భాల్లో కేన్సర్ కణాలు తమ మనుగడ కోసం కాల్షియంపై ఆధారపడటం మొదలుపెట్టాయని ఆయన చెప్పారు. అతితక్కువ మోతాదులో ఉండే చక్కెరలు.. కేన్సర్ కణాల పై పొరలపై వోల్టేజీ మార్పులకు కారణమై క్యాల్షియం అయాన్లు లోనికి ప్రవేశించేలా చేస్తున్నట్లు తెలిసిందని అన్నారు. ఈ అంశం ఆధారంగా కేన్సర్ వ్యాధికి సరికొత్త చికిత్స అందించే అవకాశముందని ఆయన అంచనా వేస్తున్నారు. చక్కెరలను గణనీయంగా తగ్గిస్తూనే, క్యాల్షియం మోతాదును గణనీయంగా పెంచడం ద్వారా కేన్సర్ కణాలను నాశనం చేయవచ్చునని వీరు సూచిస్తున్నారు.



వ్యోమగాములకు వ్యర్థాలతోనే ఆహారం?

వినేందుకు కొంచెం ఇబ్బందికరంగా అనిపించే విషయమిది. భవిష్యత్తులో సుదూర గ్రహాలకు పయనమయ్యే వ్యోమగాములకు వారి వ్యర్థాలతోనే ఆహారాన్ని సిద్ధం చేయవచ్చునని అంటున్నారు పెన్‌స్టేట్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. మూత్రాన్ని శుద్ధి చేసుకుని మంచినీరుగా మార్చుకుని వాడుకోవచ్చునని శాస్త్రవేత్తలు ఇప్పటికే తేల్చారు గానీ.. ఇలా వ్యర్థాలను ఆహారంగా మార్చుకునే ఆలోచన మాత్రం ఇదే తొలిసారి. అంతరిక్ష ప్రయోగాలకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువ కాబట్టి.. వ్యోమగాములకు తగినంత ఆహారం నిల్వ చేయడమూ ఆర్థికంగా భారమవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో అతితక్కువ ఖర్చుతో వారికి ఆహారం అందించడం ఎలా అన్నది ఓ సవాలుగా మారింది. అయితే కొన్ని రకాల బ్యాక్టీరియాను ఉపయోగించుకుని మానవ వ్యర్థాలనే ఆహారంగా మార్చవచ్చునని పెన్‌స్టేట్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భూమి మీద వ్యర్థాలు ఎరువుగా మారుతున్నట్లే కొన్ని బ్యాక్టీరియా మానవ వ్యర్థాల ద్వారా ప్రొటీన్లు, కొవ్వులను ఉత్పత్తి చేయగలవని వీరు గుర్తించారు. అంతేకాకుండా కేవలం 13 గంటల్లోనే సగం వరకూ వ్యర్థాలను ఆహారంగా మార్చడం వీలైందని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ క్రిస్టోఫర్ హౌస్ తెలిపారు. అయితే తాము మానవ వ్యర్థాలను కాకుండా... కృత్రిమంగా తయారు చేసిన, ద్రవ, ఘన వ్యర్థాలను ప్రయోగాల్లో ఉపయోగించామని చెప్పారు.



సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ
ఆదివారం
28-1-2018

కృష్ణ లీల

శిక్ష అనుభవించాల్సిందే!



కురుపాండవుల మధ్య పద్దెనిమిది రోజులపాటు జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో యోధానుయోధులంతా వీరమరణం పొందారు. అంతా పూర్తయ్యాక శ్రీకృష్ణుడు తన నివాసానికి వచ్చాడు. బుసలు కక్కుతూ కోడెతాచులా రుక్మిణి గుమ్మం లోనే శ్రీకృష్ణుడిని అడ్డగించింది. 'కురు వృద్ధుడు భీష్ముడు, గురు వృద్ధుడు ద్రోణుడు... వీరిని కూడా విడిచిపెట్టలేదు, వారు ఎంతటి ధర్మాత్ములో నీకు తెలియదా. వారు నీతి తప్పనివారే, ధర్మాన్ని ఆచరించేవారే. ... అటువంటి మహాత్ములను సంహరించడానికి నీకు మనసెలా వచ్చింది..'' అంటూ ప్రశ్నించింది.

శ్రీకృష్ణుడు చిరునవ్వుతో మౌనం వహించాడు. ''వారు చేసిన పాపం ఏమిటి'' రెట్టించింది. ఇక తప్పదని పెదవి విప్పాడు శ్రీకృష్ణుడు.

''నువ్వు చెప్పినది నిజమే రుక్మిణీ. వారు జీవితమంతా నిజమే చెప్పారు. ధర్మమే ఆచరించారు. కాని వారి జీవితంలో ఒకేసారి ఒకే ఒక పెద్ద తప్పు చేశారు'

''ఏం తప్పు చేశారు?''

''పెద్దల సమక్షంలో నిండు కొలువులో అందరి ఎదుట ద్రౌపదీ వస్త్రాపహరణం జరుగుతుంటే, పెదవి విప్పకుండా, తలలు దించుకుని మౌనం వహించారు. జరుగుతున్న అకార్యాన్ని ఆపగలిగే శక్తి, హక్కు ఉండి కూడా వారిరువురూ మౌనం వహించడం అన్యాయమే కదా. ఆ ఒక్క తప్పు వల్లే ఇంత ప్రపంచం నాశనమైంది. ఇంతకుమించిన నేరమే ముంది...''

''మరి కర్ణుడి సంగతి ఏంటి? ఆయన దానకర్ణుడన్న పేరు సంపాదించాడుగా. గుమ్మం ముందు నిలబడి అడిగిన వారికి లేదనకుండా దానం చేశాడు కదా. ఆయనను కూడా అన్యాయంగా చంపించావే యుద్ధంలో. నువ్వు మరీ ఇంత నిర్దయుడివా''

'నువ్వు చెప్పిన మాట నిజమే. అయితే, యుద్ధరంగంలో యోధానుయోధులతో పోరాడి అలసిన అభిమన్యుడు... మరణానికి చేరువలో ఉన్న సమయంలో దాహం వేసి, పక్కనే ఉన్న కర్ణుడిని మంచినీళ్లు అడిగాడు. కర్ణుడి పక్కనే మంచినీటి చెలమ ఉంది. దుర్యోధనుడు ఇవ్వడానికి వీలు లేదన్నాడు. అలా కర్ణుడు అభిమన్యుడి దాహం తీర్చలేదు. ఆ తరవాత కర్ణుడి రథం అదే ప్రదేశంలో ఆ నీటి ప్రాంతంలోనే కుంగి పోయింది. కర్ణుడు చేసిన పాపానికి తగిన ఫలితం అనుభవించాడు. ఒక విషయం గుర్తుపెట్టుకో, ఏ ఒక్క తప్పు చేసినా, జీవితాంతం చేసిన మంచి కనుమరుగైపోతుంది. చేసిన తప్పుకి శిక్ష అనుభవించక తప్పదు. ఇదే కర్మ సిద్ధాంతం. చేసే పని నీతిమంతమైనదేనా? న్యాయమైనదేనా? అని ఆలోచించాలి'' సెలవిచ్చాడు శ్రీకృష్ణపరమాత్ముడు.

- డా. వైజయంతి

కాకురో సుడోకు

	5	1	8		2			7
				5	9		2	1
	2	3					5	
		4	9	8				
	8	9	2		3	5	1	
				4		6		
	4					2	6	
3	9		6	2				
7			1		5	9	4	

నిబంధనలు
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	3	1	4	6	9	8	5	7
5	6	7	3	1	8	9	4	2
9	4	8	2	7	5	3	1	6
1	7	5	8	9	2	6	3	4
6	9	3	7	5	4	1	2	8
4	8	2	6	3	1	7	9	5
8	5	9	1	2	6	4	7	3
3	1	6	5	4	7	2	8	9
7	2	4	9	8	3	5	6	1

గమనిక

నిన్న అంటే జనవరి 27, శనివారం సాక్షి ఫ్యామిలీలో ప్రచురించిన సౌరమాన ఫలాలలో తేదీ పొరపాటుగా ప్రచురితమైంది. దానిని 2018 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు అని చదువుకోగలరు.

– ఎడిటర్

గ్రహణ కాలం

పట్టు విడుపులు



ఖగోళ పరంగా సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళ రేఖలో ఉన్నప్పుడు చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. సూర్యుడు, భూమి ఎప్పటికి ఒకే మార్గంలో ఉన్నప్పటికి చంద్రుడు ఈ మార్గానికి 5 డిగ్రీలు అటూ ఇటూగా తిరుగుతుంటాడు. సూర్య, చంద్రుల మధ్యలో భూమి ఉన్న రోజున పూర్ణిమ అవుతుంది. అయితే సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖలో ఉండి చంద్రుడు రాహువు వద్ద గాని, కేతువు వద్దగాని ఉన్నప్పుడు చంద్రగ్రహణం ఏర్పడుతుంది. పూర్తి చంద్రబింబం కనపడకపోతే దాన్ని సంపూర్ణ చంద్రగ్రహణమనీ, కొంత భాగమే కనిపించకపోయేదాన్ని పాక్షిక చంద్రగ్రహణమనీ అంటారు.

31న చంద్రగ్రహణం

ఈ నెల 31 తేది బుధవారం రోజున పుష్యమి, ఆశ్లేష నక్షత్రాలలో కర్కాటకరాశిలో సాయంత్రం 5:18 మొదలుకొని 8:41 వరకు కర్కాటక, సింహ లగ్నాలలో రాహూగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించనున్నది. భారత కాలమానం ప్రకారం చంద్రగ్రహణం వేళలు ఇవీ...

సాయంత్రం. 5:18 చంద్రగ్రహణ ప్రారంభ కాలం

సా. 6:22 సంపూర్ణ స్థాయిలోకి గ్రహణం రాత్రి. 7:38 గ్రహణం సంపూర్ణ స్థాయి నుండి విడుపు దశ వైపు రాత్రి. 8:41 గ్రహణ అంత్యకాలం (గ్రహణ మోక్షం)గ్రహణం ప్రారంభం నుండి వదిలే వరకు ఉన్న మొత్తం గ్రహణ కాలం 3 గంటల 23 నిమిషాలు.

ఏ ప్రాంతాల్లో కనిపిస్తుంది..?

భారతదేశంతో సహా ఆసియా ఖండం, అమెరికా, యూరప్ ఈశాన్యప్రాంతం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పసిఫిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రం ప్రాంతాలలో కనబడుతుంది.

గ్రహణ గోచారం ఇలా...

ఈ గ్రహణం కర్కాటకరాశిలో ఏర్పడటం, ఆ రాశి నుండి సప్తమ దృష్టి పరంగా మకరరాశి అవటం చేత ఈ రెండు రాశులవారు, పుష్యమి, ఆశ్లేష, మఖ నక్షత్రాల వారిపై ప్రభావం ఎక్కువగా చూపుతుంది. కాబట్టి గ్రహణ శాంతిని ఆచరించాల్సి ఉంటుంది.

ఏ రాశివారిపై ఏ ప్రభావం?

ధనస్సు-మేషం-కర్కాటక-సింహ రాశుల వారికి అధమ ఫలం.
వృశ్చిక-మకర-మీన-మిధున రాశుల వారికి మధ్యమ ఫలం.
కన్య-తుల-కుంభ వృషభ రాశుల వారికి శుభ ఫలాలు.

చంద్రగ్రహణ నిబంధనలు ఇవీ..

ఈ సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని గర్భిణులు ప్రత్యేక్షంగా చూడకూడదు, మనస్సులో భగవంతుని ధ్యానిస్తూ ఉంటే చాలా మంచిది. గర్భిణులు కదలకుండా పడుకోవాలనేది అవాస్తవం. ఇంట్లో అన్ని పనులు చేసుకోవచ్చును. ఇందులో ఎలాంటి సందేహాలూ లేవు. గ్రహణ సమయంలో మల, మూత్ర విసర్జనలు చేయకూడదు అనే అపోహలు వద్దు.

గ్రహణ వేళ ఆహార పానీయ నియమాలు

అన్ని వయస్సులవారు గ్రహణానికి మూడు గంటల ముందుగానే ఘన పదార్థాలు, భోజనాలు పూర్తి చేసుకోవాలి. గ్రహణం పట్టే సమయానికి గంటన్నర ముందు వరకు పాలు, పండ్లరసాలు వంటివి తీసుకోవచ్చును. గ్రహణం పూర్తి అయిన తర్వాత తలస్నానం చేసి వంట చేసుకొని తినాలి. ఉదయం చేసిన అన్నం కూరలు పనికి రావు. గ్రహణ సమయంలో నిలువ ఉన్న ఆహార పదార్థాలు విష స్వభావాన్ని కలిగి ఉండటమే అందుకు కారణం. అవి తింటే వెంటనే వాటి స్వభావాన్ని చూపకపోయినా నిదానంగా శరీరానికి హాని కలిగిస్తాయి కాబట్టి తినకూడదు అని శాస్త్రాలు, పెద్దలు చెబుతుంటారు.

శాస్త్రీయ పద్ధతి అవసరం

గ్రహణ సమయంలో శాస్త్రీయ పద్ధతిని ఆచరించాలి అనుకునేవారు వారి శారీరక శక్తి, జిజ్ఞాస ఉన్నవారు గ్రహణం పట్టటానికి ముందు, తర్వాత పట్టు, విడుపు స్నానాలు చేసి ధ్యానం (జపాలు) భగవత్ స్మరణతో ఉండ గలిగితే మామూలు సమయంలో చేసిన ధ్యాన ఫలితం కన్న రెట్టింపు ఫలితం లభిస్తుంది. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు చేయనక్కర్లేదు.

తర్వాత ఇలా చేయాలి

గ్రహణం పూర్తయిన తరవాత ఇంట్లో దేవుణ్ణి శుద్ధి చేసుకోవాలి. విగ్రహాలు, యంత్రాలు ఉన్నవారు పంచామృతంతో ప్రోక్షణ చేసుకోవాలి. జంధ్యం ధరించే సంప్రదాయం ఉన్నవారు తప్పక మార్చుకోవాలి. మీ శక్తి కొలది గ్రహణానంతరం గ్రహదోష నివారణ జపాలు, పూజలు చేయించుకున్న తర్వాత ఆవుకు తోటకూర, బెల్లం తినిపించి గోమాతకు మూడు ప్రదక్షిణలు చేయాలి, పేదలకు ఏదేని ఆహార, వస్త్ర, వస్తు రూపంలో దానం చేయగలిగితే మీకున్న అరిష్టాలు, గ్రహబాధలు కొంతవరకు నివారణ కలిగి భగవత్ అనుగ్రహం కలుగుతుంది.

ఆలయాలను ఎందుకు మూసివేస్తారు?

సూర్యచంద్రులతో భూమికి గల సంబంధాన్ని బట్టే కాలగణన జరుగుతుంది. అటువంటి సూర్య చంద్రులకు గ్రహణం కలిగిందంటే అది దుర్దినమేకదా!

సామాన్య భాషలో చెప్పాలంటే లోకానికి వెలుగు, వేడిని ప్రసాదించే సూర్యచంద్రులను క్రూరగ్రహాలైన రాహు కేతువులు మింగడమంటే అది లోకానికంతటికీ కష్టకాలమే కదా!

ఆలయాలు సమాజమంతటినీ కలిపే కేంద్రాలు కాబట్టి, దేవాలయాలను గ్రహణ కాలంలో మూసివేసి, గ్రహణం వీడిన తరువాత శుద్ధి చేస్తారు. ఆ తర్వాతనే పూజాదికాలు ప్రారంభిస్తారు.

ఉపశమనం

అన్నింటా అపజయాలా?


కొందరు తమ తమ రంగాల్లో ఎంతగా కృషి సాగిస్తున్నా వరుస అపజయాలు ఎదురవుతూ ఉంటాయి. దీర్ఘకాలం ఇలాంటి పరిస్థితి కొనసాగడం వల్ల ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ప్రతిష్ఠ మసకబారుతుంది. ఆర్థిక నష్టాలు ఎదురవుతాయి. చివరకు ఆరోగ్యం కూడా మందగిస్తుంది. ప్రతికూలతలను అధిగమించి, విజయాలు సాధించాలంటే...

- సూర్య ఆరాధన వల్ల అపజయాలు తొలగుతాయి. ఏదైనా ఆదివారం నుంచి ఆదిత్యహృదయం పఠించడం ప్రారంభించాలి. ప్రతిరోజూ పదకొండు సార్లు చొప్పున పదకొండు రోజుల పాటు అంతరాయం లేకుండా ఆదిత్యహృదయ పఠనం కొనసాగించాలి. సూర్య ప్రీతి కోసం పూజలో ఎర్రని పూలు ఉపయోగించాలి. రాగి పాత్రలో తీర్థాన్ని సమర్పించాలి.
- ఏదైనా సోమవారం లేదా శని వారం రోజున సూర్యోదయ వేళలో జమ్మిచెట్టు వేరును సేకరించాలి. ఆ వేరును శుభ్రపరచి పూజలో ఉంచాలి. పూజ ముగిసిన తర్వాత దానిని ఎరుపు దారంతో కట్టి మెడలో తాయెత్తులా ధరించాలి.
- పసుపు, కుంకుమపువ్వు ముద్దలా నూరి, దానిని పూజ సమయంలో తిలకంలా ధరించాలి.
- పేద బాలికలకు ఆర్థిక సహాయం చేయడం వల్ల ఫలితముంటుంది.
- చిన్న వెండిపూసలు రెండింటిని తయారు చేసి, వాటిని పూజలో ఉంచిన తర్వాత ఎల్లప్పుడూ పర్సులో భద్రపరచుకోవాలి.

- పన్యాల జగన్నాథదాసు

ఆచార్య దేవోభవ

ఆచార్యుల వల్లనే మనకు ఈ వైభవం




ప్రకృతిలోని ఇరవైనాలుగింటిని దత్తాత్రేయులవారు గురువులుగా స్వీకరించిన విషయం తెలుసుకున్నాం. మహానుభావులయిన ఈ గురువులు కేవలం ఉపదేశాలవల్ల కాక, వారి చేష్టితాలవల్ల ప్రకాశించారు. చంద్రశేఖరేంద్ర మహాస్వామివారు సన్యాసాశ్రమం స్వీకరించడానికి, వైరాగ్యం పొందడానికి దారితీసిన కారణాల్లో ఒకటి ఆయన చిన్నతనంలో జరిగిన సంఘటన.

ఆయన వీధిలో ఉండే ఒకరు యాత్రలకు వెడుతూ ఇంటికి తాళం వేసుకుని వెళ్ళారు. ఓ రాత్రివేళ ఆ ఇంట్లోనుంచి పెద్దశబ్దాలు వినిపిస్తుంటే, దొంగలు పడ్డారనుకుని చుట్టుపక్కల వాళ్లంతా దుడ్డుకర్రలు పట్టుకుని ఆ ఇంటిని చుట్టుముట్టి తలుపులు తట్టారు. అయినా శబ్దాలు ఆగకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి లోపలకు వెళ్ళారు. తీరా చూస్తే ఒక పిల్లి. ఏదో ఆహార పదార్థం కోసం చెంబులో తలదూర్చింది. తల ఇరుక్కుపోయింది. కళ్ళు కనిపించక అటూ ఇటూ దూకుతూ ప్రతిదాన్నీ గుద్దేస్తున్నది. అక్కడ చేరినవారు నెమ్మదిగా తలవిడిపించి దానిని వదిలేసారు. నిజానికి ఇది మామూలు సంఘటనే. కానీ బాలుడిగా ఉన్న స్వామివారిని ప్రభావితం చేసింది. మనిషి అత్యాశతో ప్రవర్తించడంవల్ల ఆఖరికి చెంబులో తలదూర్చి ఇరుక్కుపోయిన పిల్లిలా కొట్టుమిట్టాడతాడని, ఆరోజు పిల్లిని చూసి నేర్చుకున్నానని 80 సంవత్సరాల వయసులో స్వామివారు గుర్తుచేసుకున్నారు.

మహాస్వామివారే ఒకసారి ఆశ్రమంలో బయట అరుగుమీద కూర్చుని ఉండగా కొద్దిదూరంలో వేదవిద్యార్థులు ఆడుకుంటున్నారు. వారిని పిలిపించి 'మీ గురువుగారు ఇవ్వాళ రాలేదా, ఆడుకుంటున్నారు' అని అడిగారు. ఒకడు చటుక్కున 'రాలేదండి' అన్నాడు. మరొకడు 'వచ్చారండీ, పాఠం కూడా మొదలుపెట్టారు. కానీ మేమే ఆడుకుంటున్నాం' అన్నాడు. అనుమానమొచ్చి శిష్యుణ్ణి పంపి విచారిస్తే వాళ్ళ గురువు రాలేదని తెలిసింది. రెండవవాణ్ణి 'అబద్ధం ఎందుకు చెప్పావు' అని అడిగారు.

''మా గురువు గారి ఆలస్యాన్ని మీ దృష్టికి తీసుకురావడం ఇష్టంలేక, ఆయన తప్పును మీకు పితూరీగా చెప్పడం ఇష్టంలేక అబద్ధం చెప్పాను'' అన్నాడతను. వారిని పంపేసిన తరువాత 'వీడు రా శిష్యుడంటే... శిక్షకు సిద్ధపడి కూడా అబద్ధమాడి గురువుగారి వైభవం నిలబెట్టడానికి ప్రయత్నించాడు' అన్నారు స్వామివారు.

ప్రస్తుత శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థస్వామివారి గురువులు శ్రీమద్ అభినవ విద్యాతీర్థుల వారి విషయంలో ఒక విశేషం జరిగింది. ఆయన పీఠాధిపతిగా ఉన్న రోజుల్లో ఒక ఆయుర్వేద వైద్యుడొచ్చి ''స్వామీ, ఇది ఒక అద్భుతమైన పసరు. అంత తేలికగా ఎక్కడా దొరకదు. బాగా ఖరీదు కూడా. బెణికినా, కండరాలు పట్టేసినా, నొప్పి ఎక్కువగా ఉన్నా ఇది రాస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది. కేవలం మీకోసం తెచ్చాను'' అని ఆ మందు ఇచ్చాడు. శిష్యులను భద్రపరచమని స్వామివారు చెప్పారు. ఓ గంట గడిచాక స్వామివారు బయటకు వచ్చారు. అక్కడ ఒక కుక్క నడవలేక కాలీడుస్తూ పోతున్నది. ఆయన చూసి దాని కాలు బెణికినట్లుందని చెప్పి అంతకుముందు ఆయుర్వేద వైద్యుడు ఇచ్చిన మందును శిష్యులచేత తెప్పించి దాని కాలుకు పట్టువేసారు. చూస్తుండగానే అది నిలుచుని నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళింది. పక్కనున్న శిష్యులు ... ''అయ్యో, ఆయన అంత ప్రేమగా తమరి కోసమని తెచ్చిచ్చారు కదా, దానిని కాస్తా ఆ కుక్క కాలుకు రాసేస్తిరి'' అన్నారు. 'అదేమిటి...నొప్పి నాదయితే ఒకరకం, కుక్కదయితే మరొకటీనా..!!!'' అన్నారు స్వామి వారు.




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అందుకే వారు జగద్గురువులయ్యారు. గురుత్వంలో అంత శ్రేష్ఠత్వం ఉంటుంది. అసలు ఈ దేశ కీర్తిప్రతిష్ఠలన్నీ ఆచార్యులవే. ఇక్కడ ఉన్న ఐశ్వర్యంవల్లకాదు, ఇతర భోగోపకరణాలవల్లకాదు.. కేవలంగా వారు చేసిన ఉపదేశాలవల్ల, వారి ఆదర్శ నడవడికలవల్ల ఈ దేశ ప్రతిష్ఠ పెరిగింది.

(ఈ పరంపరలో వచ్చేవారం నుంచి 'అతిథి దేవోభవ')

జెన్‌పథం

సహనమే సగం బలం



అనగనగా ఓ రాజ్యం. ఆ రాజ్యానికి ఓ రాజు. ఆ రాజుకి ఒకటే దిగులు. దానిని ఎవరితోనూ చెప్పుకోలేక నానా అవస్థ పడుతున్నాడు. లోలోపల ఒత్తిడికి లోనవుతున్నాడు. రాజు ముఖం చూడగానే ఆయన ఏదో సమస్యతో ఒత్తిడికి లోనైనట్టు మంత్రి గ్రహించాడు. కానీ అడిగితే కోపగించుకుంటాడేమో అని మంత్రి అనుమానం. అయినా ఎలాగైనా తెలుసుకోవాలనుకున్నాడు. అందుకోసం ఓ ఎత్తుగడ వేశాడు.

''మీరు వేటకు వెళ్ళి చాలా కాలం అయినట్టుందే'' గుర్తు చేస్తున్నట్టుగా అన్నాడు మంత్రి.

''అవును. కానీ ఇప్పుడు నేను వేటాడే మానసిక స్థితిలో లేను'' చెప్పాడు రాజు.

''మనసు సరిగ్గా లేనప్పుడే ఉత్సాహం తెచ్చుకోవడానికి వేటాడాలి రాజా. దారిలోనే మీ గురువుగారి ఆశ్రమం. ఆయనను కూడా ఓ సారి దర్శించుకుందాం. బయలుదేరండి.'' చెప్పాడు మంత్రి.

''గురువు'' అనే మాట వినడంతోనే రాజులో ఆశ చిగురించింది. ఆయనను కలిస్తే ఆయన చెప్పే మాటలతో తన దిగులుకు సమాధానం లభిస్తుందేమో అని రాజు అనుకున్నాడు.

రాజుగారి గురువు ఓ జెన్ సాధువు. ఆయన ఊరు చివర ఓ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడే నివసిస్తున్నారు. ఆయన దగ్గర కొందరు శిష్యులు కూడా ఉన్నారు. రాజు రాక తెలియడంతోనే ఆశ్రమ శిష్యులు ఎదురెళ్ళి రాజుగారికి స్వాగతం పలికారు.

రాజు తిన్నగా గురువు గారి దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. తన మనసులోని సమస్యను చెప్పుకున్నాడు. ఎలా పరిష్కరించుకోవాలనుకున్నాడో కూడా చెప్పాడు. అన్నీ అయిన తర్వాత రాజు అడిగాడు –''మీరేమనుకుంటున్నారు'' అని.

సాధువు ఏమీ చెప్పలేదు. కొన్ని నిముషాలు మౌనంగా గడిచాయి. ''నువ్వు బయలుదేరవచ్చు'' అన్నారు.

రాజు ముఖంలో కోపం గానీ నిరాశ గానీ కనిపించలేదు. ఉత్సాహం కనిపించింది. బయలుదేరాడు. తన గుర్రం ఎక్కాడు.

అది చూసిన మంత్రి సాధువు దగ్గరకు వెళ్ళి ''రాజుగారి సమస్యను ఎలా పరిష్కరించారు'' అని అడిగాడు.

''మీ రాజు చాలా తెలివైనవాడు. అతనే తన సమస్యను పరిష్కరించుకున్నాడు. నేను చేసిందేమీ లేదు. అతను తన సమస్యలన్నీ విడమరిచి ఒకటి తర్వాత ఒకటి వరుసగా చెప్తుంటే ఓపికగా విన్నాను. అంతేకాదు, ఆయన దగ్గరకు జరిగి భుజం మీద వాలి విన్నాను. వెన్ను తట్టాను. అంతే....'' అన్నారు.

సాధువు మౌనంగా విన్న క్రమంలో ఆయన పాటించిన సహనాన్ని గమనించి దాన్ని రాజు పాటించాలనుకున్నాడు. అదే తన సమస్యలకు పరిష్కారం అని అనుకున్నాడు. అంతకన్నా మరొకటి లేదని గ్రహించాడు కనుకే రాజు తన సమస్యకు జవాబు దొరికిందన్న ఆనందంతో వేటకు వెళ్ళాడు.

- యామిజాల జగదీశ్

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

సువార్త

వెలిగేదీ... వెలిగించేదీ!!



బేతనియ సోదరీమణులు, లాజరు అక్కలు మరియ, మార్త మంచి విశ్వాసులు. కాకపోతే ఇద్దరూ చెరో తెగకు చెందినవారు. వారింట్లో యేసు ఎన్నోసార్లు ఆతిథ్యం పొందాడు. యేసు వచ్చింది మొదలు వెళ్లేదాకా తనకు తోచిన సపర్యలు, మర్యాదలు చేస్తూ చెమటలు కక్కుతూ ఆయన మెప్పుకోసం మార్త తాపత్రయపడేది. మరియ ఆయన పాదాల వద్ద కూర్చుని ఆయన మాట్లాడే ప్రతి మాటా ఆలకిస్తూ తన్మయురాలై జీవనసాఫల్యానికి దారి వెదుక్కునేది. ప్రభువు కోసం పని చేసే హడావిడిలో ఆయన మెప్పు పొందడమే మార్త లక్ష్యం కాగా, యేసు మాటలు ఆలకిస్తూ ఆయన మనసు తెలుసుకొని ఆ మేరకు జీవించాలన్నది మరియ ఉద్దేశ్యం. వారిద్దరిలో ఎవరు గొప్ప? అన్న ప్రస్తావన ఒకసారి వస్తే, 'మార్త నాకోసం బోలెడు పనులు చేయాలనుకొని తొందర పడుతోంది కాని మరియ మాత్రం అవసరమైనది, అత్యుత్తమమైనది, ఆమె నుండి ఎన్నడూ తీసివేయబడనిది ఎన్నుకున్నదని యేసు అన్నాడు (లూకా 10:38–42).

మరియ, మార్తలిద్దరూ విశ్వాసులే కాని మరియ ఉత్తమ శ్రేణికి చెందిన విశ్వాసి అని యేసే స్వయంగా శ్లాఘించాడు. దేవుని కోసం తమకు తోచిందల్లా చేసే 'క్రైస్తవం'లో హడావిడి కనిపిస్తుంది కాని దానివల్ల దేవుని రాజ్య నిర్మాణం జరగదు. ఆకులు, కొమ్మలూ విస్తారంగా ఉన్నా ఫలాలనివ్వని వృక్షాల్లాంటివి ఈ పరిచర్యలు. పరస్పర ప్రేమ, క్షమాపణ, త్యాగం, పవిత్రత, దైవికత పునాదిరాళ్లుగా కలిగిన లోకాన్ని ప్రభావితం చేసి పరివర్తన తెచ్చే దేవుని రాజ్యనిర్మాణం, దేవుని సంకల్పాలు, ఉద్దేశ్యాల మేరకు జరగాలి. అందుకు ఆయన పాదాల వద్ద కూర్చొని ఆయన మాటల్ని శ్రద్ధగా ఆలకించ గలిగిన పరిచారకులు కావాలి. అలా దేవుని సంకల్పాలు తెలుసుకొని వాటికి విధేయులైన వారితోనే దేవుని రాజ్యనిర్మాణం సాధ్యమవుతుంది. కాని ఈనాడు మరియ, మార్తలే అత్యధికంగా కనిపిస్తున్నారు, వారే హడావుడి చేస్తున్నారు. దేవుని పేరుతోనే ఎజెండాలతో, ధనార్జనే, పేరు సంపాదించుకోవడమే ప్రధానోద్దేశ్యంగా కలిగిన పరిచారకుల హడావిడి అంతటా కనిపిస్తోంది. సాత్వికత్వం మచ్చుకైనా కనపడని 'సొంత సామ్రాజ్యాల్లాంటి పరిచర్యలు, చర్చిలు వెలుస్తున్నాయి. ఈ లోకాన్ని పరలోకంగా మార్చగల 'దేవుని రాజ్యనిర్మాణం' ఒక నినాదంగా మిగిలిపోయింది. భజనలు, ప్రార్థనలు, పాటలు, డప్పులు, ప్రసంగాల హోరులోఅసలు దేవుడున్నాడా లేదా అన్నది గమనించకపోవడం విచారం. తాను వెలుగుతూ, లోకాన్ని ప్రేమ, త్యాగం, క్షమతో నింపుతూ నింగికెగిరే రాకెట్ లాంటిదే క్రైస్తవం. అదే దేవుడు కోరుకునే అత్యుత్తమ విశ్వాసం.

- రెవ.డా. టి.ఎ.ప్రభుకిరణ్

ఇస్లాం వెలుగు

ఈ కష్టాలకు పరిష్కారం?



మానవ పుట్టుక ప్రారంభమైన నాటినుండి నేటివరకు ఎంతోమంది దైవప్రవక్తలు, రుషులు మానవ సమాజాన్ని ఉద్ధరించడానికి వచ్చారు. మంచీ చెడుల విచక్షణా జ్ఞానాన్ని, దైవమార్గాన్ని మానవాళికి విడమరచి చెప్పారు. చెడులు చేస్తే, పాపపు పనులకు ఒడిగడితే దైవం వివిధ రూపాల్లో శిక్షను అవతరింపజేస్తాడని హెచ్చరించారు. అయినా ప్రజలు మంచి చెప్పినవారి మాటల్ని పట్టించుకోలేదు. దైవం వారిపై శిక్షను అవతరింజేశాడు.

ఒకసారి మదీనాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. భయంకరమైన కరువు వచ్చిపడింది. అప్పుడు, అప్పటి ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) వర్షం కోసం దైవాన్ని ప్రార్థించే బదులు, పాప క్షమాపణకైదైవాన్ని వేడుకున్నారు. దీంతో ప్రజలు, 'మీరసలు వర్షం కోసం దుఆ చేయనేలేదు'. అని నిందించారు, దానికాయన 'నేను ఆకాశం నుండి వర్షం కురిసే తలుపులు తట్టాను. ఇంతకన్నా ఇంకేం కావాలి?' అని సమాధానం చెప్పారు.

ప్రఖ్యాత దైవ భక్తుడు హజ్రత్ హసన్ బస్రీ(రహ్మ) దగ్గరికి ఒకతను వచ్చి, తమప్రాంతంలో కరువొచ్చిందని చెప్పాడు. దానికాయన, పాప మన్నింపుకై దైవాన్ని వేడుకోండి. అని చెప్పారు. కాసేపటికి మరొకతను వచ్చి తమ ప్రాంతంలో దారిద్ర్యం తాండవిస్తోందని చెప్పాడు. ఇలా మరి కొందరు వచ్చి తలా ఒక సమస్య చెప్పుకున్నారు. హ.హసన్ బస్రీ (ర) అందరికీ ఒకటే పరిష్కారం చెబుతూ, 'పాపాల మన్నింపుకై దైవాన్ని వేడుకోండి' అని సలహా ఇచ్చారు.

అంటే, మానవ జీవితంలో ఒడిదుడుకులు సహజం. కాని కొన్ని స్వయానా మనం కొని తెచ్చుకునేవీ ఉంటాయి. దైవం మానవుణ్ని సృష్టించి, ఈ సృష్టిలో మరే జీవరాసికీ లేనంత బుద్ధిబలాన్ని, మంచీచెడుల విచక్షణా జ్ఞానాన్నీ, అపారమైన మేధో సంపత్తినీ ప్రసాదించాడు. మానవుడు దాన్ని దుర్వినియోగం చేస్తూ, దైవాదేశాలకు విరుద్ధంగా మనోవాంఛా లోలుడై జీవనం సాగిస్తున్నాడు. ప్రకృతిని ఇష్టమొచ్చినట్లు వినాశనానికి గురిచేస్తున్నాడు. అందుకే ఈ ఆపదలూ, కష్టాలూ, ప్రకృతి వైపరీత్యాలు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు. ఇది దైవం మానవులకు చేసే ఒకహెచ్చరిక. మానవులకు నష్టం చేయాలన్నది దేవుని తలంపుకాదు. కానీ ఇదొక హెచ్చరిక..జాగ్రత్త.. మేలుకోండి. లేకపోతే అంతకంత అనుభవిస్తారు.. అన్న హెచ్చరిక. మానవుడు విషయాన్ని అర్థం చేసుకొని నడవడికను సరిదిద్దుకుంటే, దైవాదేశాల ప్రకారం నడుచుకుంటూ సమస్త సృష్టినీ ప్రేమించ గలిగితే దైవం వారి తప్పుల్ని మన్నించి మంచి పరిస్థితుల్ని కల్పిస్తాడు.

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ప్లీజ్... నన్ను బాధపెట్టొద్దు


● సుదీప్


● అమీ జాక్సన్

సదరన్ స్పైస్

.... అంటున్నారు కన్నడ హీరో సుదీప్. అసలేం జరిగిందంటే... ఈ హీరో ఫ్యాన్ ఒకరు చేతిపై 'కిచ్చా' అని పచ్చబొట్టు పొడిపించుకున్న విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న సుదీప్.. ''ఫ్యాన్స్ ఇలా చేస్తున్నందుకు థ్యాంక్స్ చెప్పాలో లేక సారీ చెప్పాలో తెలియడం లేదు. నువ్వు ఆ పచ్చబొట్టు వేయించుకుంటున్నప్పుడు ఎంత బాధ భరించి ఉంటావో నేను అర్థం చేసుకోగలను (పచ్చబొట్టు పొడిపించుకున్న అభిమానిని ఉద్దేశిస్తూ). ఇలాంటివి చేసి మీరు బాధపడొద్దు. నన్ను బాధపెట్టొద్దు. నా సినిమా చూడడానికి ఫ్యాన్స్ టిక్కెట్స్ కొని, నన్ను సపోర్ట్ చేస్తే అదే చాలు. మనస్ఫూర్తిగా చెబుతున్నాను. నాపై అభిమానాన్ని చాటుకోవడానికి ఫ్యాన్స్ ఇంకేమీ చేయాల్సిన అవసరం లేదు. అంతులేని మీ అభిమానానికి థ్యాంక్స్'' అన్నారు సుదీప్. ఇక సినిమాల విషయానికొస్తే... ప్రేమ్ దర్శకత్వంలో శివరాజ్ కుమార్, సుదీప్, అమీ జాక్సన్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'ది విలన్'. ''వారం రోజుల తర్వాత శుక్రవారం 'ది విలన్' సినిమా సెట్‌లోకి ఎంటర్ అయ్యాను'' అన్నారు సుదీప్. ప్రస్తుతం సుదీప్, అమీ పాల్గొనగా ఓ పాట చిత్రీకరిస్తున్నారు. ఇందులో అమీ పాత్ర కూడా చాలా డిఫరెంట్‌గా ఉంటుందట. ఈ సంగతి ఇలా ఉంచితే అజయ్‌వర్మ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా రూపొందుతోన్న 'నీరళి' చిత్రంలో సుదీప్ కీ రోల్ చేస్తున్నారట. సుదీప్ కన్నడ సినిమాలు మలయాళంలో డబ్ అయ్యాయి. అయితే ఆయన చేయనున్న ఫస్ట్ స్ట్రైట్ మలయాళ మూవీ ఇది.

భారతీయుడి బెలూన్ ఎగిరింది


● శంకర్


● కమల్‌హాసన్

లంచం కోసం పీడించేవాడు సొంత కొడుకైనా సరే శిక్ష పడాల్సిందే అనే కాన్సెప్ట్‌తో ఆల్మోస్ట్ 22ఏళ్ల క్రితం వచ్చిన 'భారతీయుడు' సినిమా సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌ను ప్లాన్ చేశారు దర్శకుడు శంకర్. ఫస్ట్ పార్ట్‌లో హీరోగా నటించిన కమల్‌హాసన్‌నే ఈ సీక్వెల్‌లోనూ హీరోగా నటించనున్నారు. ఈ సినిమా గురించిన అప్‌డేట్‌ను రిపబ్లిక్ డే సందర్భంగా దర్శకుడు శంకర్ తెలియజేశారు. 'ఇండియన్ 2'ను త్వరలో స్టార్ట్ చేయబోతున్నట్లు 'హీలియమ్ బెలూన్'ను ఆయన తైవాన్‌లో ఎగురవేశారు. ఆ బెలూన్‌పై 'ఇందియన్ 2' అని తమిళంలో 'ఇండియన్ 2' అని ఇంగ్లిష్‌లో రాసి ఉంది. ఇలా రెండో భారతీయుడు తైవాన్‌లో స్టార్ట్ అయ్యాడన్నమాట. రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన '2.0'కి ఓ రచయితగా వ్యవహరించిన జయమోహన్ 'భారతీయుడు 2'కి కూడా రైటర్‌గా చేయనున్నారట. వచ్చే నెల ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానుంది.


● యువన్ శంకర్ రాజా, కార్తీక్ రాజా, ఇళయరాజా

ట్రిపుల్ ట్రీట్

సంగీతప్రియులకు ఓ శుభవార్త. ఇళయరాజాకు 'పద్మ విభూషణ్' అవార్డు వచ్చిందని ఆనందంలో ఉన్న ఈ సంగీత జ్ఞాని అభిమానుల ఆనందాన్ని డబుల్.. కాదు ట్రిపుల్ చేశారు ఆయన తనయులు యువన్ శంకర్ రాజా, కార్తీక్ రాజా. తండ్రి ఇళయరాజాతో కలసి ఈ ఇద్దరూ ఓ సినిమాకి పాటలు సమకూర్చనున్నారు. సోదరుడు కార్తీక్ రాజాతో కలిసి యువన్ శంకర్ రాజా తన సొంత ప్రొడక్షన్ హౌస్ వైయస్సార్ ఫిలింస్‌పై 'మామనిదన్' అనే సినిమా నిర్మించనున్నారు. ఈ సినిమాకే ముగ్గురూ స్వరాలందిస్తారు. ఇంతకుముందు తండ్రి కంపోజిషన్‌లో తనయులు, తనయుల కంపోజిషన్‌లో తండ్రి పాడినప్పటికీ ముగ్గురూ కలిసి ఓ సినిమాకి పాటలివ్వడం ఇదే తొలిసారి. కచ్చితంగా ట్రిపుల్ ట్రీట్ అనే చెప్పాలి. శ్రీను రామస్వామి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి హీరోగా నటించనున్నారు.

ముహూర్తం కుదిరింది

ఫొటో చూసి, హెడ్డింగ్ చదివి హీరోయిన్ హరిప్రియకు పెళ్లి సెట్ అయ్యిందని ఆలోచించి తప్పులో కాలేయకండి. ముహూర్తం కుదిరింది ఆమె నెక్ట్స్ చేయబోయే చిత్రానికి. జయతీర్థ దర్శకత్వంలో రిషబ్ శెట్టి, హరిప్రియ జంటగా రూపొందనున్న సినిమా 'బెల్ బాటమ్'. ఈ చిత్రాన్ని రేపు లాంఛనంగా స్టార్ట్ చేయడానికి చిత్ర బృందం ముహూర్తం నిర్ణయించారు. ఎయిటీస్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం సాగనుందట. వచ్చే నెలలో షూటింగ్ స్టార్ట్ కానుంది. ప్రస్తుతం లొకేషన్స్‌ను సెర్చ్ చేస్తున్నారట చిత్ర బృందం. ''నా నెక్ట్స్ చిత్రం 'బెల్ బాటమ్'లో నటించనున్నందుకు సంతోషంగా ఉంది. జయతీర్థ గారితో సెకండ్ టైమ్, రిషబ్ శెట్టితో థర్డ్ టైమ్ కలిసి వర్క్ చేయబోతున్నాను. నాకు వెరీ వెరీ స్పెషల్ మూవీ ఇది. టీమ్ అందరితో కలిసి సెట్లో సందడి చేసేందుకు వెయిట్ చేస్తున్నాను'' అని హరిప్రియ పేర్కొన్నారు. సంతోష్ కే నిర్మించనున్న ఈ సినిమాకు సంగీతం: అంజేష్ లోక్‌నాథ్, కెమెరా: అరవింద్ కశ్యప్, ఎడిటింగ్: ప్రకాశ్.


● ఫాహద్ ఫాజిల్, నజ్రియా నజీమ్

నజ్రియా రిటర్న్స్

నయనతారకు సిస్టరా?.. నజ్రియా నజీమ్ సినిమాల్లోకి వచ్చిన కొత్తలో చాలా మంది ఇలానే అనుకున్నారు. ఎందుకంటే నయనతార పోలికలు కొంచెం నజ్రియాలో కనిపిస్తాయి. ఆ సంగతలా ఉంచితే నజ్రియా చాలా క్యూట్‌గా ఉంటారు. తన అమాయకపు నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో చాలామంది ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నారామె. నటుడు ఫాహద్ ఫాజిల్‌ను పెళ్లి చేసుకున్నాక సినిమాలకు పూర్తిగా దూరమయ్యారు. నజ్రియా నటించిన లాస్ట్ మూవీ 'బెంగళూర్ డేస్'. విశేషం ఏంటంటే ఆ సినిమాలో ఫాహద్ భార్యగానే నటించారామె. మళ్లీ మలయాళ స్క్రీన్‌పై కనిపించటానికి రెడీ అయ్యారు నజ్రియా. 'బెంగళూర్ డేస్' డైరెక్టర్ అంజలి మీనన్ డైరెక్షన్‌లో ప్రస్తుతం ఓ చిత్రంలో యాక్ట్ చేస్తున్నారామె. ఈ సినిమాలో పార్వతి, పృథ్వీరాజ్ కూడా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఇది కాకుండా భర్త ఫాహద్‌తో ఓ సినిమాలో కనిపిస్తారట నజ్రియా. అన్వర్ రషీద్ దర్శకత్వంలో రూపొందనున్న 'ట్రాన్స్' సినిమాలో ఫాహద్‌కు జోడీగా నజ్రియాను సంప్రదించినట్టు మలయాళం మీడియా టాక్. దాదాపు నాలుగేళ్ల తర్వాత నజ్రియా స్క్రీన్‌పై కనిపించనుండటం ఆమె అభిమానులకు ఆనందం కలిగించే విషయం.


● హరిప్రియ

రా ఏజెంట్


● 'జయం' రవి

తమిళ హీరో 'జయం' రవి సీక్రెట్ ఆపరేషన్ ఏదో చేయడానికి రెడీ అవ్వబోతున్నారట. మరీ.. అంత సీక్రెట్‌గా చేయాల్సిన అవసరం ఏంటి? అనే విషయానికి 'బేబి' రూపంలో సిల్వర్ స్క్రీన్‌పైనే సమాధానం దొరకుతుందని కోలీవుడ్ టాక్. ఆల్మోస్ట్ మూడేళ్ల క్రితం అక్షయ్‌కుమార్ హీరోగా నీరజ్ పాండే దర్శకత్వంలో వచ్చిన స్పై థ్రిల్లర్ 'బేబి'. ఈ సినిమాలో అక్షయ్ రా (రీసెర్చ్ అండ్ ఎనాలిసెస్ వింగ్) ఏజెంట్‌గా నటించారు. ఇప్పుడు ఈ సినిమాను తమిళ్‌లో రీమేక్ చేయబోతున్నారట. ఇందులో అక్షయ్ పాత్రలో కనిపించనున్నారట 'జయం' రవి. అహ్మద్ దర్శకత్వంలో రూపొందబోయే ఈ సినిమాకు మధి కెమెరామేన్‌గా వర్క్ చేయబోతున్నారని చెన్నై ఇండస్ట్రీ టాక్. ఇదిలా ఉంటే శక్తి సుందర్‌రాజన్ దర్శకత్వంలో 'జయం' రవి హీరోగా రూపొందిన 'టిక్. టిక్. టిక్' చిత్రం జనవరి 26న విడుదల కాలేదు. ''రిపబ్లిక్ డే రోజున టిక్.టిక్.టిక్ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకున్నాం. కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలో ఎనౌన్స్ చేస్తాం'' అన్నారు 'జయం' రవి.

లైక్ డాడ్స్ - లైక్ సన్స్


● ప్రణవ్ మోహన్‌లాల్


● దుల్కర్ సల్మాన్

మమ్ముటి, మోహన్‌లాల్ మలయాళ సూపర్ స్టార్స్. ఇద్దరూ సూపర్ స్టార్స్ అంటే పోటీ సహజమే. కానీ అది కేవలం సినిమాల వరకు మాత్రమే. బయట వాళ్లిద్దరూ మంచి స్నేహితులు. వాళ్లనే వాళ్ల వారసులు కూడా ఫాలో అవుతున్నారు. మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్ ఆల్రెడీ హీరోగా హిట్. ఇప్పుడు మెహన్ లాల్ తనయుడు ప్రణవ్ మోహన్ లాల్ 'ఆది' సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీకు పరిచయం అయ్యాడు. 'ఆది' సినిమా ఈ నెల 26న విడుదలైంది. ఈ సందర్భంగా ప్రణవ్ డెబ్యూ సినిమాకు దుల్కర్ సల్మాన్ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ లెటర్ రాసి, ఫేస్‌బుక్ ద్వారా పంచుకున్నారు. ''డియరెస్ట్ అప్పు, 'ఆది' సినిమాకు ఆల్ ది వెరీ బెస్ట్. మనిద్దరం ఎప్పుడూ మంచి ఫ్రెండ్లీ బాండ్‌ను షేర్ చేసుకున్నాం. నేను నిన్ను మొదటిసారి చూసినప్పుడు నువ్ చిన్నపిల్లాడివి. మనం ఫ్రెండ్స్ అయినప్పుడు నీకు ఏడేళ్లు. నేను హై స్కూల్‌లో చదువుతున్నాను. నువ్వు నాకు ఎప్పటికీ 'లిటిల్ బ్రదర్'వే. నీ ప్రతీ స్టెప్‌ను అప్రిషియేట్ చేస్తూ, నీ సక్సెస్ కోరుకుంటున్నాను. నీ పెరెంట్స్, సిస్టర్ నీ ఎంట్రీకు ఎంత ఎగ్జైటెడ్‌గా ఉన్నారో నాకు తెలుసు అండ్ వాళ్లు అస్సలు వర్రీ అవ్వాల్సిన పని కూడా లేదు. ఎందుకంటే నువ్వు పుట్టిందే సూపర్ స్టార్ అవ్వడం కోసం'' అంటూ ప్రణవ్‌కు హృదయపూర్వక విషెస్ తెలిపారు దుల్కర్ సల్మాన్. చాలా బాగుంది కదూ. ఈ సంగతి ఇలా ఉంచితే.. ఏ నటుడైనా తన తొలి సినిమాను స్క్రీన్ పై చూసుకొని మురిసిపోవాలనుకుంటాడు. కానీ ప్రణవ్ మోహన్ లాల్ మాత్రం అందుకు భిన్నం. ప్రణవ్‌కు ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టమట. తన తొలి సినిమా 'ఆది' షూటింగ్ కంప్లీట్ అవ్వగానే తన ఫేవరేట్ ప్లేస్ హిమాలయాలకు వెళ్లిపోయాడట. ప్రణవ్ తనను తాను ఇంకా స్క్రీన్ మీద చూసుకోలేదు అని దర్శకుడు జీతూ జోసెఫ్ పేర్కొన్నారు. 'ఆది' మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రణవ్ యాక్షన్ సీక్వెన్స్ బాగా చేశాడని, మిగతా సీన్స్ కూడా ఓకే అని టాక్. సో.. మోహన్ లాల్ ఫుల్ హ్యాపీ అన్నమాట.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రెడ్డి/USA/29/5'9"/BE/MS/SWE/ AMAZON/ $130K / 25 Cr *29/5'11"/BE/MS /SWE/ IBM/$118K/ 20 Cr * 29/5'11"/BE /MS/ SWE/ $100K/ 15 Cr. 8008345606 [H-684914]

రెడ్డి/India /27/5'9"/BE/ME/SWE/MNC/12 Lakhs PA / 30 Cr *29/5'10"/BE/SWE/ CAPGEMINI/70 K/ 20 Cr * 26/5'8"/BE (IIT)/ Assistant Director / Indian Trade Service / 75K /15 Cr. 7337320055 [H-684914]

రెడ్డి/Doctors/28/6'/MBBS / MS (Orthopedics) 50 Cr * 29/5'9"/MBBS / MD (General Medicine) / 12 Lakhs PA / 30 Cr. *30/6'/MBBS / MS/ MCH/30 Cr. 9177897786 [H-684914]

రెడ్డి/విడోవర్/50 Yrs/డిగ్రీ/ బిజినెస్/ 1లు PM/ 5 కోట్ల ఆస్తి గల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9618226996 [H-684633]

క్రిస్టియన్, మాల/Govt. ADE (TRANSCO) /60,000/- PM /M.Tech / 5'9" ఎత్తు/ 29 సం॥ అబ్బాయికి అమ్మాయి కావలెను. 9642728299 [H-684633]

క్రిస్టియన్,మాల/27/5'5"/B.Tech/ Job / ఆస్తి కలిగిన వరునకు అందమైన సాంప్రదాయ వధువు కావలెను. 9246331689 [H-684146]

విశ్వబ్రాహ్మణ/IIమ్యారేజ్/40/5'6"/ గోల్డ్ బిజినెస్/ 70,000/-PM గల వరునకు వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ నుండి అందమైన వధువు కావలెను. పిల్లలున్నా OK. కుల ప్రసక్తి లేదు అర్జెంట్ 8143501725 [H-684146]

రెడ్డి/33/5'9"/MS/USA/$ 120K / వరునికి B.Tech / M.Tech / MS వధువు కావలెను. US Match Preferred (అర్జెంట్) ఫోన్ : 7077077441 [H-704005]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ USA Green Card / B.Tech / MS/ 27/5'9"/95K / 30 Cr (Prop) Hyd * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ MBBS/ Res-Doc-USA/ 28/6'/ (Surgeon) / 50 Cr + (Prop) / Father - Doc-USA * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ Business / B.Tech /MBA *32/6'/ 400 Cr * 28/5'10"/200 cr * 31/5'9"/200 Cr * 29/5'8"/200 Cr * 30/5'10"/200 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / MBA/ USA/26/ 5'9"/75 Cr * BS/USA/25/6'/150 Cr* MS/ 24/6'/40 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ (Business) / B.Tech/ MBA / V. Smart Boy/ 100 Cr (Prop) / 27/6 Feet * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech (IIT) / M.Tech (IIT) / PhD/ USA/300k/ 32/6'/ 10 Cr * VIT/ GMAT/ MBA (USA) (KELLY) 30/5'11"/180K * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ B.Tech /MS/H1/USA*28/6'/200 Cr * 28/5'11"/60 Cr * 34/5'10"/ 70 Cr * 30/5'7"/150K / 70 Cr*28/5'8"/100K / 30 Cr* Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015.

Reddy/ PG-Doc/MS (Optha) Both Partents Govt. Doc/30/5'10"/ V. Smart / 10 Cr (Prop)* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ MBBS /MS (Sur) / DM/ Both Parents - Doc/ Own Hospital / Hyd/ 29/5'11"/80 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ BSc (Statistics) / MSc (Actuary) / 25L / Yr /15 Cr (Prop) / 29/5'11"* Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

వరుడు కావలెను

Reddy/ Very Young Girl / B.Tech / 19 Years / 5'8"/ 30 Cr (Prop) * Cont: K.C. Reddy Marriage Bureau, Road No.3, B. Hills, Hyd. Ph: 9849321309

Reddy/B.Tech /MS/26/5'3"/150 Cr * 26/5'3 1/2" / 40 Cr * 28/5'5"/40 Cr * 26/5'7"/30 Cr * 28/5'4"/ 30 Cr * 27/5'6"/100 Cr * Cont: K.C. Reddy , Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech (IIT)/MS/USA * 30/5'5"/ 200K/ 15 Cr * 29/5'4"/180K * 27/5'4" * 26/5'7"/30 Cr * 27/5'2"/5 Cr * 27/5'5" * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/MBBS / Res-Doc-USA*26/5'7"/ 50 Cr * 26/5'4"/120 Cr * 27/5'7"/10 Cr * 29/5'3" * 29/5'5"/10 Cr * 30/5'4" * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/MBBS / Most Beautiful / 22/ 5'5"/ 30 Cr (Prop) * Cont: K.C. Reddy Marriage Bureau, Road No.3, B. Hills, Hyd. Ph: 9849321309

Reddy/B.Tech / MS/ Most Beautiful / 26/ 5'3"/50 Cr (Prop) * Cont: K.C. Reddy Marriage Bureau, Road No.3, B. Hills, Hyd. Ph: 9347807015

Reddy/MBBS /PG * 28/5'3" (Sur) / 27/5'6"/GM/ 29/5'3"/ (RAD) * 30/5'6"/ (DER) * 28/5'8"/GM * 29/5'4"/GM * 28/5'4"/ENT * 26/5'5" (Path)* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ Rich /B.Tech / 27/5'6"/100Cr * 30/5 '2 1/2" / 100 Cr * 28/5'7"/50 Cr * 28/5'3"/20 Cr * 28/5'5"/40 Cr* 29/5'3"/30 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph: 9347807015

Reddy/ (Rich) / B.Tech/ 26/5'5"/10 Cr * 27/ 5'5"/25 Cr * 27/5'2"/20 Cr * 27/5'5"/ 20 Cr * 28/5'3"/20 Cr * 26/5'6"/30 Cr * 20/5'8"/30 Cr * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ (Divercee) / Most Beautiful / 26/5'3"/BBA/. 10 Cr *32/5'6"/M.Tech/ 20 Cr * 28/5'6"/25 Cr * B.Tech / 31/5'2 1/2"/ 10 Cr* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

[D-054]

క్రిస్టియన్ మాల / 32 సం॥/5'.10" /M.S జర్మనీ / 1.లక్ష + PM, ఫేర్ వరునికి M.Tech చేసి బెంగుళూరులో జాబ్ చేయు వధువు కావలెను. డైరెక్ట్ : 9989089400. [P- 0967111]

SC మాల 5'7" / 28Y, B.Tech, SWE, మలేషియా / 1.6 Lakhs P.M. / వెల్ సెటిల్డ్ వరునకు అందమైన వధువు కావలెను. Ph : 98491 64249. [V- 0973236]

వరుడు కావలెను



రెడ్డి (USA)/28/5'04"/BE/MS/SWE/MNC/$ 90 K PA/ 30 Cr * 27/5'4"/BE /MS/SWE/ Deloitte/ $ 60K PA/ 20 Cr. *24/5'5"/BE/ MS/SWE/ MNC/ $85K PA / 10 Cr. 9393009493 [H-684914]

రెడ్డి (India)/27/5'5"/BE/MBA / Business / 20 Cr * 25/5'6"/ BE/SWE/ Global / 10 Cr * 24/5'3"/SWE / TCS / 5 LA PA / 10 Cr. 9848566733 [H-684914]

రెడ్డి/24/5'6"/MBBS /MS (ENT) / 15 Cr * 28/5'7"/ MBBS / MD (Dermatology) 10 Cr * 28/5'5"/ MBBS / MD (Anesthesiologist) 20 Cr. 7337320066 [H-684914]

కర్నూలు మహిళ/40 వేలు ఫ్యామిలీ పెన్షన్/ 55/5'3"/10th క్లాస్ / కర్నూలులో 2 ఎకరాల భూమిగల వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 7993979542 [HA-16078]

రెడ్డి / డైవర్సీ/కుల ధన ప్రసక్తి లేదు/ 14 కోట్ల ఆస్తి/ వయస్సు 38y / 5'6"/ Qly: PG/ వెరీ ఫెయిర్/ నెలకు 7 లక్షల సంపాదన గల అందమైన వధువుకు వరుడు కావలెను. 9515528286 [HA-16078]

రెడ్డి / 42/విడో/5'4"/ Own Cement Factory & Questra World Business / 20 Cr ప్రాపర్టీ గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. 7893357075 [HA-16078]

ముదిరాజ్/5'3"/డిగ్రీ/Govt. Employee/ Salary : 35000/- PM/ గల వెల్ సెటిల్డ్ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 9949919285 [HA-16078]

పంచాయతీరాజ్/రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్/ 50 వేలు పెన్షన్/ 5'4" ఎత్తు/ స్వంత ఇల్లుగల తిరుపతి వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. అర్జెంట్ – 9908105567 [HA-16078]

కాపు/విడో/30/5'5"/MBBS /Govt. డాక్టర్/ 70,000/- PM/6 Cr ప్రాపర్టీ/ఈమధ్యనే భర్తను కోల్పోయిన వధువుకు కుల /ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను. 9966300436 [H-684633]

మున్నూరు కాపు/ B.Tech (IT) / Govt. AE (T.S. జెన్‌కో) 45,000/– PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9703978131 [H-684633]

క్రిస్టియన్ మాదిగ/ B.Tech /MBA/ Govt. AE (ఇరిగేషన్ Dept) / 45,000/- PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9885055185 [H-684633]

పద్మశాలి/విడో/33Y/5'4"/ Sand బిజినెస్/10 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 8106499144 [H-684146]

రాజులు/26Y/5'3"/ ఆటో ఫైనాన్స్/ 8 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 7659921467 [H-684146]

నాయుడు/డైవర్సీ/30Y/5'5"/ సాఫ్ట్ వేర్/ 7 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 9121589359 [H-684146]

యాదవ 45/5'3"/MA BEd / Govt. School Asst. టీచర్/2 Cr (P) / Sal: 50,000/- వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. 42/5'2"/B.Com/ CA/ Sal: 65,000/-/ 11 Cr (Prop) వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. 9989979536 [HA-5081]

రెడ్డి/డైవర్సీ/కుల పట్టింపులేదు / 29/ 5'1"/B.Pharma/ నెలకు మంచి సంపాదన & ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. 9581690158 [H-704006]

రెడ్డి 'విడో' 25 Y', B.Tech' 25 కోట్ల ప్రాపర్టీ కల్గి యాక్సిడెంట్‌లో పేరెంట్స్ మరియు భర్తను కోల్పోయిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, ప్రసక్తి లేదు) Contact Whatsapp 81210 16556. [V- 599996]

కమ్మ 'విడో' 30 Y', B.Tech' 20 కోట్ల ప్రాపర్టి కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) మీ ఫోటో Details Whatsappలో Send చేయండి. సంప్ర : 90309 16673. [V- 599995]

వేదికలు



భావన వివాహ వేదిక. Hyd వారి ఆధ్వర్యంలో 4-2-18, ఆదివారం ఉ. 11 గం.లకు "కమ్మ మరియు సా. 3. గం.లకు "కాపు వధూవరుల పరిచయ వేదిక జరుగును. 9246282009/9246204980 [HA-6040]

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, BDS, MDS & డాక్టర్స్‌కి మాత్రమే. 1వ, 2వ / లేటు, దేశ/విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదర్చబడును. 9963632698 [HA-16078]

దూదేకుల ముస్లిం (నూర్ బాషా) B.Tech, M.Tech, M.S., SWE, MBBS, MD, M.S.,Govt., C. Govt., బ్యాంకింగ్, లెక్చరర్స్ దేశ విదేశాల 1వ, 2వ వధూవరుల సంబంధాలకై సంప్ర॥ 9948820402 /9640999003 [H-684146]

కుల పట్టింపులేని వారికి 2వ/ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2 pm - 5 pm పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధూవరుల లిస్ట్ ఇవ్వబడును. కుదర్చబడును. Hyd: 8712456779 [H-5081]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్/ అన్ని కులముల వారికి డైవర్సీస్/ విడోస్/ విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజి॥) ఫోన్: 7286931144 [H-684124]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS/IPS/ MBBS/MD/MCA/Abroad & Govt Job Holders సంప్ర॥ శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182. [H-684483]

Bandan Matrimony. అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్ర: తిరుపతి, బెంగళూరు,9848711871, 80506 10900 www.bandanmatrimony.com [T-3076]

క్రిస్టియన్ వివాహ పరిచయ వేదిక. ప్రతి-శని, ఆదివారం మీ అమ్మాయికి/అబ్బాయికి సంబంధం కావాలా? డాక్టర్స్, ఇంజనీర్స్, పీజీ, డిగ్రీ సంబంధాలు చాలా కలవు. www.sweethomemarriage.com. ఫోన్: 0891–2739003, 98490 72372. [V- 617970]


అన్ని కులాల 1వ, 2వ, లేట్, డైవర్సీ, విడో, పెన్షనర్, 23 నుండి 60 సం॥ల Pvt & Govt. Jobs సంబంధాలకై సంప్ర॥ (స్త్రీలకు ఫ్రీ) Ph: 9618905511/9618905533 [H-684633]

★

బ్రాహ్మణ వధూ-వరుల వివాహ పరిచయ వేదిక / 11-02-2018న జ్యోతి గార్డెన్స్, ECIL, Hydలో జరుగును. Time : 1 PM to 6 PM *9704656103 /9533608887 [HA-19868]

విచారణకు ఆదేశించండి

శిశు గృహాల్లో మరణాలపై హైకోర్టులో బాలల హక్కుల సంఘం పిల్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ శిశుగృహాల్లో శిశు మరణాలు పెరిగిపోతుండటంతోపాటు విక్రయాలు జరుగుతున్నాయని, ఇందుకు బాధ్యులైన వారిపై విచారణ జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇందులో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, నల్లగొండ జిల్లా కలెక్టర్ తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. పౌష్టికాహారలోపం, నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఒక్క ఏడాదిలో నల్లగొండ జిల్లాలో దాదాపు 32 శిశు మరణాలు చోటు చేసుకున్నాయని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ ధర్మాసనం ఈ నెల 30న విచారణ జరపనుంది.

ఇస్రో గొప్ప విజయాలు సాధించింది

వ్యాస్ స్మారకోపన్యాసంలో ఇస్రో మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఇస్రో గొప్ప విజయాలు సాధించిందని.. వాటి ఫలితాలను ప్రస్తుతం అనుభవిస్తున్నామని ఇస్రో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఏఎస్ కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన పోలీస్ అకాడమీలో ఐపీఎస్ వ్యాస్ స్మారకోపన్యాసం ఇచ్చారు. రోడ్ నావిగేషన్, వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్, రైల్వే భద్రతలో టెక్నాలజీ వినియోగం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ తదితర అంశాల్లో ఇస్రో ప్రవేశపెట్టిన సాంకేతికతను ఆయన పోలీస్ అధికారులకు వివరించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2 రాష్ట్రాల పోలీస్ విభాగాల సక్సెస్‌కు వ్యాస్ ఒక మార్గనిర్దేశకుడని అన్నారు. వ్యాస్ ఏర్పాటు చేసిన గ్రేహౌండ్స్ ఇప్పుడు దేశంలోనే అత్యంత కీలకమైన బలగంగా పేరు సంపాదించిందన్నారు. కార్యక్రమంలో వ్యాస్ సతీమణి అరుణా వ్యాస్ మాట్లాడుతూ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం వ్యాస్ బాగా కృషి చేశారని, పోలీస్ శాఖ కోసం ప్రాణాలను అర్పించిన గొప్ప వ్యక్తని గుర్తుచేశారు.

స్వగృహ బోర్డు డైరెక్టర్ల మార్పు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్లలో ఇద్దరిని ప్రభుత్వం మార్చేసింది. గతేడాది రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు ఆగస్టులో ఏడుగురు డైరెక్టర్లతో బోర్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కానీ దానిని రిజిస్టర్ చేసే సమయంలో అక్కడి అథారిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిందని, బోర్డు సభ్యుల్లో ఇద్దరు ఐఏఎస్ అధికారుల నియామకాన్ని అంగీకరించలేదని తెలిసింది. 2003లో ఏర్పాటు చేసిన బోర్డులోనూ ఈ ఇద్దరు అధికారులు డైరెక్టర్లుగా ఉన్నారు. అప్పట్లో ఆ సంస్థ ఆడిట్ జరగలేదని, దీంతో ఆ ఇద్దరిని ఇప్పుడు డైరెక్టర్లుగా ఉండేందుకు అనుమతించబోమని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరి స్థానంలో మరో ఇద్దరిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఉండే ఈ బోర్డులో.. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గృహనిర్మాణ సంస్థ ఎండీ, పురపాలక శాఖ కార్యదర్శి, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ, తెలంగాణ గృహనిర్మాణ మండలి కమిషనర్ డైరెక్టర్లుగా ఉన్నారు.

మావోయిస్టుల కాల్పులు అమానుషం

గిరిజన యువకుడిపై కాల్పులను ఖండించిన తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలానికి చెందిన ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి రమేశ్‌పై శుక్రవారం మావోయిస్టులు జరిపిన హత్యాయత్నాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండించింది. ప్రజల తరపున నిలబడి, ఉద్యమాలు చేస్తున్న గిరిజన నాయకుడిపై కాల్పులు జరపడం అమానుషమని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కాల్పులను సమర్థించుకోడానికి ఇన్‌ఫార్మర్ ముద్ర వేస్తున్నారని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జనగామ మార్కెట్ యార్డులో కందులు సీజ్

సాక్షి, హైదరాబాద్: జనగామ మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రంలో అక్రమంగా తెచ్చి అమ్ముతున్న కందుల బస్తాలను అధికారులు సీజ్ చేశారు. రైతుల పేరిట కందులను విక్రయించడానికి ప్రయత్నించింది జనగామకు చెందిన శ్రీ సంతోషిణి ట్రేడర్స్ అధికారులు గుర్తించారు. వ్యాపారస్తులు ఎవరైనా రైతుల పేరిట కందుల కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి ప్రయత్నిస్తే వారి లైసెన్సు రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

హమ్మింగ్‌బర్డ్ ఒలింపియాడ్‌లో రవీంద్రభారతి హవా

సాక్షి, హైదరాబాద్: హమ్మింగ్‌బర్డ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మక హమ్మింగ్‌బర్డ్ ఒలింపియాడ్ పరీక్షలో రవీంద్రభారతి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మొదటిదశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు 99 మంది బంగారు పతకాలు, 49 మంది వెండి, 30 మంది కాంస్య పతకాలు సాధించారని రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. మొత్తంగా తమ సంస్థకు చెందిన 171 మంది విద్యార్థులు రెండవ దశకు అర్హత సాధించారని పేర్కొన్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వివిధ కేటగిరీల్లో ఈ పరీక్షను నిర్వహించారని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు తిరుగులేని విజయాలు సాధించారని తెలిపారు.

రాజ్యాంగ విలువలతో లౌకికవాద పరిరక్షణ

లౌకికవాదంపై దాడులు జరుగుతున్నాయి

- సెక్యులరిజాన్ని కాపాడేందుకు రాజ్యాంగమే ఆయుధం
- 'మైనారిటీ' అనే పదాన్ని విస్తృత పరిధిలో చూడాలి
- లిటరరీ ఫెస్టివల్‌లో సీనియర్ జర్నలిస్ట్ సీమా ముస్తఫా

సాక్షి, హైదరాబాద్: అనేక రకాల దాడుల నుంచి సెక్యులరిజాన్ని కాపాడుకునేందుకు రాజ్యాంగమే గొప్ప ఆయుధమని, రాజ్యాంగం ప్రసాదించిన అత్యున్నతమైన విలువల వెలుగులలో లౌకికవాదాన్ని పరిరక్షించుకోవాలని సీనియర్ జర్నలిస్టు సీమా ముస్తఫా పిలుపునిచ్చారు. సెక్యులరిజానికి విఘాతం కలిగించే చర్యలను నియంత్రించకపోవడం వల్ల రోజురోజుకూ తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 'బీయింగ్ ఏ సెక్యులర్ ముస్లిం ఇన్ ఇండియా'అనే అంశంపై ఆమె ప్రసంగించారు. అషార్‌ఫరాన్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గాంధీ, నెహ్రూ కాలం నాటి సెక్యులరిజాన్ని ఇప్పుడు చూడలేమని, ఆనాటి లౌకికవాద విలువలు ఇప్పుడు ఏ మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "వరుసగా జరుగుతున్న దాడులతో సెక్యులరిజానికి తూట్లు పడుతున్నాయి. దీంతో రాజ్యాంగ లక్ష్యం అమలుకు నోచడం లేదు. ప్రభుత్వాలు కూడా ఎలాంటి నష్టనివారణ చర్యలు చేపట్టడం లేదు. ఇది మన సెక్యులర్ వ్యవస్థకే ప్రమాదకరం''అని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ వర్గాల్లో రోజురోజుకూ అసహనం పెరుగుతోందని, దీనివల్ల దాడులు, హింస చెలరేగుతున్నాయన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు పరమత సహనం, లౌకిక భావాలపై అవగాహన కల్పిస్తే భావితరాల్లో సెక్యులరిజం అభివృద్ధి చెందుతుందన్నారు.

వేర్పాటువాదం, మతం ఒకటి కాదు..

ప్రపంచంలో ఎక్కడ హింస చోటుచేసుకున్నా, దాడులు జరిగినా ఇక్కడ ముస్లింల పట్ల అసహనాన్ని ప్రదర్శించడం సరైంది కాదన్నారు. భారతీయ ముస్లింలు ఈ దేశ సంస్కృతిలో ఒక భాగమని అర్థం చేసుకోవాలన్నారు. 'మైనారిటీ'భావనను ఏ ఒక్క దేశానికి, రాష్ట్రానికి పరిమితమైన అర్థంలో కాకుండా విస్తృత పరిధిలో చూడాలని, మొత్తం ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని మైనారిటీ భావనను పునర్నిర్వచించాలని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో తలెత్తే వేర్పాటువాద ఆందోళనలకు ముస్లిం మతానికి ఎలాంటి సంబంధం లేదని, రెండూ ఒకటి కాదని చెప్పారు. రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ విలువల పట్ల స్పష్టమైన అవగాహన ఉంటే ఇలాంటి అనేక విషయాలు స్పష్టంగా బోధపడతాయన్నారు. జర్నలిస్టులు తమ విధి నిర్వహణలో సొంత అభిప్రాయాలకు తావు లేకుండా వాస్తవాలను యథాతథంగా రిపోర్ట్ చేయాలన్నారు.



సీమా ముస్తఫా

'పద్మావత్' మూవ్‌మెంట్‌లో ఉన్నాం..

కొన్ని రకాల అసహన భావాలను చూస్తోంటే ఎంతో విస్మయం కలుగుతోందని, చరిత్రను ఉన్నదున్నట్లుగా స్వీకరించేందుకు కూడా కొన్ని వర్గాలు సిద్ధంగా లేవని నల్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కన్నబీరన్ అన్నారు. ఇప్పుడు మనమంతా 'పద్మావత్'సినిమా మూవ్‌మెంట్‌లో ఉన్నామని, పద్మావతి అనే మహిళ పేరును 'పద్మావత్'గా మార్చి చెప్పుకునే దుస్థితిలో ఉన్నామన్నారు. 'ది పబ్లిక్ వాయిస్ ఆఫ్ వుమెన్'అనే అంశంపై కొలంబియా రచయిత్రి లారా రెస్ట్రెపో, సీమా ముస్తఫా పాల్గొన్నారు. కొలంబియాలో ఇప్పటికీ మహిళలు అనేక రకాలుగా హింసకు గురవుతున్నారని లారా ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ భావప్రకటన స్వేచ్ఛను అనుభవించలేకపోతున్నారని, ఇందుకు రాజకీయాల్లో, సమాజంలో వ్యవస్థీకృత పురుషాధిపత్యమే కారణమని సీమా ముస్తఫా అన్నారు. మరోవైపు 'ది జర్నీ ఆఫ్ కాటన్ ఇండియా'అనే అంశంపై జరిగిన చర్చలో మీనా మీనన్, ఉజ్రమ్మ పాల్గొన్నారు. బీటీ కాటన్‌బారి నుంచి దేశ రైతాంగాన్ని కాపాడాలని, మన దేశ అవసరాలకు అనుగుణమైన స్వదేశీ విధానాన్ని అమలు చేయాలని ఉజ్రమ్మ కోరారు. 'ది జునూన్ ఆఫ్ ది కెండల్స్ అండ్ కపూర్స్'అనే అంశంపై శశికపూర్ కూతురు సంజనా కపూర్ మాట్లాడారు. తమ తండ్రి కుటుంబం నుంచి, అమ్మ కుటుంబం నుంచి నాటక రంగానికి జరిగిన కృషిని గురించి వివరించారు. రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా గిరీష్ కాసరవల్లి దర్శకత్వంలో వెలువడిన 'గులాబీ టాకీస్'సినిమా ప్రదర్శించారు. ముంబైకి చెందిన చింటూసింగ్ కళాకారుల బృందం ప్రదర్శించిన బాంబే బైరాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ భాషల్లో సాగిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది.

మిలటరీ హీరోస్‌కు సెల్యూట్

దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ శత్రువుతో వీరోచితంగా పోరాడే ఎందరో సైనికులు తమ సొంత జీవితాలను త్యాగం చేశారని, వారి త్యాగాలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ జర్నలిస్టులు శివ్‌అరూర్, రాహుల్ సింగ్ అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్‌తో పాటు, ఇటీవల జరిగిన పలు ఘటనల్లో ప్రాణాలను కోల్పోయిన 14 మంది వీరుల గాథలను వివరిస్తూ వారు రాసిన 'ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలటరీ హీరోస్'పుస్తకంపై నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. సరిహద్దుల్లో సైనికులతో గడిపిన అనుభవాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు చెప్పారు.

డబ్బింగ్ సినిమాలతో తీవ్ర నష్టం..

'లిటరేచర్ అండ్ ఫిల్మ్'అనే అంశంపై నిర్వహించిన చర్చలో ప్రముఖ కన్నడ డైరెక్టర్ గిరీశ్ కాసరవల్లి మాట్లాడుతూ.. డబ్బింగ్ సినిమాల వల్ల సినీపరిశ్రమ తీవ్ర నష్టాలను చవిచూస్తోందన్నారు. డబ్బింగ్ సినిమాల్లో ఏ మాత్రం సృజనాత్మకత ఉండదని, దీనివల్ల ఆయా భాషల్లో సినిమాలు తీసేందుకు అవసరమైన 70 విభాగాలు నష్టపోతాయన్నారు. మరోవైపు ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన ప్రజలు ఇప్పటికీ కనీస అవసరాలకు నోచుకోవడం లేదని, ప్రభుత్వ సేవలను కూడా వినియోగించుకోలేకపోతున్నారని ప్రముఖ సామాజిక కార్యకర్త ఆదిరాజు పార్థసారథి అన్నారు. ఈశాన్య రాష్ట్రాల స్థితిగతులపై నిర్వహించిన చర్చా కార్యక్రమానికి సీనియర్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య అధ్యక్షత వహించారు.




గిరీశ్ కాసరవల్లి

జీవజాతులపై పరిశోధనలు అవసరం

- నోబెల్ గ్రహీత మార్టిన్ షాలిఫీ
- కణజీవశాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: జీవశాస్త్రవేత్తల ప్రయోగాలు ఎలుకలు, బొద్దింకలు, ఈగలు వంటి నమూనా జంతువులకే పరిమితం చేయకుండా అన్ని రకాల జీవజాతులపై పరిశోధనలు జరపాలని నోబెల్ గ్రహీత మార్టిన్ షాలిఫీ సూచించారు. ఆవిష్కరణలు, పరిశోధనలు ఒక్కరివల్ల అయ్యేవి కావని, ఆయా రంగల్లో కృషి చేస్తున్న ఇతర శాస్త్రవేత్తల సహకారమూ అవసరమని తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'కణజీవశాస్త్ర అంతర్జాతీయ సదస్సు'కు ఆయన హాజరై మాట్లాడారు. గ్రీన్ ఫ్లోరోసెంట్ ప్రొటీన్ ఆవిష్కరణ ద్వారా జీవిలో చూడలేని జన్యుపరమైన చర్యలను ప్రత్యక్షంగా చూసేలా చేశామన్నారు. జన్యుశాస్త్రంలో మౌలిక పరిశోధనలు వేగం పుంజుకునేందుకు, హెచ్ఐవీ పరిశోధనల్లోనూ ఈ ఆవిష్కరణ కీలకంగా మారిందన్నారు. వీటితోపాటు మందుపాతరల గుర్తింపునకు, చీకట్లో వెలుగులు చిమ్మే పట్టుతయారీకి పనికొచ్చిందన్నారు. గొప్ప ఆవిష్కరణల్లో అనేకం యాదృచ్ఛికంగా జరిగినవేనన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మార్టిన్

ఘనంగా ప్రారంభమైన ఐసీసీబీ

కణజీవశాస్త్రంలో కృషి చేస్తున్న శాస్త్రవేత్తలందరినీ ఒకే వేదికపైకి చేర్చే లక్ష్యంగా తొలిసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ సెల్ బయాలజీ–2018 శనివారం ఘనంగా ప్రారంభమైంది. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ఆసియా పసిఫిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ సెల్ బయాలజిస్ట్, ఇండియన్ సొసైటీ ఫర్ సెల్ బయాలజిస్ట్ వంటి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 4 రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 1200 మంది జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు.

29 నుంచి వసతి గృహాల్లో రాత్రి నిద్ర

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వికలాంగుల సమస్యలు తెలుసుకునేందుకు సోమవారం (29న) నుంచి హాస్టల్ నిద్ర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి వెల్లడించారు. దీనిపై సీఎం కేసీఆర్‌కు నివేదిక అందిస్తానని చెప్పారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 15 వరకు పూర్వపు 10 జిల్లాల్లో పర్యటించనున్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇచ్చే ట్యూషన్ ఫీజు వికలాంగ విద్యార్థులకు కూడా వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ఎంతవరకు వికలాంగులకు చేరుతున్నాయో తెలుసుకోవడంతో పాటు, ఇంకా ప్రభుత్వం నుంచి ఏమేమి చేయాలో కూడా తెలుసుకుంటానని చెప్పారు. తెలంగాణలో 2011 జనాభా లెక్కల ప్రకారం 10.50 లక్షల మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. 1995 వికలాంగుల హక్కుల చట్టం, కొత్తగా వచ్చిన 2016 చట్టం ప్రకారం వికలాంగుల జనాభా 20 లక్షలు ఉంటుందన్నారు.

ఎగుమతులు తగ్గిపోయాయి

- కేంద్రం ప్రజా బడ్జెట్ రూపొందించాలి
- గిట్టుబాటు ధరకు చట్టం తేవాలి
- సీపీఎం నేత బీవీ రాఘవులు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటు తర్వాత రూ.15వేల కోట్ల ఎగుమతులు తగ్గిపోయాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు అన్నారు. జహీరాబాద్, జడ్చర్ల, దామరచర్లలో ఏర్పాటు చేయాలనుకున్న డ్రైపోర్టులను మంజూరు చేయించు కోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీపీఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది కేంద్రం ప్రజా బడ్జెట్‌ను రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాలు దేశాన్ని ఆర్థిక మాంద్యంలోకి నెట్టాయని, వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. దేశవ్యాప్తంగా రైతులు నష్టాల్లో ఉన్నారని వీరిని ఆదుకునేలా గిట్టుబాటు ధర కల్పించే చట్టం తేవాలని కోరారు. టీఆర్ఎస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు. చిత్రంలో తమ్మినేని

ప్రత్యామ్నాయం కోసమే: తమ్మినేని

కేంద్ర ప్రైవేటీకరణ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతోందని, రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న నష్టాన్ని కూడా ప్రశ్నించలేని దుస్థితిలో కేసీఆర్ ఉన్నారని తమ్మినేని విమర్శించారు. వచ్చేనెల 4 నుంచి 7 దాకా వరకు నల్గొండలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కోసమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పాటయ్యిందని, దీనిని బలోపేతం చేసే వ్యూహాలను ఈ సభల్లో చర్చిస్తామన్నారు. బీజేపీతో, మరోవైపు ఎంఐఎంతో దోస్తీ చేస్తూ సీఎం కేసీఆర్ ఓట్ల రాజకీయం చేస్తున్నారన్నారు.


సాక్షి
రాష్ట్రీయం
నల్లగొండ
ఆదివారం | జనవరి | 28 | 2018

భారత్‌లో పౌరపురస్కారాల్లో అత్యున్నతమైనది భారతరత్న కాగా.. ఆ తర్వాత పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలు ఉన్నతమైనవి.



నింగి.. నేల.. సాక్షిగా..





పెళ్లి అంగరంగ వైభవంగా చేసుకోవాలని చాలా మంది చాలా ప్రణాళికలే రచిస్తారు. భూదేవి అంత పీట.. ఆకాశమంత పందిరి వేసి.. ఇలా పెళ్లికి సంబంధించి ఎన్నో వర్ణనలు విన్నాం.. సినిమాల్లో కూడా చూశాం. పది మందికి పది కాలాల పాటు తమ పెళ్లి గుర్తుండిపోయేలా చేసుకోవాలని భావిస్తుంటారు. పెళ్లి పందిరి దగ్గరి నుంచి భోజనాలు.. బంధువులను ఆహ్వానించడం వరకు చాలా ప్రత్యేకతలు ఉండేలా ప్రయత్నిస్తుంటారు. అయితే వీటన్నింటికీ భిన్నంగా.. అసలు కనీవినీ ఎరుగని రీతిలో తమ పెళ్లి చేసుకోవాలని భావించింది ఆ జంట. దీంతో భూమిపై కాకుండా కాస్త ప్రత్యేకంగా పెళ్లి చేసుకోవాలని ఏకంగా భూమికి 400 అడుగుల ఎత్తులో తమ పెళ్లి చేసుకున్నారు. నింగీ.. నేలా సాక్షిగా రియాన్ జెంక్స్.. కింబర్లీ వెగ్లిన్ ఒక్కటయ్యారు. అమెరికాలోని ఉతా రాష్ట్రంలో ఉన్న ఎడారి ప్రాంతమైన మోబ్ వీరి పెళ్లికి వేదికైంది. వీరి మధ్య ప్రేమ కూడా ఇక్కడే చిగురించిందట. మీరు కూడా ఇలాంటి పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారా అయితే ఏర్పాట్లు చేసుకోండి.

నో పార్కింగ్!



అది కెనడాలోని ఓ నగరం.. అక్కడ భారీగా మంచు కురుస్తోంది. రోడ్లపై మంచు చాలా పేరుకుపోయింది. దీంతో మంచు తొలగించే ప్రాంతంలో కారును పార్క్ చేయడం నిషేధం. అయితే అదే చోట ఓ కారు పార్క్ చేసి ఉంది. దీంతో ఆ కారు దగ్గరికి ట్రాఫిక్ పోలీసులు హడావుడిగా వచ్చారు. ఓ పోలీసు అధికారి దాని దగ్గరికి వెళ్లి



కారుకు చలానా విధించాడు. ఆ పోలీసులకు కొద్ది సేపటికి కానీ తెలియలేదు అది నిజమైన కారు కాదని! అది మంచుతో తయారు చేసింది. రోడ్లపై మంచును తొలగించే సైమన్ లాప్రైజ్ అనే ఉద్యోగి సరదాగా మంచుతో కారును చెక్కాడు. టొయోటా సుప్రా కారు మాదిరిగా చెక్కేందుకు ప్రయత్నించాడు. కొంచెం అటూ ఇటుగా అలాగే వచ్చిందనుకోండి. అయితే కారుపై మంచు పేరుకుపోయిందేమో అనుకుని పొరబడ్డ ఆ పోలీసు కారుకు చలానా విధించాడు. పాపం నిజం తెలిశాక ముక్కుపై వేలు వేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. వీటిని చూసిన నెటిజన్లు నవ్వు ఆపుకోలేకపోతున్నారు!

బెగ్గింగ్ మాఫియాపై చర్యలు

ఎస్‌హెచ్‌ఆర్‌సీలో బాలల హక్కుల సంఘం పిటిషన్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో విజృంభిస్తున్న బెగ్గింగ్ మాఫియాపై శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై బాలల హక్కుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. పిల్లలను బిక్షగాళ్ల మాఫియా నుంచి రక్షించి పునరావాసం కల్పించాలని ఈ మేరకు రాష్ట్ర డీజీపీ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శనివారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(ఎస్‌హెచ్‌ఆర్‌సీ)లో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌ను ఆమోదించిన మానవ హక్కుల కమిషన్.. ఏప్రిల్ 11లోగా బెగ్గింగ్ మాఫియాపై తగిన చర్యలు చేపట్టి, నివేదిక ఇవ్వాలని డీజీపీకి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలిచ్చింది.

✦ కర్ణాటకలో భారీ బిందు సేద్యం ప్రాజెక్టు

ఇజ్రాయెల్ సంస్థ సహకారంతో నిర్మించిన 'మెగా'

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలోని భాగల్‌కోట్ జిల్లా రాంతాల్ మరోళాలో నిర్మించిన ఆసియాలోని అతిపెద్ద బిందు సేద్యం ప్రాజెక్టు ఆదివారం ప్రారంభం కానుంది. కృష్ణా భాగ్య జలనిగమ ఆధ్వర్యంలో రూ.381.5 కోట్ల వ్యయంతో మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నిర్మించిన ఈ ప్రాజెక్టుకు ఇజ్రాయెల్ సంస్థ నెటాఫిమ్ సాంకేతిక సహకారం అందించింది. భాగల్‌కోట్ జిల్లాలోని మరోళాలో రైతులకు తరచూ సాగునీటి కష్టాలుండేవి. ఆయకట్టు చివరి రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది. కృష్ణా ఆయకట్టు రైతాంగం కష్టాలను తీర్చాలనే ఆలోచనతో 'కృష్ణా భాగ్య జలనిగమ' ప్రాజెక్టును రూపొందించి మెగా సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ఆల్మట్టి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను బిందు సేద్యం పద్ధతిలో 12,300 హెక్టార్లకు మళ్లించేలా ప్రాజెక్టును రూపొందించారు. ప్రాజెక్టు కోసం భూమిచ్చేందుకు తొలుత కొందరు రైతులు నిరాకరించినా వారిని 'మెగా' ఒప్పించి పనులు ప్రారంభించింది. ప్రాజెక్టులో భాగంగా ప్రతి రైతు పొలంలో ఏర్పాటు చేసిన సిలిండర్ ద్వారా బిందు సేద్యం పద్ధతిలో నీటిని వినియోగించుకోవచ్చు. పంటకు వినియోగించే ఎరువులు, పురుగు మందులనూ ఈ సిలిండర్‌తో పిచికారీ చేసుకోవచ్చు.

✦ త్వరలో 24 క్యారెట్ మీటర్లు

బంగారం స్మగ్లింగ్ నియంత్రణ కోసం: కస్టమ్స్ కమిషనర్

సాక్షి, హైదరాబాద్: విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్ నియంత్రణకు త్వరలో ఎయిర్ కార్గోలో 24 క్యారెట్ మీటర్ పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్ జైన్ వెల్లడించారు. వివిధ దేశాల నుండి దిగుమతి అవుతున్న అన్ని వస్తువులపై నిఘా పటిష్టం చేస్తున్నామని చెప్పారు. 3 నెలల్లో సేవోత్తమ్ పథకాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. శనివారం అంతర్జాతీయ కస్టమ్స్ డే సందర్భంగా హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని పాప్సీలో సమావేశం ఏర్పాటు చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ తీవ్రవాదులు, నేరగాళ్లు దేశంలోకి నిషేధిత వస్తువులను రవాణా చేస్తున్నారని.. ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసేలా అక్రమ మార్గంలో గూడ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ కస్టమ్స్ రానున్న రోజుల్లో మరింత సమర్థంగా పని చేస్తుందని చెప్పారు. గతేడాది 116 కేసుల్లో విదేశీ కరెన్సీతో కలిపి 6.25 కోట్లు నగదు స్వాధీనం చేసుకుని 13 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దిగుమతులు, ఎగుమతులకు హైదరాబాద్ అనుకూల ప్రాంతమని కస్టమ్స్ చీఫ్ కమిషనర్ బెంకీ బెహరీ అగర్వాల్ అన్నారు.

✦ 'ఓలా' మోసాల నుంచి రక్షించండి

పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్ల యజమానులు

హైదరాబాద్: ఓలా క్యాబ్స్ మోసాల నుంచి రక్షించాలని కార్ల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్ల యజమానులతో సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతూ తీవ్ర అన్యాయం చేస్తోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఓలా క్యాబ్స్ కార్యాలయం వద్దకు చేరుకున్న కార్ల యజమానులు, బాధితులు సంస్థ ప్రతినిధులతో మాట్లాడేందుకు యత్నించగా అక్కడి బౌన్సర్లు వారిని అనుమతించలేదు. దీంతో ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓలా సంస్థ కిలోమీటరుకు రూ.17 ఇస్తామని, కస్టమర్ కారెక్కి దిగితే రూ.వంద ఇన్సెంటివ్ ఇస్తామని చెప్పి 3 నెలలు మాత్రమే ఇచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తర్వాత హామీలన్నింటినీ తుంగలో తొక్కి ప్రస్తుతం కి.మీ.కి రూ.ఐదు చెల్లిస్తూ అన్యాయం చేస్తోందన్నారు. 14 గంటలు డ్యూటీ చేసినా జేబులోంచి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని బాధితులు పేర్కొన్నారు. ఇప్పటికే 30కి పైగా కేసులు పెట్టినా పోలీసులు ఓలా క్యాబ్స్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని బాధితుడు షేక్ సాజిద్ ఆవేదన వ్యక్తం చేశారు.

✦ బౌలింగ్ చేస్తూ మృత్యు ఒడిలోకి

ఛాతీలో నొప్పితో కుప్పకూలిన యువకుడు

హైదరాబాద్: క్రికెట్ ఆడుతూ ఓ యువకుడు హఠాన్మరణం చెందాడు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నం.10లోని జహీరానగర్ ఖాళీ మైదానంలో రెండురోజులుగా బంగారు తెలంగాణ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డే అండ్ నైట్ క్రికెట్ టోర్నీ జరుగుతోంది. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని వెంకటేశ్వర నగర్‌కు చెందిన లాయిడ్ ఆంటోని (23) ఓ జట్టు తరఫున ఆడుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తుండగా ఛాతీలో నొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆంటోనిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన ఆంటోని ఓ హోటల్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. వచ్చే నెలలో దుబాయ్ వెళ్లాల్సిన తరుణంలో ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

✦ 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందేనని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్(టీఏయూసీటీఏ) స్పష్టం చేసింది. దీనిపై ప్రభుత్వం హామీ ఇచ్చి ఏడాది పూర్తవుతున్నా అమలు చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సంఘ అధ్యక్షుడు రామేశ్వరరావు తెలిపారు.

✦ బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలి

యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం తీర్మానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో సంఘం సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో సుమారు 5 వేలకు పైగా ఖాళీలున్నాయని సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో 25 ఏళ్లుగా బోధనేతర ఖాళీలను భర్తీ చేయనందున కొరత తీవ్రంగా ఉందన్నారు. బోధనా సిబ్బంది నియామకంతో పాటు బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు మంద వినోద్‌కుమార్, ఖదీర్‌ఖాన్, రుక్కయ్య, తహేర్ షరీఫ్, శంకర్ పాల్గొన్నారు.

కువైట్.. స్వదేశానికి రైట్ రైట్!

అక్రమ నివాసితులకు సదావకాశం కల్పించిన గల్ఫ్ దేశం

- ఎలాంటి జరిమానా లేకుండా దేశం విడిచి వెళ్లొచ్చు..
- లేదా జరిమానా కట్టి వీసా గడువు పొడిగించుకోవచ్చు
- తాజాగా డిక్రీ జారీ చేసిన అక్కడి ప్రభుత్వం
- ఫిబ్రవరి 22 వరకు అమల్లో ఉత్తర్వులు
- అక్రమంగా నివసిస్తున్న 30 వేల మందికిపైగా తెలుగు వారు!
- అవకాశాన్ని వినియోగించుకోండి..: రాష్ట్ర ప్రభుత్వం
- తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖను సంప్రదించాలని సూచన



సాక్షి, హైదరాబాద్: కువైట్‌లోని అక్రమ నివాసితుల కోసం అక్కడి ప్రభుత్వం సరికొత్త అవకాశం కల్పించింది. ఎలాంటి జరిమానాలు లేకుండా దేశం విడిచి వెళ్లడం లేదా జరిమానా చెల్లించి వీసా గడువు పొడిగించుకునే వెసులుబాటునిచ్చింది. ఈ మేరకు ఆ దేశ హోం శాఖ అమ్నెస్టీ డిక్రీ 64/2018ని జనవరి 23న విడుదల చేసింది. ఇది జనవరి 29 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. ఈ డిక్రీ ఆధారంగా అక్కడ అక్రమంగా నివసిస్తున్న వారు సురక్షితంగా దేశం విడిచి వెళ్లొచ్చు. ఇందుకు సంబంధించిన సమాచారం రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. కువైట్ ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని అక్కడ ఉంటున్న భారతీయులు ఉపయోగించుకోవచ్చు. జరిమానా కట్టి తమ నివాసాన్ని చట్టబద్ధం చేసుకోవడమో లేదా తిరిగి స్వదేశం రావడమో చేయొచ్చు. ఇందుకోసం భారత రాయబార కార్యాలయం లేదా తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంలోని ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖను సంప్రదించవచ్చని తెలంగాణ ప్రభుత్వ ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు చూసే ఓ అధికారి మీడియాకు తెలిపారు.

అవకాశాన్ని వినియోగించుకోండి

కువైట్‌లో చిక్కుకుపోయిన విదేశీయులు ఆ దేశం ప్రకటించిన క్షమాభిక్షను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. వేర్వేరు కారణాలతో చట్ట వ్యతిరేకంగా అక్కడ ఉంటున్న విదేశీయులకు ఎలాంటి శిక్ష, జరిమానా లేకుండా తిరిగి స్వదేశానికి వెళ్లే అవకాశం కల్పించిందని పేర్కొంది.

జరిమానా లేకుండానే..

- కువైట్‌లో అక్రమ నివాసితులు, వీసా ముగిశాక ఉంటున్న వారు ఎలాంటి అనుమతి, జరిమానా లేకుండా దేశం విడిచిపెట్టి వెళ్లవచ్చు. ఇలాంటి వారు మళ్లీ సరైన పత్రాలతో, అన్ని అనుమతులతో తిరిగి కువైట్‌కు వెళ్లొచ్చు. అక్రమ నివాసితులు, వీసా ముగిశాక ఉంటున్న వారు కావాలనుకుంటే తగిన జరిమానా చెల్లించి వీసా పొడిగించుకుని అక్కడే ఉండిపోవచ్చు.
- రెసిడెన్సీ నిబంధనలు ఉల్లంఘించి నిషేధానికి గురైన వారు, కోర్టు కేసులున్న వారు ఇప్పుడు రెసిడెన్సీ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌తో మాట్లాడి తమకు వీసా వచ్చే అవకాశం ఉందేమో చర్చించుకోవాల్సి ఉంటుంది.
- క్షమాభిక్ష కాలం ముగిశాక మాత్రం ఈ ఉత్తర్వులు చెల్లవు. క్షమాభిక్ష సమయంలో దొరికిన వారిని వెంటనే ఆయా దేశాలకు తరలిస్తారు. ఈ సమయంలో దేశం విడిచి పెట్టని వారిపై జరిమానా విధిస్తారు. వారికి వీసా ఇవ్వకుండా, స్వదేశం పంపించేస్తారు. వారు తిరిగి కువైట్ రాకుండా నిషేధిస్తారు.



22 ఏళ్లుగా కువైట్‌లో ఉంటున్నా. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి చిన్న తప్పులతోనే జైలు పాలైన వారు, పాస్‌పోర్టు కాలపరిమితి ముగిసిన వారు, అక్రమ నివాసితులు దాదాపు 30 వేల మంది కువైట్‌లో ఉంటున్నారు. ఇప్పుడు వీరు డబ్బులుంటే స్వదేశానికి తిరిగి వెళ్లవచ్చు. కొందరికి ఎంబసీ, స్వచ్ఛంద సంస్థలు స్వదేశానికి వెళ్లడానికి టికెట్ ఖర్చులు ఇస్తాయి. ఏడేళ్లుగా కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష ఇవ్వలేదు. వీసాతోపాటు ఇక్కడ పని చేసేందుకు ఇచ్చే అనుమతిని 'అకామా'అంటారు. అది కచ్చితంగా ఉండాలి. మేం ఇప్పటికే దీని గురించి ప్రచారం ప్రారంభించాం. ఇలాంటి నిబంధన వచ్చిందని చాలా మందికి తెలియదు. దీని గురించి అందరికీ చెప్పాలి.

అందరికీ తెలియాలి

–కొల్లాబత్తుల రాజు, కువైట్‌లో ఉంటున్న తెలంగాణవాసి

నిబంధనలు తెలీక జైలుపాలు

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం తెలుగు రాష్ట్రాల్లో సర్వసాధారణం. అక్కడ ఇళ్లల్లో సహాయకులుగా, కంపెనీల్లో కార్మికులుగా, పశువుల కాపర్లుగా, నిర్మాణ రంగంలో పని చేసేందుకు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. అయితే సరైన వీసా లేక, యాజమాన్యంతో విబేధాలొచ్చి బయటకు వచ్చే వాళ్లూ ఎక్కువే. కువైట్ వెళ్లే వారికి వివిధ పనుల కోసం భిన్నరకాల వీసాలు ఇస్తుంటారు. వాటిని కాదని వేరే పనులకు వెళ్లకూడదు. ఇంట్లో సహాయకులుగా పని చేయడానికి వెళ్లిన వారు.. వేరే పనిలో చేరేందుకు వీలు లేదు. చాలా మందికి దీనిపై అవగాహన లేక పొరపాట్లు చేస్తుంటారు. తెలిసో తెలియకో వీసా నిబంధనలు ఉల్లంఘిస్తారు. కొందరి విషయంలో యాజమాన్యాలు పాస్‌పోర్టు, వీసా తమ దగ్గర ఉంచేసుకుని తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నాయి. పాస్‌పోర్టు, వీసా పరిమితి ముగియడం మరో సమస్య. చట్ట వ్యతిరేకంగా ఉంటున్న వారు, చిన్న తప్పులకు జైలు పాలైన వారికి రంజాన్ నెలలో కువైట్ క్షమాభిక్ష పెడుతుంది. కానీ కొన్నేళ్లుగా క్షమాభిక్ష ప్రకటించడం లేదు. దీంతో భారీగా అక్రమ వలసదారులు అక్కడి జైళ్లలో మగ్గిపోతున్నారు.

కాళేశ్వరం భేష్!

- కాళేశ్వరం, మిషన్ కాకతీయ ప్రాజెక్టులకు అంతర్జాతీయ ప్రశంసలు
- విదేశీ ప్రతినిధులకు ప్రజెంటేషన్ ఇచ్చిన స్పెషల్ సీఎస్ జోషి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేపడుతున్న మిషన్ కాకతీయ, కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి అంతర్జాతీయ ప్రశంసలు దక్కాయి. కోటి ఎకరాల సాగు దిశలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, చేపట్టిన పథకాలపై 19 దేశాల ప్రతినిధులు నీటిపారుదల శాఖను అభినందనలతో ముంచెత్తారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టును తక్కువ సమయంలో పూర్తి చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఇథియోపియా, శ్రీలంక, నేపాల్, భూటాన్, బ్రూనై, అల్జీరియా, మాల్దీవులు, మారిషస్ వంటి 19 దేశాలకు చెందిన ప్రతినిధులు 4 వారాల పర్యటన నిమిత్తం శనివారం హైదరాబాద్ చేరుకున్నారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కి) విదేశీ ప్రతినిధుల పర్యటనను సమన్వయపరచగా, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎస్.కె.జోషి శనివారం ఇక్కడ జలసౌధలో వారికి సాగునీటి రంగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడకముందు 80 వేల చిన్న నీటి వనరులుండగా, అర్బనైజేషన్ కారణంగా సగం కనుమరుగయ్యాయని జోషి చెప్పారు. గొలుసుకట్టు చెరువులతోపాటు మొత్తం చిన్న నీటి వనరులను పరిరక్షించేందుకు, వాటి పునరుద్ధరణకు మిషన్ కాకతీయ కార్యక్రమానికి సీఎం రూపకల్పన చేశారని, దీని ద్వారా 46 వేల చెరువులను దశలవారీగా పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. కాకతీయతో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని, తెలంగాణ గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితిగతులలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయని చెప్పారు. ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు ఈ పథకం విజయవంతానికి ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని, నిరంతర పర్యవేక్షణ కారణంగా సానుకూల ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చెరువు మీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతుతోపాటు, ఆ చెరువును నమ్ముకున్న రజక, బెస్త, ముదిరాజులకు జీవన భృతి దొరుకుతోందని వివరించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇరిగేషన్ రంగంలో సాధించిన ప్రగతి అద్భుతమని విదేశీ ప్రతినిధులు కొనియాడారు. తెలంగాణ ప్రజలు, రైతుల జీవితాన్ని మార్చబోతున్న కాళేశ్వరం ప్రాజెక్టు గురించి విదేశీ ప్రతినిధులకు జోషి వివరించినప్పుడు ఆయా ప్రతినిధులు విస్తుబోయారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వాడుతున్న అత్యాధునిక సాంకేతిక విధానాలను తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వివిధ దేశాల ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కాడా కమిషనర్ డాక్టర్ మల్సూర్, మైనర్ ఇరిగేషన్ సీఈలు సురేశ్, శ్యాంసుందర్, అస్కి ప్రోగ్రాం డైరెక్టర్లు డాక్టర్ పి.సుభాషిణి, రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

'ఖాతా'కు కంప్యూటర్ 'చెక్'!

భూ క్రయ, విక్రయ లావాదేవీలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

- ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చిన 'మార్పుల రిజిస్టర్'
- పట్టాదారు పేరు, పౌతి మార్పులు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సిందే
- ప్రస్తుతం మ్యాన్యువల్ విధానంలో నమోదుతో రికార్డుల్లో తేడా
- కొత్త విధానంతో డబుల్ ఖాతాల సమస్య తీరినట్టే

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ వ్యవస్థను వేధిస్తున్న కీలక సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. వ్యవసాయ భూములకు సంబంధించిన క్రయ, విక్రయ లావాదేవీలను మ్యాన్యువల్‌గా రికార్డు చేస్తుండడంతో ఏర్పడిన డబుల్ ఖాతాల సమస్యకు తెర దించుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. భూముల లావాదేవీల్లో అమ్మకందారు, కొనుగోలుదారు వివరాలతోపాటు పౌతి మార్పులను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసే 'మార్పుల రిజిస్టర్'ను శనివారం తీసుకొచ్చింది. జనవరి 1 నుంచి జరిగిన లావాదేవీలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించింది.

గతం.. అంతా గందరగోళం

వాస్తవానికి భూముల క్రయ, విక్రయ లావాదేవీల్లో జరిగే మార్పులను నమోదు చేసే వ్యవస్థ మొదటి నుంచీ ఉంది. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఆ లావాదేవీలను మ్యాన్యువల్‌గా నమోదు చేసేవారు. ఉదాహరణకు 'ఏ' అనే వ్యక్తి తన రెండెకరాల భూమిలో ఎకరం భూమిని 'బీ' అనే వ్యక్తికి అమ్మితే, ఎకరం భూమి కొన్న 'బీ' అనే వ్యక్తి పేరు మీద కొత్త ఖాతా తెరిచి ఆ ఎకరం భూమిని నమోదు చేసేవారు. కానీ 'ఏ' ఖాతాలో ఉన్న రెండెకరాల నుంచి ఎకరం భూమిని తొలగించే వారు కాదు. దీంతో అదే సర్వే నంబర్‌లోని భూమి ఇద్దరు రైతుల ఖాతాల్లో నమోదయ్యేది. 'ఏ' పేరిట రెండెకరాలు, 'బీ' పేరిట మరో ఎకరం రికార్డయ్యేది. దీంతో ఆ సర్వే నంబర్‌లో ఉండాల్సిన భూమి కన్నా ఎక్కువ రికార్డయ్యేది. ఎవరైనా పట్టాదారు చనిపోయిన పక్షంలో వారసుల పేరిట భూమి మ్యుటేషన్ చేసినప్పుడు ఇదే పరిస్థితి కొనసాగేది. చనిపోయిన వ్యక్తి ఖాతాలను అలానే ఉంచి, వారసుని పేరిట మరో ఖాతా తెరిచి భూమిని నమోదు చేసేవారు. లేదంటే చనిపోయిన వ్యక్తి పేరిట ఆ ఖాతాను అలాగే కొనసాగించేవారు. వారసుడి పేరిట (పౌతి) మార్పు చేసేవారు కాదు. ఈ నేపథ్యంలో భూ రికార్డుల ప్రక్షాళనలో కుప్పలు తెప్పలుగా ఈ సమస్యలు వచ్చాయి. లక్షల సంఖ్యలో వచ్చిన ఈ డబుల్ ఖాతాలు, పౌతి సమస్యలు చూసి రెవెన్యూ యంత్రాంగమే విస్తుపోవాల్సి వచ్చింది. ఇలాంటి సమస్యలు 10 లక్షల వరకు నమోదయ్యాయని ప్రక్షాళన గణాంకాలు చెపుతున్నాయి. ప్రక్షాళనలో ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించినా భవిష్యత్తు లావాదేవీలు మ్యాన్యువల్‌గా ఉంటే ఇబ్బంది అవుతుందనే ఆలోచ నతో ప్రభుత్వం ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి కావడంతో ఈ ఏడాది జనవరి 1 నుంచి జరిగే క్రయ, విక్రయ లావాదేవీలన్నింటినీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న 'మార్పుల రిజిస్టర్'లో నమోదు చేయాలని ఆదేశించింది.


ఖాతా తొలగింపు.. పేరు మార్పు

ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న విధానం ద్వారా ప్రత్యేక నమూనాలో ఆన్‌లైన్ రిజిస్టర్‌ను తయారు చేశారు. అందులో భూమి రిజిస్ట్రేషన్ నంబర్, తేదీ తోపాటు అమ్మేవారి పేరు, తండ్రి/భర్త పేరు, కొనేవారి పేరు, తండ్రి/భర్త పేరు, లావాదేవీ స్వభావం, సర్వే, ఖాతా నంబర్లు, విస్తీర్ణం, మార్పు చేసిన రికార్డు నంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది. అదే పౌతి విషయంలో చనిపోయిన పట్టాదారు పేరు, తేదీ, వారసుల పేరును మార్పు చేస్తారు. దీంతో ఫలానా ఖాతాలో ఈ ఆన్‌లైన్ రిజిస్టర్‌లో మార్పులు జరిగితే దానంతట అదే ఖాతా మారిపోనుంది. దీంతో డబుల్ ఖాతాల సమస్యకు తెరపడనుంది. వారసుల పేరిట పట్టాల మార్పు సులభతరం కానుంది.

హైటెక్ నంబర్ ప్లేట్ ఉండాల్సిందే..

లేకుంటే ఫిబ్రవరి 1 నుంచి ఆర్టీఏ సేవలు బంద్

- 2013 డిసెంబర్ తర్వాత నమోదైన వాటికే...
- 10 వేల వాహనాలకు 'హైటెక్' పెండింగ్



సాక్షి, హైదరాబాద్: హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) లేకుండా తిరిగే వాహనాలపై కొరడా ఝుళిపించేందుకు రవాణా శాఖ సన్నద్ధమైంది. ఆర్టీఏలో కొత్తగా వాహనం నమోదైనప్పటికీ చాలామంది వాహనదారులు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లకు బదులు సాధారణ నంబర్ ప్లేట్లనే వినియోగిస్తున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల వాహనాల హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో 2013 డిసెంబర్ తర్వాత రిజిస్టర్ అయిన వాహనాలు తప్పకుండా హైటెక్ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని.. లేకుంటే ఆయా వాహనాలకు సేవలన్నింటినీ నిలిపివేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. శనివారం రవాణా కమిషనర్ ప్రధాన కార్యాలయంలో సంయుక్త రవాణా కమిషనర్ పాండురంగ్ నాయక్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచే ఇది అమల్లోకి రానుంది. దీంతో హైటెక్ నంబర్ ప్లేట్లు లేని వాహనాల యాజమాన్య బదిలీ, చిరునామా బదిలీ, హైపతికేషన్, పన్ను చెల్లింపులు, పర్మిట్లు వంటి అన్ని రకాల పౌరసేవలు నిలిచిపోనున్నాయి.

2013లో అమల్లోకి..

వాహనాల భద్రత దృష్ట్యా సుప్రీంకోర్టు హెచ్‌ఎస్‌ఆర్‌పీని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 2013 డిసెంబర్‌లో ఉమ్మడి రాష్ట్రంలో ఇది అమల్లోకి వచ్చింది. అప్పట్లో రవాణా కార్యాలయంలో నమోదైన ప్రతి వాహనం విధిగా హెచ్‌ఎస్‌ఆర్‌పీ బిగించుకోవాలని నిబంధన విధించారు. అయితే హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్ల కొరత వల్ల ఈ నిబంధన సరిగా అమలు కాలేదు. దీంతో ఈ స్కీమ్‌ను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రవాణా శాఖ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త విధానం మేరకు వాహనం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారం, పది రోజుల్లో హెచ్‌ఎస్‌ఆర్‌పీ బిగించుకోవాలి. అలా ఉన్న వాటికే అన్నిరకాల పౌరసేవలు వర్తిస్తాయి. లేకుంటే బ్యాంకు రుణాలపై కొనుగోలు చేసిన వాహనాల హైపతికేషన్ రద్దు, రవాణా రంగానికి చెందిన వాహనాలకు ప్రతి సంవత్సరం ఇచ్చే పర్మిట్లు, త్రైమాసిక పన్ను చెల్లింపులు, వాహనం ఒక చోట నుంచి మరో చోటకు బదిలీ చేయడం, చిరునామా, యాజమాన్య బదిలీ వంటి సేవలు నిలిచిపోనున్నాయి.

ఇక ఆదివారాలూ సేవలు

హెచ్‌ఎస్‌ఆర్‌పీ అమలులోని జాప్యాన్ని నివారించేందుకు ఇకనుంచి ఆదివారం కూడా నంబర్ ప్లేట్లను బిగించనున్నట్లు జేటీసీ పాండురంగ్ నాయక్ తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదుపాయం ఉంటుందన్నారు. హెచ్‌ఎస్‌ఆర్‌పీ ఏజెన్సీ నుంచి ఎస్సెమ్మెస్ అందుకున్న వాహనదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. మొదట ఖైరతాబాద్ ఆర్టీఏలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని, ఆ తరువాత హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చి దశలవారీగా రాష్ట్రమంతటా ఆదివారం సేవలను విస్తరిస్తామని ఆయన వివరించారు. హెచ్‌ఎస్‌ఆర్‌పీ నిబంధనను ఉల్లంఘించే వాహనాలపై భవిష్యత్తులో దాడులు చేసి కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో రీసెర్చ్ అసోసియేట్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్).. రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు దరఖాస్తులు కోరుతోంది. వేతనం: రూ.40,000. అర్హతలు: మేనేజ్‌మెంట్/ సోషల్ సైన్సెస్/స్టాటిస్టిక్స్‌లో పీజీ, పీహెచ్‌డీ. వయసు: 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఎంపిక: ఇంటర్వ్యూ. దరఖాస్తు విధానం: ఆన్‌లైన్. చివరి తేదీ: జనవరి 31, 2018.వెబ్‌సైట్: www.nird.org.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

జనరల్ ఎస్సే (సివిల్స్/గ్రూప్స్ ప్రత్యేకం)



భూ పరిశీలనకు ప్రాణం..

కార్టోశాట్

భారీ స్థాయిలో భూ ఉపరితల పటాలను రూపొందించే విజ్ఞానాన్ని కార్టోగ్రఫీ అంటారు. ఉపగ్రహ సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి రావడంతో కార్టోగ్రఫీ అనువర్తనాలు వేగంగా విస్తరించాయి. ఇంటర్నేషనల్ కార్టోగ్రఫిక్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రకారం భూ ఉపరితల పటాల తయారీ, అధ్యయన విజ్ఞానమే కార్టోగ్రఫీ. 1972లో అమెరికాకు చెందిన 'ల్యాండ్‌శాట్' అనే ఉపగ్రహం ద్వారా భూ ఉపరితల సమాచారం పటాల రూపంలో అందుబాటులోకి వచ్చింది. దాంతో కార్టోగ్రఫీ రంగంలో పెనుమార్పులు సంభవించాయి. సహజవనరుల సమాచార సేకరణ; భూ వినియోగ విధానం; పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాల్లో కార్టోగ్రఫీ అనువర్తనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

భారత్- కార్టోగ్రఫీ

అపార సహజ వనరులు కలిగిన భారత్ సైతం కార్టోగ్రఫీ అనువర్తనాల ఆవశ్యకతను గుర్తించింది. ఈ దిశగా కార్టోగ్రఫీ ఉపగ్రహాల అభివృద్ధి బాధ్యతను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు అప్పగించింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇస్రో కార్టోశాట్ (సిరీస్) ఉపగ్రహాలను అభివృద్ధి చేసి విజయవంతంగా ప్రయోగిస్తోంది. ఈ ప్రయోగాలను ఇండియన్ రిమోట్ సెన్సింగ్ వ్యవస్థ (ఐఆర్ఎస్)లో భాగంగా చేపడుతోంది.



- ఇప్పటి వరకు ఇస్రో 8 కార్టోశాట్ ఉపగ్రహాలను ప్రయోగించింది. కార్టోశాట్-1ను 2005, మే5న పీఎస్ఎల్‌వీ-సీ6 వాహకనౌక ద్వారా విజయవంతంగా రోదసిలోకి పంపింది. ఇస్రో ఈ ప్రయోగం ద్వారా 2.5 మీటర్ల రిజల్యూషన్ శక్తి గల కెమెరాలను ప్రయోగించింది. వీటి ద్వారా 618 కి.మీ. ఎత్తులోని ధ్రువ సూర్యానువర్తిత కక్ష్య నుంచి నేలపై ఉన్న చిన్న కారును సైతం చిత్రీకరించగలిగే సామర్థ్యాన్ని సాధించింది. అనంతరం 2007, జనవరి 10న పీఎస్ఎల్‌వీ-సీ7 వాహకనౌక ద్వారా కార్టోశాట్-2 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఇందులో అత్యాధునిక ప్యాన్ క్రొమాటిక్ కెమెరాను అమర్చారు. ఈ ప్రయోగం ద్వారా ఇస్రో 1 మీటరు రిజల్యూషన్ సామర్థ్యాన్ని సాధించింది. ఇదే క్రమంలో 2008లో కార్టోశాట్-2ఏ; 2010లో కార్టోశాట్-2బీ ఉపగ్రహాలను ప్రయోగించింది. 2016 జూన్- 2018 జనవరి మధ్యకాలంలో కార్టోగ్రఫీ అనువర్తనాలను దేశవ్యాప్తంగా విస్తరించే లక్ష్యంతో నాలుగు కార్టోశాట్-2 సిరీస్ (కార్టోశాట్- 2సీ, 2డీ, 2ఈ, 2ఎఫ్) ఉపగ్రహాలను రోదసిలోకి పంపింది. వీటిలో కార్టోశాట్-2సీ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ-సీ34 ద్వారా 2016, జూన్ 22న ప్రయోగించింది. దీన్నుంచి సేకరించిన ఛాయాచిత్రాలు.. గ్రామీణ, పట్టణ ప్రాంత అనువర్తనాలు; తీరప్రాంత నేల వినియోగ నియంత్రణ, రోడ్డు రవాణా వ్యవస్థ అభివృద్ధి; నీటి సరఫరా; నేల వినియోగ పటాల అభివృద్ధి; జీఐఎస్ అప్లికేషన్స్; ల్యాండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితర అంశాల్లో ఉపయోగపడుతున్నాయి. ఈ ఉపగ్రహంలో ప్యాన్ క్రొమాటిక్ కెమెరాను అమర్చారు.
- ఇస్రో 2017, ఫిబ్రవరి 15న పీఎస్ఎల్‌వీ-సీ37 ద్వారా కార్టోశాట్-2డీ; 2017, జూన్ 23న పీఎస్ఎల్‌వీ-సీ38 ద్వారా కార్టోశాట్-2ఈ ఉపగ్రహాలను ప్రయోగించింది. చివరిగా 2018, జనవరి 12న పీఎస్ఎల్‌వీ-సీ40 ద్వారా కార్టోశాట్-2ఎఫ్ ఉపగ్రహాన్ని ప్రయోగించింది.

కార్టోశాట్-2ఎఫ్ ఉపగ్రహం

- పీఎస్ఎల్‌వీ-సీ 40/కార్టోశాట్-2 సిరీస్ ఉపగ్రహ ప్రయోగం జరిగిన తేదీ: 2018, జనవరి 12.
- లాంచ్ మాస్: 710 కిలోలు.
- ప్రయోగ వాహక నౌక: పీఎస్ఎల్‌వీ-సీ 40.
- ఉపగ్రహ రకం: భూ పరిశీలన (Earth Observation)

కార్టోశాట్- ఉపయోగాలు

కార్టోగ్రఫీ ఉపగ్రహాల ద్వారా దేశ గ్రామీణ ప్రాంతాల్లో అనేక రకాల అనువర్తనాలు అందుబాటులోకి వచ్చాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు అనుసంధానాన్ని పెంచడంలో కార్టోశాట్ ఉపగ్రహాల ఛాయాచిత్రాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అంతేకాకుండా జలవనరుల సమగ్ర నిర్వహణ, నీటి కొరత ఉన్న ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే కార్యక్రమాల రూపకల్పనలో కేంద్ర, రాష్ట్ర జలవనరుల విభాగాలకు కార్టోశాట్ సమాచారం కీలకంగా మారింది.

- దేశవ్యాప్తంగా పట్టణ జనాభా పెరుగుతోంది. ఇలాంటి సమయంలో సమగ్ర పట్టణ ప్రణాళిక లోపిస్తే పట్టణాల సమస్యలు మరింత తీవ్రం అవుతాయి. ఇటీవల దేశంలోని ప్రధాన నగరాలైన ముంబై, చెన్నై, హైదరాబాద్ తీవ్ర వరద సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కార్టోశాట్ ఉపగ్రహాలు అందించే నేల వినియోగ పటాల సమాచారం చాలా కీలకంగా మారింది. ప్రస్తుత సమస్యలను పరిష్కరించడం; భవిష్యత్తులో ఇతర సమస్యలు తలెత్తకుండా పట్టణ ప్రణాళికలను రూపొందించడంలో కార్టోశాట్ ఉపగ్రహాల సమాచారం కీలకం. హైదరాబాద్ వంటి నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు కార్టోశాట్ ఉపగ్రహాలు పంపిన ఛాయాచిత్రాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.
- శీతోష్ణస్థితి మార్పు ప్రభావంతో తుఫాను ప్రమాదం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో దేశ తీరప్రాంత రక్షణపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఇస్రో కార్టోశాట్-2 సిరీస్ ఉపగ్రహాలను ప్రయోగించింది. ఇవి పంపించే ఛాయాచిత్రాల ఆధారంగా తీరప్రాంత మడ అడవుల అభివృద్ధి; ముంపునకు గురయ్యే ప్రాంతాల గుర్తింపు; తీరప్రాంత జీవవైవిధ్య సంరక్షణ; అక్రమ ఇసుక మైనింగ్‌ను అడ్డుకొనే కార్యక్రమాలను చేపట్టవచ్చు.

దేశ రక్షణలో కీలకంగా

- 2016 జూన్‌లో ఇస్రో ప్రయోగించిన కార్టోశాట్-2సీ పంపించిన అధిక రిజల్యూషన్ ఛాయాచిత్రాల సహకారంతో భారత సైనికులు 'లైన్ ఆఫ్ కంట్రోల్' అవతల సర్జికల్ స్ట్రయిక్స్‌ను విజయవంతంగా నిర్వహించారు. కార్టోశాట్-2సీ ద్వారా 0.65 మీటర్ల రిజల్యూషన్ సాధించడంతో ఇది సాధ్యమైంది. తద్వారా దేశ రక్షణలో కూడా కార్టోగ్రఫీ కీలకంగా వ్యవహరించినట్లయింది. ఇదే విధంగా భవిష్యత్తులో భారత తీరరేఖ వెంట గస్తీని పెంచే అవకాశం ఉంది. కార్టోశాట్-2సీ లక్షిత ప్రాంతాల వీడియోలను కూడా తీయగలదు.
- భూ వనరుల సమాచారాన్ని మరింతగా అందుబాటులోకి తెస్తే తప్పా.. సమగ్ర జీఐఎస్ అభివృద్ధి సాధ్యం కాదు. ఈ దిశగా కార్టోశాట్-2 సిరీస్ ఉపగ్రహాలను జీఐఎస్, ఎల్ఐఎస్ (ల్యాండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం) అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. దేశంలో జన సాంద్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సమర్థ నేల వినియోగం ద్వారా మాత్రమే సుస్థిరత సాధించగలం. దీన్ని దృష్టిలో పెట్టుకొని భారీ స్థాయిలో నేల వినియోగ పటాల రూపకల్పన, అధ్యయనం ఎంతైనా అవసరం. దేశంలో నిరుపయోగంగా ఉన్న భూములను క్రమంగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కార్టోగ్రఫీని మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉంది.
- దేశంలో ఇప్పటికీ చాలా గ్రామాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేదు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు కార్టోశాట్ ఉపగ్రహాలు అందించే భూ ఉపరితల సమాచారాన్ని వినియోగించుకోవాలి. ఈ సమాచారం ఆధారంగా నీటి లభ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి నీటి కొరత ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. నదుల అనుసంధాన కార్యక్రమంలో ప్రధాన ఇబ్బందిగా ఉన్న మధ్య భారత టోపోగ్రఫీపై కార్టోశాట్ ఉపగ్రహాలు స్పష్టమైన సమాచారం అందించాయి. ఈ ఛాయాచిత్రాలను క్షుణ్నంగా అధ్యయనం చేయడం ద్వారా నదుల అనుసంధానం కార్యక్రమాన్ని సరైన రీతిలో చేపట్టవచ్చు.

భవిష్యత్తు అంతా..

నేల సమర్థ వినియోగం, పట్టణాలను నివాసయోగ్యంగా మార్చడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదు పాయాల కల్పన తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కార్టోశాట్ ఉపగ్రహాల సమాచారం కీలకంగా మారనుంది. భారత్ ఒక సెం.మీ.లోపు/మి.మీ. రిజల్యూషన్ కార్టోగ్రఫీ ఉపగ్రహాలను అభివృద్ధి చేస్తే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.



సి. హరికృష్ణ
సీనియర్ ఫ్యాకల్టీ, హైదరాబాద్

టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎగ్జామ్ ఇన్ఫో

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)..114 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో) ఉద్యోగాల భర్తీకి ఇటీవల ప్రకటన విడుదల చేసింది. కామర్స్ నేపథ్యమున్న అభ్యర్థులు ఉన్నత కెరీర్‌ను అందుకునేందుకు ఈ నోటిఫికేషన్ వీలుకల్పిస్తోంది. ఈ నేపథ్యంలో అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ తదితరాలపై విశ్లేషణ..



- **ఉద్యోగం:** జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో)
- **ఖాళీల వివరాలు:** 114 (ఓపెన్-34, లోకల్-80); ఓసీ-54, బీసీఏ-8, బీసీబీ-11, బీసీసీ-2, బీసీడీ-7, బీసీ ఈ-4, ఎస్సీ-17, ఎస్టీ-7, పీహెచ్-4.

జేఏవోలో విజయానికి..

వ్యూహాలు

- **విద్యార్హత:** గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి బీకామ్ ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత/ఎంకామ్ ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత/సీఏ లేదా ఐసీడబ్ల్యూఏ ఇంటర్ పాస్.
- **వయసు:** 18-44 ఏళ్లు (జనవరి 1, 2018 నాటికి). ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్లు; పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పరీక్షలో ప్రతిభచూపిన వారి నుంచి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు.
- **రాత పరీక్ష అర్హత మార్కులు:** ఓసీ-40 శాతం; బీసీ-35 శాతం; ఎస్సీ/ఎస్టీ-30 శాతం; పీహెచ్-30 శాతం.

పరీక్ష విధానం

- ప్రశ్నపత్రంలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. సెక్షన్-ఏలో కోర్ సబ్జెక్టు నుంచి 80 ప్రశ్నలు, సెక్షన్-బీలో జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల వ్యవధిలో ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది.



ముఖ్య తేదీలు

- **ఫీజు:** ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.100 చెల్లించాలి. దీంతోపాటు రూ.120 ఎగ్జామ్ ఫీజు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్ అభ్యర్థులకు ఎగ్జామ్ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.
- **ఫీజు చెల్లింపు ప్రారంభం:** ఫిబ్రవరి 1, 2018.
- **దరఖాస్తు ప్రారంభం:** ఫిబ్రవరి 2, 2018.
- **ఆన్‌లైన్లో ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018.
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** మార్చి 15, 2018.
- **పరీక్ష తేదీ:** మార్చి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.tssouthernpower.com

సిలబస్

సెక్షన్-ఏ (80 మా.)

- అకౌంటెన్సీ, అడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీ విభాగం నుంచి 35 ప్రశ్నలు ఉంటాయి. అదే విధంగా కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ నుంచి 25 ప్రశ్నలు, ఆడిటింగ్ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి.
- **అకౌంటెన్సీ, అడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీ:** బేసిక్ కాన్సెప్ట్‌ మొదలు ఫైనాన్షియల్ అకౌంట్స్ తయారీ వరకు అంశాలుంటాయి. బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, ప్రిపరేషన్ ఆఫ్ ట్రయల్ బేలన్స్, ఫైనల్ స్టేట్‌మెంట్స్ ఆఫ్ అకౌంట్స్, కన్‌సైన్‌మెంట్, జాయింట్ వెంచర్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- **కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్:** ఫండమెంటల్స్, మెటీరియల్స్, లేబర్ కాస్ట్స్ అండ్ ఓవర్‌హెడ్స్, మెథడ్స్ ఆఫ్ కాస్టింగ్, యూనిట్ లేదా అవుట్‌పుట్ కాస్టింగ్, మార్జినల్ కాస్టింగ్, బ్రేక్‌ఈవెన్ అనాలిసిస్, స్టాండర్డ్ కాస్టింగ్, వేరియన్స్ అనాలిసిస్, బడ్జెటరీ కంట్రోల్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ అనాలిసిస్ తదితర అంశాలుంటాయి.
- **ఆడిటింగ్:** ఫండమెంటల్స్, ఇంటర్నల్ చెక్ అండ్ కంట్రోల్, వోచింగ్ అండ్ వెరిఫికేషన్, ఆడిట్ ఆఫ్ కంపెనీస్, డివిజబుల్ ప్రాఫిట్స్, ఆడిటింగ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా.

సెక్షన్-బీ (20 మా.)

- అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ
- జనరల్ అవేర్‌నెస్
- ఇంగ్లిష్
- రీలేటెడ్ టు తెలంగాణ కల్చర్ అండ్ మూవ్‌మెంట్.
- కంప్యూటర్ నాలెడ్జ్.



సన్నద్ధత

- పరీక్ష సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించి, సంబంధిత మెటీరియల్‌ను సేకరించుకోవాలి. ప్రిపరేషన్‌కు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటలు కేటాయించాలి.
- తొలుత ప్రతి సబ్జెక్టుకు సంబంధించి బేసిక్ కాన్సెప్టులను క్షుణ్నంగా నేర్చుకోవాలి. తర్వాత వాటికి సంబంధించిన అప్లికేషన్స్‌పై దృష్టిసారించాలి.
- ప్రిపరేషన్ సమయంలో ముఖ్య అంశాలను ప్రత్యేకంగా ఓ నోట్స్‌లో పొందుపరచుకోవాలి. దీన్ని చివర్లో క్విక్ రివిజన్‌కు ఉపయోగించుకోవాలి.
- రోజు అన్ని సబ్జెక్టులను చదివేలా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఒక సబ్జెక్టు ప్రిపరేషన్ పూర్తయ్యాక దానికి సంబంధించిన సూత్రాలు, ఆబ్జెక్టివ్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడం తప్పనిసరి. విజయంలో ఈ ప్రాక్టీసే కీలకపాత్ర పోషిస్తుందన్న విషయాన్ని గుర్తించాలి.
- ప్రిపరేషన్ సమయంలో వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు ఫ్యాకల్టీ, స్నేహితుల సహాయంతో నివృత్తి చేసుకోవాలి.
- తెలంగాణ సంస్కృతి, ఉద్యమానికి సంబంధించిన ముఖ్య పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలి. సమకాలీన పరిణామాలను పత్రికలను చదవడం ద్వారా తెలుసుకోవాలి.
- చివర్లో రివిజన్‌కు కొన్ని రోజులను కేటాయించాలి. ఈ సమయంలో మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల మంచి ఫలితాలుంటాయి.

రిఫరెన్స్

- అడ్వాన్స్‌డ్ అకౌంట్స్: ఎం.సి.శుక్లా, టి.ఎస్.గ్రేవాల్, ఎస్.సి.గుప్తా.
- కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్: ఎస్.ఎన్.మహేశ్వరి; వి.కె.సక్సేనా, సి.డి.వశిష్ట్; సీఏ కాస్టింగ్ స్టడీ మెటీరియల్.
- దినపత్రికలు, తెలంగాణ ప్రభుత్వ అధికార వెబ్‌సైట్.

మోడల్ ప్రశ్నలు

1. From the following which is not a financial statement.
   1) Trial balance 2) Profit and Loss account
   3) Cash flow statement
   4) Balance sheet
   A: 1

2. Consignment account is..
   1) Real account
   2) Nominal account
   3) Trading account
   4) Present account
   A: 1



- డా. జి.రమణ
డైరెక్టర్, సాయిమేధ ఇన్‌స్టిట్యూషన్స్.

బులెటిన్ బోర్డ్

ఎన్ఐఓటీలో 21 ఖాళీలు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ).. 21 'ఫెలోషిప్' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)-6, సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-11, జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-4.
- **విభాగాలు:** ఓషనోగ్రఫీ, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెరైన్ జియోఫిజిక్స్, మెరైన్ జియాలజీ, లైఫ్ సైన్సెస్, ఫిజిక్స్, కెమికల్ సైన్సెస్, మెటియొరాలజీ.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ/బీఈ/బీటెక్/బీఫార్మా/ఎంఫార్మా. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, జర్నల్స్ ప్రచురణ, సంబంధిత రంగం ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు; ఎస్ఆర్ఎఫ్-32 ఏళ్లు; ఆర్ఏ-35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు పత్రం హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 9, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 16, 2018.
- **వెబ్‌సైట్:** www.niot.res.in

ఐఐఎస్‌టీలో 6 ఖాళీలు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. 6 ఫెలోషిప్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.


- **పోస్టు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-3, జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-1, సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో (ఎస్‌పీఎఫ్)-2.
- **ఫెలోషిప్:** ఎస్ఆర్ఎఫ్-రూ.28,000; జేఆర్ఎఫ్-రూ.25,000; ఎస్‌పీఎఫ్-రూ.22,000. **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ (కెమిస్ట్రీ/కెమిస్ట్రీ అనుబంధ). అలాగే నిబంధల మేరకు మార్కుల శాతం, ప్రత్యేక అంశాల్లో నైపుణ్యం తదితర అర్హతలుండాలి. **వయసు:** 2018, జనవరి 31 నాటికి 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 31, 2018. **వెబ్‌సైట్:** www.iist.ac.in

ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంఎస్సీ కోర్సులు

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (ఎఫ్ఆర్ఐడీయూ).. 2018కి గాను ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్సీ).
- **విభాగాలు-సీట్లు:** ఫారెస్ట్రీ- 38, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-38, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్-38, సెల్యులస్ అండ్ పేపర్ టెక్నాలజీ-20.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీ-45 శాతం) మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ (బోటనీ/కెమిస్ట్రీ/జియాలజీ/మ్యాథమెటిక్స్/ఫిజిక్స్/జువాలజీ/అగ్రికల్చర్/ఫారెస్ట్రీ/అప్లైడ్ సైన్సెస్/అప్లైడ్ సైన్సెస్/ఫిజిక్స్+కెమిస్ట్రీ+మ్యాథమెటిక్స్)/బీఈ/బీటెక్ (ఎన్విరాన్‌మెంట్ సైన్స్/కెమికల్/మెకానికల్). **ఎంపిక:** రాతపరీక్ష.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,200. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 6, 2018.
- **వెబ్‌సైట్:** www.fridu.edu.in

జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో 33 'ఫెలోషిప్' ఖాళీలు



కోల్‌కతాలోని జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ).. 33 'ఫెలోషిప్'ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ) III-1, రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ) I-6, జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-8, జూనియర్ రీసెర్చ్ అసోసియేట్ (జేఆర్ఏ)-6, ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ)-12. **వేతనం:** ఆర్ఏ III-రూ.40,000; ఆర్ఏ I-రూ.36,000; జేఆర్ఎఫ్, జేఆర్ఏ-రూ.16,000; ఎఫ్ఏ-రూ.12,000. **అర్హతలు:** ఆర్ఏ పోస్టులకు జువాలజీ/లైఫ్ సైన్సెస్/వైల్డ్ లైఫ్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/బయోడైవర్సిటీ అండ్ కన్జర్వేషన్/జియో ఇన్ఫర్మేటిక్స్/తత్సమాన విభాగంలో ఎంఎస్సీతోపాటు పీహెచ్‌డీ; జేఆర్ఎఫ్, జేఆర్ఏకు జువాలజీ/లైఫ్‌సైన్సెస్/ఏదైనా బయలాజికల్ సైన్స్ బ్రాంచ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఎంఎస్సీ; ఎఫ్ఏకు జువాలజీ తప్పనిసరి సబ్జెక్టుగా బీఎస్సీ. **వయసు:** ఆర్ఏ, ఎఫ్ఏ పోస్టులకు 40 ఏళ్లు, జేఆర్ఎఫ్, జేఆర్ఏకు 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.zsi.gov.in

ఐఐటీ హైదరాబాద్‌లో జేఆర్ఎఫ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్).. 2 జేఆర్ఎఫ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలో).
- **ఫెలోషిప్:** రూ.25,000. **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంటెక్ (బయోమెడికల్ ఇంజనీరింగ్/బయోటెక్నాలజీ/నానో టెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ ఎంఎస్ (ఫార్మా)/తత్సమాన బయోసైన్సెస్ డిగ్రీ. పీహెచ్‌డీ థీసిస్ సమర్పించిన వారూ అర్హులే.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ rmslab.iith@gmail.com ద్వారా. **చివరి తేదీ:** ఫిబ్రవరి 4, 2018.
- **వెబ్‌సైట్:** www.iith.ac.in

ఐఐఐటీ చిత్తూరులో జేఆర్ఎఫ్

చిత్తూరు జిల్లా శ్రీసిటీలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ).. జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **పోస్టు-ఖాళీలు:** జేఆర్ఎఫ్-1.
- **ఫెలోషిప్:** రూ.25,000.
- **అర్హతలు:** కంప్యూటర్ విజన్, ఇమేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌గా కంప్యూటర్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్‌లో ఎంఈ/ఎంటెక్/ఎంసీఏ.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ srdubey@iiits.in ద్వారా.
- **చివరి తేదీ:** జనవరి 30, 2018. **వెబ్‌సైట్:** www.iiits.ac.in

ఫారం – సి

ప్రకటన

(చట్టంలోని సెక్షన్–11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్ కార్యాలయము, యాదాద్రి భువనగిరి

గెజిట్ నెం. 137/18 — తేది : 03-01-2018
కలెక్టర్, యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. G1/1434/2017 — తేది : -08-2017
రాజస్వమండలాధికారి, భువనగిరి ఫైల్ నెం. B/720/2017 — తేది : -08-2017

యాదాద్రి భువనగిరి జిల్లా, ఎం. తుర్కపల్లి మండలములోని తుర్కపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 42–37 గుంటల భూమి ప్రజా ప్రయోజనాల నిమిత్తం అనగా, **కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద** కి.మీ. 31.550 నుండి 33.000 వరకు **గ్రావిటి కాలువ త్రవ్వకము** కొరకు తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు అవసరమున్నదని భావించినందున, భూసేకరణకై ఇట్టి ప్రకటన జారీచేయనైనది. ఇట్టి విషయమై భూసేకరణ చట్టం 2013 సెక్షన్ 11(1) ప్రకారం ప్రాథమిక ప్రకటన ఫారం–6 జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి ఉత్తర్వు నెం. **G1/1434/2017** తేది : 11–05–2017తో తేదీ 24–05–2017న ఆంధ్రజ్యోతి మరియు జనం సాక్షి తెలుగు పత్రికలలో మరియు జిల్లా గజిట్ నెం. 35/2017 తేది 11–05–2017ల యందు ప్రకటించనైనది.

అందువలన తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన ప్రాజెక్టు కొరకు **యాదాద్రి భువనగిరి జిల్లా, ఎం.తుర్కపల్లి మండలములోని తుర్కపల్లి గ్రామములో** విస్తీర్ణం **ఎ. 42–37 గుంటల** భూమి / హెక్టార్ల నిర్దిష్ట కొలతలు ఈ దిగువ చూపిన వివరాలతో యున్న భూములు భూసేకరణ చేయుటకు ప్రతిపాదించనైనది.

షెడ్యూలు

గ్రామము : తుర్కపల్లి — మండలం : ఎం. తుర్కపల్లి — జిల్లా : యాదాద్రి భువనగిరి
కాలువ : కాళేశ్వరం ప్రాజెక్ట్ క్రింద గ్రావిటి కెనాల్ — కి.మీ. 31.550 నుండి 33.000 వరకు

క్ర.సం.	సర్వే నెం.	భూమి రకం (ఖుష్కి/తరి)	భూమి విధం (పట్టా/ప్రభుత్వ/ఇనాం)	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టా దారులు	అనుభవ దారులు	చెట్లు రకం/సంఖ్యా / ఇండ్ల రకం	తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం
1.	76	ఖుష్కి	పట్టా	0-08	బోయిని రాములు తండ్రి బాలయ్య; బోయిని బిక్షపతి తండ్రి కిష్టయ్య; బోయిని అనసూయ భర్త అంజయ్య	బోయిని రాములు తండ్రి బాలయ్య; బోయిని బిక్షపతి తండ్రి కిష్టయ్య; బోయిని అనసూయ భర్త అంజయ్య; పోడి వివరములు		77 83	84	75	84 85
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
					బేగరి రామయ్య (ఎల్లయ్య)	-					
					కుమ్మరి రామచంద్రయ్య (నర్సయ్య)	కుమ్మరి రామచంద్రయ్య (నర్సయ్య)					
					కుమ్మరి బాలనర్సయ్య (నర్సయ్య)	కుమ్మరి బాలనర్సయ్య (నర్సయ్య)					
					కుమ్మరి బాలనర్సయ్య (ఉషయ్య)	కుమ్మరి బాలనర్సయ్య (ఉషయ్య)					
					కుమ్మరి రాములు (ఉషయ్య)	కుమ్మరి రాములు (ఉషయ్య)					
					వడ్ల నర్సయ్య (లక్ష్మయ్య)	ఆకుల బాలరాజు ఆకుల యాదగిరి					
					గంగాదరి బాలనర్సయ్య (ఉషయ్య)	గంగాదరి బాలనర్సయ్య (ఉషయ్య)					
					గంగాదరి రాములు (ఉషయ్య)	గంగాదరి రాములు (ఉషయ్య)					
						పోడి వివరములు					
						ప్రభుత్వ భూమి (0-06)					
			మొత్తం	42-37							

ఇట్టి ప్రకటన భూసేకరణ, నష్టపరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం) చట్టం 2013 (కేంద్ర చట్టం నెం.30/2013)కు సవరించబడిన తెలంగాణ చట్టం భూసేకరణ, నష్ట పరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధికల్పన (సవరణ తెలంగాణ చట్టం–2016 (చట్టం21/2017) లోని సెక్షన్ 11(1) లో గల అంశాల ప్రకారము ఎవరికి సంబంధించినదో వారికి చెందును.

సదరు భూములకు సంబంధించిన నక్షాను **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి** మరియు **రాజస్వ మండలాధికారి, భువనగిరి** కార్యాలయములందు ఉంచడమైనది. వాటిని ఏదైనా పనిదినములలో పనివేళల యందు తనిఖీ చేసుకొనవచ్చును. **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, రాజస్వ మండలాధికారి, భువనగిరి గారిని** మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ప్రవేశించి సర్వే చేసి భూమి కొలతలు తీసుకొనుటకు, భూమి మట్టము తెలిసికొనుటకు/భూమిని త్రవ్వటానికి, బోర్లు వేయడానికి కేటాయించిన పనులను మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి ఇందుమూలముగా అధికారము ఇచ్చినారు.

సెక్షను 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి** అనుమతి లేకుండా ప్రకటన జారీచేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

సెక్షన్ (15) ప్రకారం ఇట్టి ప్రకటన జారీ తర్వాత పైన చూపించిన భూములలో ఏలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా భూసేకరణపై అభ్యంతరములు మరియు ఇట్టి ఆసక్తి/ప్రభావితం గల వ్యక్తులు నష్టపరిహారం సంప్రదింపుల ద్వారా ఒప్పందం చేసుకొనుటకు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి (60 దినములలో **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి / భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, భువనగిరి గార్లకు** వారి అభ్యంతరాలను దాఖలు చేసుకొనవచ్చును.

సం/–	సం/–	సం/–
రాజస్వమండలాధికారి భువనగిరి	జాయింట్ కలెక్టర్ యాదాద్రి భువనగిరి	జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO No.1564/LA/PP/2017-18



పంచలోహ విగ్రహాల అపహరణ

700 ఏళ్ల నాటివి.. • విలువ రూ. కోటిపైనే
వేణుగోపాలస్వామి ఆలయంలో ఘటన

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రంలో సుమారు 700 ఏళ్ల నాటి పంచలోహ విగ్రహాలు శనివారం సాయంత్రం అపహరణకు గురయ్యాయి. జిల్లా కేంద్రంలోని పెద్దబజార్‌లో గల వేణుగోపాలస్వామి (శ్రీకృష్ణుడు) ఆలయానికి దాదాపుగా 700 ఏళ్ల చరిత్ర ఉంది. శనివారం సాయంత్రం ఆలయ ప్రధాన పూజారి పక్కనే ఉన్న తన ఇంట్లోకి వెళ్లి వస్తానని గడియ వేసి వెళ్లాడు. కొద్దిసేపట్లో తిరిగి వచ్చేసరికి ప్రధాన విగ్రహాల ముందు ఉంచిన శ్రీ కృష్ణుడు, రుక్మిణి, సత్యభామల పంచలోహ విగ్రహాలు కనిపించకుండా పోయాయి. దుండగులు మరే వస్తువులను ముట్టుకోకుండా కేవలం పంచలోహ విగ్రహాలను మాత్రమే అపహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఆలయం చుట్టూ గృహాలు ఉన్నాయి. సాయంత్రం వేళ ఆలయంతో పాటు కాలనీలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో విగ్రహాలు అపహరణకు గురైన నేపథ్యంలో.. ఇది పక్కా ప్రణాళిక ప్రకారమే చేసి ఉంటారని భావిస్తున్నారు. చోరీకి గురైన విగ్రహాల బరువు 75 కిలోల వరకు ఉంటాయని స్థానికులు తెలిపారు. ఎస్పీ శ్వేత, డీఎస్పీ ప్రసన్నరాణి, సీఐ శ్రీధర్‌కుమార్ ఆలయానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్ బృందాన్ని తెప్పించి తనిఖీలు ప్రారంభించారు. అపహరణకు గురైన పంచలోహ విగ్రహాల విలువ బయట మార్కెట్‌లో కోటికి పైగా ఉండవచ్చని ఆలయాన్ని నిర్మించిన వారి వంశీయులు చెబుతున్నారు.



కల్లూరు అడవిలో చిరుత సంచారం

కల్లూరు రూరల్: ఖమ్మం జిల్లా కల్లూరు అటవీ ప్రాంతంలో చిరుత సంచారం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు చిరుత పాదముద్రలను సేకరించారు. ఈ అటవీప్రాంతంలో గతంలో పెద్ద పులితో పాటు చిరుతల సంచారం ఉండేది. ఇటీవల చేపట్టిన వన్యప్రాణుల గణనలో భాగంగా మాంసాహార జంతువుల పాదముద్రలను సేకరించకగా, పులిగుండం ప్రాంతంలో చిరుతల సంచారం ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిశీలన కోసం హైదరాబాద్‌కు పంపించనున్నారు. ఈ అడవిలో ఇతర శాఖాహార జంతువుల సంచారం ఉన్నట్లు గుర్తించారు. కాగా, పెద్దపులి సంచారానికి సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు లభించలేదని తెలుస్తోంది.

'బోయిన్‌పల్లే' మోడల్ ధర

- ఆ రేటుకే రైతులనుంచి కొనుగోలు
- 'మన కూరగాయల ప్రాజెక్టు' అమలుకు మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులోని మోడల్ ధరకు లేదా దానికి సమానంగా ఉన్న ఇతర మార్కెట్ల హోల్‌సేల్ ధరలకు రైతుల నుంచి కూరగాయలు కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ ఆదేశించింది. 'మన కూరగాయల ప్రాజెక్టు'పై వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి శనివారం మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రాజెక్టును గతంలో పూర్వ మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. ఆయా జిల్లాల్లో కూరగాయలు పండించే ప్రాంతాల్లో కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాంతోపాటు హైదరాబాద్‌లో అనేకచోట్ల రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేశారు. ఈ అనుభవంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రైతులకు నేరుగా మార్కెటింగ్ వసతి కల్పించడం, వారికి కూరగాయలపై ఆదాయాన్ని మరింత పెంచడం. అలాగే నాణ్యమైన కూరగాయలను అనువైన ధరలకు వినియోగదారులకు అందజేయడం. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలుచేస్తారు. ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఖరారు చేస్తారు. ఈ ప్రాజెక్టు మూడు దశల్లో ఉంటుంది. ఒకటి క్షేత్రస్థాయిలో కలెక్షన్ కేంద్రాలు, రెండు కూరగాయలు, పండ్లను గ్రేడింగ్ చేసేందుకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఆ తర్వాత రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా వినియోగదారులకు అందజేయడం. పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేస్తున్నందున సంబంధిత ప్రాజెక్టు భాగస్వామి ఐదు గ్రామాలకు మించి కూరగాయల ఏరియాను గుర్తించాలి. అలాగే రోజుకు ఒక మెట్రిక్ టన్ను సామర్థ్యం కలిగి ఉండాలి.

ఇండియా వండరర్స్


చివరి వికెట్ తీసిన తర్వాత భారత ఆటగాళ్ల విజయోత్సాహం

మూడో టెస్టులో 63 పరుగులతో భారత్ ఘన విజయం ● చెలరేగిన షమీ, బుమ్రా, ఇషాంత్ ● ఫిబ్రవరి 1 నుంచి వన్డే సిరీస్

అద్భుత అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టారు...
అరుదైన సందర్భాన్ని మధురంగా మార్చుకున్నారు...
ఏ మూలనో ఉన్న అపనమ్మకాన్ని పటాపంచలు చేస్తూ...
ప్రత్యర్థికి కొట్టినపిండిలాంటి పిచ్‌పై వారినే పడగొట్టారు...
విదేశీ గడ్డ మీద తమ సత్తాపై సందేహాలను తీరుస్తూ...
క్లిష్ట పరిస్థితులకు ఎదురొడ్డి మరీ జయకేతనం ఎగరేశారు...

జొహన్నెస్‌బర్గ్: వాండరర్స్ మైదానం మనకు మరోసారి అచ్చొచ్చింది. అందీ అందనట్లుగా ఊరిస్తున్న విజయాన్ని టీమిండియా నిజం చేసుకుంది. పచ్చిక పిచ్‌పై పేస్‌తో బెంబేలెత్తిద్దామని భావించిన ప్రొటీస్‌ను అదే పేస్‌తో బోల్తా కొట్టించింది. ప్రత్యర్థి ప్రతిఘటనతో ఒక దశలో చేజారుతుందేమో అనిపించిన మ్యాచ్‌ను తనవైపు తిప్పుకొని... సఫారీ గడ్డపై తొలి సిరీస్ క్లీన్‌స్వీప్ పరాభవాన్ని తప్పించుకుంది. మహమ్మద్ షమీ (5/28) నిప్పులు చెరిగే బంతులకు బుమ్రా (2/57), ఇషాంత్‌శర్మ (2/31)ల పదునైన బౌలింగ్ తోడవటంతో 241 పరుగుల లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 177కే ఆలౌటైంది. ఓపెనర్ ఎల్గర్ (86 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్), ఆపద్బాంధవుడు ఆమ్లా (52) పోరాడినా... తర్వాతి బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. దీంతో శనివారం ఇక్కడ ముగిసిన మూడో టెస్టులో భారత్ 63 పరుగుల తేడాతో గెలుపొందింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విలువైన పరుగులు చేయడంతో పాటు, నాలుగు వికెట్లు తీసిన భువనేశ్వర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' పురస్కారం దక్కింది. ఫిలాండర్ 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. రెండు జట్ల మధ్య ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 1న డర్బన్‌లో జరగనుంది.

ఎల్గర్, ఆమ్లా భయపెట్టారు...

శనివారం ఉదయం వర్షం కారణంగా అవుట్ ఫీల్డ్ తడిగా మారి మ్యాచ్ గంట ఆలస్యంగా మొదలైంది. ఓవర్‌నైట్ స్కోరు 17/1తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టును ఎల్గర్, ఆమ్లా నింపాదిగా నడిపించారు. పరుగులు చేయకున్నా... వికెట్ మాత్రం ఇవ్వలేదు. కొన్నిసార్లు ముందు రోజులాగే అనూహ్య బౌన్స్ అయినా పిచ్ మరీ అంత ఇబ్బందిగా ఏమీ కనిపించలేదు. దీనికితోడు బుమ్రా, షమీ సరైన లెంగ్త్‌లో బంతులేయలేకపోయారు. పిచ్‌ను రోలర్‌తో ఎక్కువగా తొక్కించడం కూడా బ్యాట్స్‌మెన్‌కు ఉపయోగపడింది. ఆమ్లా ఎప్పటిలాగే సాధికారికంగా కనిపించగా... ఎల్గర్ కిందామీద పడుతూనే నిలదొక్కుకున్నాడు. దక్షిణాఫ్రికా 69/1తో లంచ్‌కు వెళ్లింది. విరామం అనంతరం కూడా దక్షిణాఫ్రికా పట్టు కొనసాగింది. కొన్ని మంచి బంతులు పడినా అవేమీ వికెట్ ఇవ్వలేదు. ఈలోగా ప్రత్యర్థి స్కోరు 100కు చేరింది. ప్రధాన పేసర్లతో కాకపోవడంతో పాండ్యాను దించినా ఫలితం దక్కలేదు. అతడి బౌలింగ్‌లోనే బౌండరీతో ఎల్గర్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే... అతడి బౌలింగ్‌కు పిచ్ స్పందించిన తీరు చూశాక ఆశలు చిగురించాయి.

ఇషాంత్, బుమ్రా భళా...

మరోవైపు ఆమ్లా కూడా 50 దాటాడు. స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌తో పాటు ఆల్‌రౌండర్లు ఆడాల్సి ఉండటంతో సఫారీ జట్టు అప్పటికింకా పోటీలోనే ఉంది. అయితే... ఇక్కడే ఇషాంత్, బుమ్రా విజృంభించారు. ప్రధాన బ్యాట్స్‌మెన్ నలుగురినీ స్వల్ప వ్యవధిలో వెనక్కుపంపి భారత్‌ను గెలుపు దిశగా నడిపించారు. తొలుత ఇషాంత్ బంతిని ఫ్లిక్ చేయబోయి ఆమ్లా... పాండ్యాకు చిక్కాడు. దీంతో రెండో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఈ టెస్టులో ఇదే ఏకైక శతక భాగస్వామ్యం కావడం విశేషం. ఆ జట్టుకు పెద్ద షాక్ మాత్రం డివిలియర్స్ (6) నిష్క్రమణే. టీ బ్రేక్‌కు పది నిమిషాలు కూడా లేని సమయంలో బుమ్రా వేసిన అద్భుత బంతికి అతడు గల్లీలో రహానేకు క్యాచ్ ఇచ్చాడు. అప్పటికి జట్టు స్కోరు 131/3. జట్టును గెలిపించాల్సిన బాధ్యతను భుజాన మోస్తూ క్రీజులోకి వచ్చిన కెప్టెన్ డుప్లెసిస్ (2) ఘోరంగా విఫలమయ్యాడు. ఇషాంత్ బంతిని ఆడలేక బౌల్డయ్యాడు. డికాక్ (0) బుమ్రాకు వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. 124/1 నుంచి 145/5కు చేరిన ప్రొటీస్ ఆత్మరక్షణలో పడిపోయారు.

షమీ మ్యాజిక్...

క్రీజులో పాతుకుపోయిన ఎల్గర్ వికెట్ ఇవ్వడం లేదు. దీంతో పాటు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉండటంతో భారత్ విజయంపై ఏ మూలనో సందేహం. కానీ వాటన్నిటినీ ఛేదిస్తూ షమీ చెలరేగాడు. యార్కర్లతో ప్రొటీస్ లోయరార్డర్‌ను కకావికలు చేశాడు. అతడి ధాటికి ఫిలాండర్, ఫెలుక్‌వాయో, మోర్కెల్ ఖాతానే తెరవలేకపోయారు. వీరు ముగ్గురూ బౌల్డ్ అవడం గమనార్హం. ఈ మధ్యలో రబడ (0)ను భువీ వెనక్కుపంపాడు. చివరి వికెట్ మాత్రమే ఉన్న దశలో లాభం లేదని భావించి ఎల్గర్ సిక్స్; ఫోర్ కొట్టాడు. అయితే... ఇన్‌గిడిని (4)ని అవుట్ చేసిన షమీ ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అయిదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకుని భారత్‌కు గెలుపునందించాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187;
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 247.
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) పటేల్ (బి) షమీ 4; ఎల్గర్ నాటౌట్ 86; ఆమ్లా (సి) పాండ్యా (బి) ఇషాంత్ 52; డివిలియర్స్ (సి) రహానే (బి) బుమ్రా 6; డు ప్లెసిస్ (బి) ఇషాంత్ 2; డికాక్ ఎల్బీడబ్ల్యూ (బి) బుమ్రా 0; ఫిలాండర్ (బి) షమీ 10; ఫెలుక్‌వాయో (బి) షమీ 0; రబడ (సి) పుజారా (బి) భువనేశ్వర్ 0; మోర్కెల్ (బి) షమీ 0; ఇన్‌గిడి (సి) సబ్ (కార్తీక్) (బి) షమీ 4; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం: (73.3 ఓవర్లలో ఆలౌట్)** 177.
వికెట్ల పతనం: 1–5, 2–124, 3–131, 4–144, 5–145, 6–157, 7–157, 8–160, 9–161, 10–177.
బౌలింగ్: భువనేశ్వర్ 18–4–39–1, షమీ 12.3–2–28–5, బుమ్రా 21–3–57–2, ఇషాంత్ 16–3–31–2, పాండ్యా 6–1–15–0.

విదేశాల్లో ఇంకా ఆడగలం

మేం సవాల్‌ను స్వీకరించాం. కఠినమైన పిచ్‌పై మా కుర్రాళ్లు నాలుగు రోజులు అద్భుతంగా ఆడారు. మొదట బ్యాటింగ్ చేయడం కలిసొచ్చింది. రెండు టెస్టుల్లోనూ విజయానికి దగ్గరగా వచ్చాం. ఈసారి గెలిచాం. ప్రతిఘటనను ఊహించాం. ఆమ్లా, ఎల్గర్ అద్భుతంగా ఆడినా ఛేదన కష్టమే. ఒత్తిడిలో వికెట్లు పడిపోతుండగా పైచేయి సాధించలేరు. మేం పరుగులు ఇవ్వకపోవడమూ ఉపయోగపడింది. మా బౌలింగ్ పెద్ద సానుకూలాంశం. 60 వికెట్లు పడగొట్టడం అరుదు. టెస్టులు గెలవాలంటే బౌలర్లలో ఆత్మవిశ్వాసం ఉండాలి. బ్యాట్స్‌మెన్ మెరుగుపడితే విదేశాల్లో తరచూ విజయాలు సాధించగలమని నేను నమ్ముతున్నా. *–విరాట్ కోహ్లి, భారత కెప్టెన్*

బ్యాటింగ్‌ను ఆస్వాదించా

చాలా సంతోషంగా ఉంది. అవకాశం దొరికినప్పుడల్లా రాణించేందుకు ప్రయత్నించా. అది జట్టుకు సరైన సమయంలో మేలు చేసింది. టెస్టుల్లో బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తా. పిచ్ కఠినంగా ఉన్నా... సాధ్యమైన మేర నిలదొక్కుకోవాలని భావించా. అదృష్టవశాత్తు పరుగులు వచ్చాయి. కొన్ని బంతులు అసహజంగా లేచినా మొత్తమ్మీద ఇది అద్భుతమైన పిచ్. *–భువనేశ్వర్, భారత పేసర్*

భారత్ అద్భుతంగా ఆడింది

మేం అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయాం. బౌలింగ్‌లో స్థిరత్వం లోపించింది. ఫీల్డింగ్ సగటు స్థాయిలో ఉంది. బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్ ఇది. ఆమ్లా, ఎల్గర్ ఉదయం ఆడిన తీరు చూసి ఆశ్చర్యపోయాం. బంతి ఆలస్యంగా స్పందిస్తుందని పిచ్ చరిత్ర చూస్తే తెలుస్తుంది. అయినా సిరీస్ గెలుపుపై సంతోషంగా ఉన్నాం. ఈ టెస్టుకు ముందు 2–1తో సిరీస్ ముగుస్తుందని ఊహించను కూడా లేదు. భారత్ అద్భుతంగా ఆడింది. *–డు ప్లెసిస్, దక్షిణాఫ్రికా కెప్టెన్*

'ఫ్రీడమ్ ట్రోఫీ'తో టెస్టు సిరీస్ విజేత దక్షిణాఫ్రికా జట్టు



1 మూడు టెస్టుల సిరీస్‌లో ఇరు జట్లు 12 సార్లు కూడా ఆలౌట్ కావడం (మొత్తం 120 వికెట్లు) టెస్టు చరిత్రలో ఇది మొదటి సారి మాత్రమే.

2 విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో భారత్ ప్రత్యర్థి వికెట్లన్నీ కుప్పకూల్చడం ఇది రెండో సారి మాత్రమే. గతంలో 1986లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ ఆరు ఇన్నింగ్స్‌లలోనూ ప్రత్యర్థిని ఆలౌట్ చేసింది.

21 కెప్టెన్‌గా కోహ్లి విజయాల సంఖ్య. ధోని (27) తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు.

విజేత శ్రీలంక

ఫైనల్లో బంగ్లాపై గెలుపు ● ముక్కోణపు వన్డే టోర్నీ



ఢాకా: ముక్కోణపు వన్డే టోర్నీలో శ్రీలంక విజేతగా నిలిచింది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన తుది పోరులో లంక 79 పరుగులతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన లంకేయులు 50 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటయ్యారు. తరంగ (56), చండిమాల్ (45), డిక్‌వెలా (42) రాణించారు. బంగ్లా బౌలర్లలో రూబెల్ హుస్సేన్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాట్స్‌మెన్ సమష్టిగా విఫలమవడంతో బంగ్లా 41.1 ఓవర్లలో 142 పరుగులకే కుప్పకూలింది. మహ్మదుల్లా (76) పోరాడినా లాభం లేకపోయింది.

నంబర్‌వన్ నిలబడింది

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టెస్టులో అద్భుత విజయం సాధించిన భారత్ ఐసీసీ టెస్ట్ చాంపియన్‌షిప్ గదను తిరిగి దక్కించుకోనుంది. గదతో పాటు టెస్టు ర్యాంకింగ్స్‌లో ఏడాది పాటు నెంబర్ వన్‌గా ఉన్నందుకు మిలియన్ డాలర్ల నగదు బహుమతిని కూడా సొంతం చేసుకోనుంది. టెస్టు చాంపియన్‌షిప్ గద దక్కించుకోవడం కోహ్లిసేనకు ఇది వరుసగా రెండోసారి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు భారత్ మొదటి స్థానంలోనే కొనసాగుతోంది. సఫారీల సిరీస్‌కు ముందు 124 పాయింట్లతో ఉన్న టీమిండియా... సిరీస్‌ను 1–2తో కోల్పోయి ప్రస్తుతం 121 పాయింట్లతో ఉంది. మార్చిలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల మధ్య జరిగే మూడు టెస్టుల సిరీస్‌ను సఫారీలో 3–0తో దక్కించుకున్నా... టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్ స్థానానికి ముప్పుండదు. దీంతో ఈ ఏడాది కూడా టెస్ట్ చాంపియన్‌షిప్ గద మనకే దక్కనుంది.

ఆమ్లా వికెట్‌తోనే విజయానికి బాటలు

సునీల్ గావస్కర్

వాండరర్స్ పిచ్ స్పందించిన తీరు చూస్తోంటే 1969లో భారత్– ఆస్ట్రేలియాల మధ్య జరిగిన ఓ మ్యాచ్ గుర్తుకొస్తుంది. బిల్ లారీ సారథ్యంలోని ఆసీస్ ఆసమయంలో భారత్‌లో పర్యటించింది. ఫిరోజ్‌షా కోట్ల వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో పిచ్ ఇలాగే స్పందించడంతో మన స్పిన్నర్లు చెలరేగి కంగారూలను రెండో ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే కట్టడి చేసింది. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో భారత్ లక్ష్యం 190 పరుగులే. అయినప్పటికీ ఆసీస్ చేయితిరిగిన స్పిన్నర్లు ఆష్లే మల్లెట్, జాన్ గ్లెసన్... పేసర్లు గ్రాహం మెకంజి, అలన్ కొన్నోలీలను ఎదుర్కొని మ్యాచ్‌ను గెలవడం అంటే అద్భుతం చేయడమే అని భావించారు. కానీ తర్వాత పిచ్ సాధారణంగా మారిపోవడంతో భారత్ కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అవలీలగా విజయాన్నందుకుంది. భారత స్పిన్నర్లు సులువుగా రాణించిన అదే పిచ్‌పై, ఆష్లే మల్లెట్ బంతిని తిప్పడానికి అష్టకష్టాలు పడ్డాడు.

వాండరర్స్‌లో నాలుగోరోజు కూడా ఇదే జరిగింది. మూడో రోజు ప్రమాదకరంగా కనిపించిన పిచ్ నాలుగో రోజు అనూహ్యంగా తొలి సెషన్‌లో బ్యాటింగ్‌కు సహకరించింది. లంచ్‌కు ముందు వరకు కూడా వికెట్ తీయడం భారత బౌలర్లకు గగనమైంది. మన బ్యాట్స్‌మెన్ బంతి బంతికీ గాయపడ్డ పిచ్‌పై ఆమ్లా, ఎల్గర్ నింపాదిగా బ్యాటింగ్ చేశారు. వీరు పరుగులు చేస్తుంటే మన బౌలర్లు చేష్టలుడిగిపోయారు. ఇక్కడే ఆమ్లా గొప్పతనం కనిపిస్తుంది. పరుగే గగనంగా మారిన పిచ్‌పై అతను రెండు ఇన్నింగ్స్‌లలో రెండు అర్ధసెంచరీలు చేశాడు. ఎల్గర్ కూడా మరోసారి తన విలువేంటో చూపించాడు. ఆమ్లాకు చక్కగా సహకరిస్తూ విలువైన పరుగుల్ని జోడించాడు. టీ విరామానికి ముందు డివిలియర్స్, ఆమ్లాలను అవుట్ చేయడంతోనే భారత విజయానికి బాటలు పడ్డాయి.

కోట్లు కురిశాయి

ఐపీఎల్ 'బ్రాండ్' బాజా ఈ వేలంలోనూ మోగింది. నచ్చిన ఆటగాడిపై కోట్లు కురిపించేందుకు ప్రతీ ఫ్రాంచైజీ పోటీపడింది. ఎలాగైనా దక్కించుకోవాలన్న కసి వేలంపాటలో కనబడింది. అంతర్జాతీయ స్టార్లకు దీటుగా భారత ఆటగాళ్లకూ కళ్లు చెదిరే మొత్తం దక్కింది. అయితే సుడిగాలి ఇన్నింగ్స్‌లతో అలరించిన క్రిస్ గేల్‌కు తీవ్ర నిరాశే ఎదురైంది. రెండు సార్లు కోల్‌కతాను చాంపియన్‌గా నిలబెట్టిన గంభీర్‌కు నామమాత్రపు ధరే లభించింది. ఊహించని మొత్తాలతో కొందరు, అన్ సోల్డ్ జాబితాలో ఇంకొందరు ఎలాగోలా... ఐపీఎల్ వేలం ప్రక్రియలో హైలైట్‌గా నిలిచారు.

- జోరుగా సాగిన వేలం
- రూ.12.5 కోట్లకు రాజస్తాన్ వశమైన బెన్ స్టోక్స్
- రాయుడుకు రూ. 2.2 కోట్లు
- అయ్యో గేల్... అన్‌సోల్డ్!
- నేడూ సాగనున్న వేలం

బెంగళూరు: ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ మరోసారి ఐపీఎల్ వేలంలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యాడు. గతేడాదిలాగే ఈ ఏడాదీ ఫ్రాంచైజీలన్నీ వేలంలో అతనిపైనే గాలం వేశాయి. మొత్తానికి రూ.12.50 కోట్లతో రాజస్తాన్ వశమయ్యాడు స్టోక్స్. గతేడాది (రూ. 14.50 కోట్లు; పుణే)తో పోలిస్తే 2 కోట్లు తక్కువైనా... అప్పుడు ఇప్పుడు వేలంలో అగ్రస్థానం అతనికే లభించడం విశేషం.

స్టోక్స్ కోసం ముందుగా చెన్నై 'విజిల్ పాడు'అంది. పంజాబ్ వెంటనే కోట్ల పాటకు తెర తీసింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ (రూ 9.2 కోట్లు) కూడా మాకే కావాలంటూ పది కోట్లదాకా తీసుకొచ్చింది. ఇలా చూస్తుండగానే పంజాబ్ 11 కోట్లు... మరో ఫ్రాంచైజీ 12 కోట్లు... చివరకు రాజస్తాన్ రూ. 12.50 కోట్లంటూ ముగించింది. రాజస్తాన్ యాజమాన్యం రిటెయిన్ చేసుకున్న స్టీవెన్ స్మిత్... స్టోక్స్ కోసం అదేపనిగా పట్టుబట్టడంతో యాజమాన్యం కాదలేకపోయింది. స్మిత్ సారథ్యంలో రెండేళ్లు ఐపీఎల్‌లో ఉన్న రైజింగ్ పుణే తరఫున స్టోక్స్ విజయవంతం కావడం రాజస్తాన్ మొగ్గుచూపేందుకు కారణమైంది.



రాయుడు

ధావన్‌తో మొదలైందిలా...

బెంగళూరులోని ఓ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ వేలం ప్రక్రియ ముందుగా శిఖర్ ధావన్‌తో మొదలైంది. పంజాబ్ అతని కోసం రూ. 2 కోట్లతో పాట పాడగా... రాజస్తాన్ దక్కించుకునేందుకు పోటీ పడింది. ముంబై కూడా శ్రుతికలిపినప్పటికీ చివరకు పంజాబ్ సొంతమయ్యాడు ధావన్. అయితే వెంటనే అతను ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ సన్‌రైజర్స్ 'రైట్ టు మ్యాచ్' పాలసీతో ధావన్ (రూ.5.20 కోట్లు)ను తిరిగి పొందింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్

ఖర్చు చేసిన మొత్తం: 71.05 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: 7.95 కోట్లు.

1.	మనీశ్ పాండే	11.0 కోట్లు
2.	రషీద్ ఖాన్	9.0 కోట్లు
3.	శిఖర్ ధావన్	5.2 కోట్లు
4.	వృద్ధిమాన్ సాహా	5.0 కోట్లు
5.	సిద్ధార్థ్ కౌల్	3.8 కోట్లు
6.	దీపక్ హుడా	3.6 కోట్లు
7.	కేన్ విలియమ్సన్	3.0 కోట్లు
8.	సయ్యద్ ఖలీల్ అహ్మద్	3.0 కోట్లు
9.	షకీబుల్ హసన్	2.0 కోట్లు
10.	కార్లోస్ బ్రాత్‌వైట్	2.0 కోట్లు
11.	యూసుఫ్ పఠాన్	1.9 కోట్లు
12.	బాసిల్ థంపి	95 లక్షలు.
13.	టి. నటరాజన్	40 లక్షలు
14.	రికీ భుయ్	20 లక్షలు
15.	డేవిడ్ వార్నర్	12.5 కోట్లు
16.	భువనేశ్వర్	8.5 కోట్లు



రషీద్‌ఖాన్

గేల్ వైపు కన్నెత్తిచూడలేదు



గేల్

విధ్వంసకర ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరు క్రిస్ గేల్. సుడిగాలి మెరుపులతో ఐపీఎల్‌ను ఊపేసిన ఈ వెస్టిండీస్ స్టార్‌పై ఫ్రాంచైజీలన్నీ అనాసక్తి కనబరిచాయి. గతేడాది వైఫల్యం దరిమిలా పూర్తి మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కకపోవడం, ఫామ్ లేమి... వయసు పైబడటంతో 37 ఏళ్ల గేల్‌వైపు ఏ ఫ్రాంచైజీ కన్నెత్తి చూడలేదు. దీంతో జోరుగా సాగిన వేలంలో రూ. 2 కోట్ల బేస్‌ప్రైస్ కలిగిన అతను అన్‌సోల్డ్ (విక్రయించబడని) ఆటగాడిగా మిగిలిపోయాడు. ముంబై ఇండియన్స్ ఆల్‌రౌండర్ కీరన్‌పొలార్డ్ వేలంలో ఢిల్లీ డేర్ డెవిల్స్ సొంతం చేసుకోగా ముంబై రైట్ టు మ్యాచ్‌తో చేజిక్కించుకుంది. మెరుపులు మెరిపించే మ్యాక్స్‌వెల్ కోసం సన్‌రైజర్స్, రాయల్స్ నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. ఆర్‌సీబీ కూడా గళమెత్తినప్పటికీ చివరికి ఢిల్లీ సొంతమయ్యాడు మ్యాక్స్. కోల్‌కతాను రెండు సార్లు విజేతగా నిలిపిన విజయవంతమైన సారథి గౌతమ్ గంభీర్‌ను నామమాత్రమైన ధర (రూ. 2.8 కోట్లు)కే సొంత జట్టు ఢిల్లీ దక్కించుకుంది. యువరాజ్ తిరిగి పంజాబ్ గూటికి చేరాడు. ఐపీఎల్ ఆరంభ సీజన్‌లో అతను పంజాబ్ ఐకాన్ ప్లేయర్. ఇప్పుడు గంభీర్‌లాగే అతనూ సొంతజట్టు పంచన చేరాడు.



మలింగ

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

ఖర్చు చేసిన మొత్తం: 64.15 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: 15.85 కోట్లు.

1.	క్రిస్ వోక్స్	7.4 కోట్లు
2.	యజువేంద్ర చహల్	6 కోట్లు
3.	ఉమేశ్ యాదవ్	4.2 కోట్లు
4.	బ్రెండెన్ మెకల్లమ్	3.6 కోట్లు
5.	నవదీప్ సైని	3 కోట్లు
6.	క్వింటన్ డికాక్	2.8 కోట్లు
7.	గ్రాండ్‌హోమ్	2.2 కోట్లు
8.	మొయిన్ అలీ	1.7 కోట్లు
9.	మనన్ వోహ్రా	1.1 కోట్లు
10.	కుల్వంత్ ఖెజ్రోలియా	85 లక్షలు
11.	అనికేత్‌చౌదరి	30 లక్షలు
12.	విరాట్ కోహ్లి	17 కోట్లు
13.	డివిలియర్స్	11 కోట్లు
14.	సర్ఫరాజ్ ఖాన్	3 కోట్లు

కోల్‌కతా నైట్ రైడర్స్

ఖర్చు చేసిన మొత్తం: 72.4 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: 7.6 కోట్లు.

1.	క్రిస్‌లిన్	9.6 కోట్లు
2.	మిచెల్ స్టార్క్	9.4 కోట్లు
3.	దినేశ్ కార్తీక్	7.4 కోట్లు
4.	రాబిన్ ఉతప్ప	6.4 కోట్లు
5.	కుల్‌దీప్ యాదవ్	5.8 కోట్లు
6.	పియూష్ చావ్లా	4.2 కోట్లు
7.	నితీశ్ రాణా	3.4 కోట్లు
8.	కమలేశ్ నాగర్‌కోటి	3.2 కోట్లు
9.	శుభ్‌మాన్ గిల్	1.8 కోట్లు
10.	ఇషాంక్ జగ్గీ	20 లక్షలు
11.	సునీల్ నరైన్	12.5 కోట్లు
12.	రస్సెల్	8.5 కోట్లు

ఢిల్లీ డేర్‌డెవిల్స్

ఖర్చు చేసిన మొత్తం: రూ. 67.7 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: రూ. 12.3 కోట్లు.

1.	గ్లెన్ మ్యాక్స్‌వెల్	9.0కోట్లు
2.	రబడ	4.2 కోట్లు
3.	అమిత్ మిశ్రా	4.0 కోట్లు
4.	విజయ్ శంకర్	3.2 కోట్లు
5.	మొహమ్మద్ షమీ	3.0 కోట్లు
6.	రాహుల్ తేవటియా	3.0 కోట్లు
7.	గౌతమ్ గంభీర్	2.8 కోట్లు
8.	కొలిన్ మున్రో	1.9 కోట్లు
9.	జాసన్ రాయ్	1.5 కోట్లు
10.	పృథ్వీషా	1.2 కోట్లు
11.	అవేశ్ ఖాన్	70 లక్షలు
12.	హర్షల్ పటేల్	20 లక్షలు
13.	రిషభ్ పంత్	15 కోట్లు
14.	క్రిస్ మోరిస్	11 కోట్లు
15.	శ్రేయస్ అయ్యర్	7.0 కోట్లు

రాజస్తాన్ రాయల్స్

ఖర్చు చేసిన మొత్తం: రూ. 56.5 కోట్లు
చేతిలో ఉన్న మొత్తం: రూ. 23.5 కోట్లు

1.	బెన్ స్టోక్స్	12.5 కోట్లు.
2.	సంజు శామ్సన్	8.0 కోట్లు.
3.	జోఫ్రా ఆర్చర్	7.2 కోట్లు.
4.	జోస్ బట్లర్	4.4 కోట్లు.
5.	అజింక్యా రహానే	4.0 కోట్లు.
6.	డార్సి షార్ట్	4.0 కోట్లు.
7.	రాహుల్ త్రిపాఠి	3.4 కోట్లు.
8.	స్టువర్ట్ బిన్నీ	50 లక్షలు.
9.	స్టీవ్ స్మిత్	12.5 కోట్లు.

కింగ్స్ ఎలెవన్ పంజాబ్

ఖర్చు చేసిన మొత్తం: 58.1 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: 21.9 కోట్లు.

1.	కె.ఎల్ రాహుల్	11 కోట్లు
2.	అశ్విన్	7.6 కోట్లు
3.	స్టొయినిస్	6.2 కోట్లు
4.	అరోన్ ఫించ్	6.2 కోట్లు
5.	కరుణ్ నాయర్	5.6 కోట్లు
6.	డేవిడ్ మిల్లర్	3 కోట్లు
7.	అంకిత్ రాజ్‌పుత్	3 కోట్లు
8.	యువరాజ్ సింగ్	2 కోట్లు
9.	మయాంక్ అగర్వాల్	1 కోటి
10.	అక్షర్ పటేల్	12.5 కోట్లు

ముంబై ఇండియన్స్

ఖర్చు చేసిన మొత్తం: రూ. 64.2 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: రూ. 15.8 కోట్లు.

1.	కృనాల్ పాండ్యా	8.8 కోట్లు.
2.	ఇషాన్ కిషన్	6.2 కోట్లు.
3.	కీరన్ పొలార్డ్	5.4 కోట్లు.
4.	కమిన్స్	5.4 కోట్లు.
5.	సూర్యకుమార్ యాదవ్	3.2 కోట్లు.
6.	ముస్తాఫిజుర్ రహమాన్	2.2 కోట్లు.
7.	రోహిత్‌శర్మ	15.0 కోట్లు.
8.	హార్దిక్ పాండ్యా	11.0 కోట్లు.
9.	జస్‌ప్రీత్ బుమ్రా	7.0 కోట్లు.

చెన్నై సూపర్ కింగ్స్

ఖర్చు చేసిన మొత్తం: 63 కోట్లు.
చేతిలో ఉన్న మొత్తం: 17 కోట్లు.

1.	కేదర్ జాదవ్	7.8 కోట్లు
2.	డ్వేన్ బ్రేవో	6.4 కోట్లు
3.	కరణ్ శర్మ	5 కోట్లు
4.	వాట్సన్	4 కోట్లు
5.	అంబటి రాయుడు	2.2 కోట్లు
6.	హర్భజన్ సింగ్	2 కోట్లు
7.	డు ప్లెసిస్	1.6 కోట్లు
8.	ఇమ్రాన్ తాహిర్	1 కోటి
9.	రవీంద్ర జడేజా	7 కోట్లు
10.	ఎం.ఎస్ ధోని	15 కోట్లు
11.	సురేశ్ రైనా	11 కోట్లు

సూపర్ సైనా

- ఫైనల్‌కు చేరుకున్న హైదరాబాదీ
- ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

జకర్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెరుగైన క్రీడాకారులను చిత్తుచేస్తూ దూసుకెళ్తున్న హైదరాబాద్ స్టార్ ప్లేయర్ సైనా నెహ్వాల్ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సైనా 21–19, 21–19తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్)పై 48 నిమిషాల్లోనే విజయం సాధించింది. ఈ విజయంతో ముఖాముఖి రికార్డులో సైనా 9–5తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ నం.1 క్రీడాకారిణి తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో అమీతుమీ తేల్చుకుంటుంది. ముఖాముఖి రికార్డులో తై జు యింగ్ 5–8తో ఆధిక్యంలో ఉంది.



సాత్విక్ జోడి ఓటమి

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్– చిరాగ్ శెట్టి జోడీ పోరాటం సెమీస్‌లో ముగిసింది. సెమీఫైనల్లో సాత్విక్ సాయిరాజ్– చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 14–21, 11–21తో టాప్ సీడ్ మార్కస్ ఫెర్నాల్డి గిడియోన్ – కెవిన్ సంజయ సుకముల్జో (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

ఫైనల్లో భారత్



హామిల్టన్: నాలుగుదేశాల ఇన్విటేషనల్ హాకీ టోర్నమెంట్ రెండో అంచెలో భారత్ ఫైనల్‌కు చేరింది. శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జపాన్‌పై 4–2తో గెలుపొందింది. తొలి రెండు మ్యాచుల్లో న్యూజిలాండ్, బెల్జియంలను చిత్తు చేసిన భారత్ ఈ విజయంతో ఫైనల్లోకి అడుగుపెట్టింది. మన జట్టు తరఫున వివేక్‌సాగర్ ప్రసాద్ (12వ ని.లో), వరుణ్ కుమార్ (30వ ని.లో), మన్‌దీప్ సింగ్ (58వ ని.లో), రమణ్‌దీప్ సింగ్ (58వ ని.లో) తలా ఒక గోల్ నమోదు చేశారు. జపాన్ తరఫున సెరెన్ తనక (14వ ని.లో), షోతాయమడ (43వ ని.లో) చెరో గోల్ కొట్టారు. తొలి అంచె ఫైనల్లో బెల్జియం చేతిలో భంగపడ్డ భారత్ ఆదివారం జరిగే రెండో అంచె ఫైనల్లో మరోసారి బెల్జియంతో తలపడనుంది.

వోజ్నియాకి 'నంబర్‌వన్' ట్రోఫీ

- ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మహిళల టైటిల్ సొంతం
- ఫైనల్లో టాప్‌సీడ్ హలెప్‌పై గెలుపు
- కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్: కరోలిన్ వోజ్నియాకి... ఒకటా, రెండా ఏకంగా 11 ఏళ్ల పాటు గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం పరితపించింది. ఈ క్రమంలో రెండు సార్లు (2009, 2014 యూఎస్ ఓపెన్) టైటిల్ బరిలో నిలిచిన ఈ డానిష్ ప్రొఫెషనల్... గెలుపుదరిని మాత్రం చేరలేకపోయింది. కానీ ఈ సారి ఆరంభ గ్రాండ్‌స్లామ్‌లోనే విజృంభించింది. చాంపియన్‌షిప్ దక్కేదాకా పోరాడింది. చివరకు అనుకున్నది సాధించింది. విరామమెరుగని పోరాటంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల కిరీటాన్ని అందుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో డెన్మార్క్ స్టార్ వోజ్నియాకి 7–6 (7/2), 3–6, 6–4తో టాప్ సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా)పై చెమటోడ్చి నెగ్గింది. ప్రపంచ నంబర్‌వన్ హలెప్ తన స్థాయికి తగ్గ పోరాటంతో మెప్పించింది. తాజాగా నంబర్‌వన్ ర్యాంకును ఖాయం చేసుకున్న వోజ్నియాకి 2010 తర్వాత మళ్లీ అగ్రస్థానాన్ని చేరనుంది.



నిజంగానే కరోలిన్ వోజ్నియాకికి ఇది 'నంబర్‌వన్' ట్రోఫీ. 43 సార్లు గ్రాండ్‌స్లామ్ బరిలోకి దిగిన ఈ డెన్మార్క్ క్రీడాకారిణి ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ టైటిల్‌తో తొలిసారి ఓ మేజర్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. దీంతో పాటు డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానాన్ని ఖాయం చేసుకుంది. ఓవెన్‌ను తలపించిన వాతావరణంలో... ఒంట్లో సత్తువను పీల్చేస్తున్న వేడిలో... తుదికంటా పోరాడింది. నంబర్‌వన్ హలెప్‌పై టైటిల్ గెలిచేదాకా విశ్రమించలేదు. చివరకు టైటిల్‌తో 11 ఏళ్ల గ్రాండ్‌స్లామ్ పోరాటానికి విజయంతో తెరదించింది.

గెలిచేదాకా... నువ్వా నేనా...

హోరా హోరీగా సాగిన టైటిల్ పోరు సుమారు మూడు గంటల (2.49 ని.) పాటు జరిగింది. ఇద్దరు ప్రత్యర్థులు హోరాహోరీగా తలపడుతూనే కనిపించని మరో ప్రత్యర్థి (ఉష్ణోగ్రత)నీ ఎదుర్కొన్నారు. తొలి సెట్‌లో చక్కని శుభారంభంతో వోజ్నియాకి 3–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనంతరం హలెప్ కూడా దీటుగా పుంజుకోవడంతో రసవత్తర పోరు జరిగింది. బ్రేక్ పాయింట్లతో వోజ్నియాకి జోరుకు కళ్లెం వేసిన రొమేనియన్ స్టార్ ఈ సెట్‌ను టైబ్రేక్ దాకా తీసుకెళ్లింది. అక్కడ డెన్మార్క్ క్రీడాకారిణి సత్తాచాటడంతో 4–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం ఎదురులేని సర్వీస్‌లతో టైబ్రేక్‌ను 7–2తో ముగించింది. తొలి సెట్ పరాజయాన్ని పక్కనబెట్టి తాజాగా రెండో సెట్ ఆడిన హలెప్ అద్భుతమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. దీంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌ను తేల్చేందుకు మూడో సెట్ తప్పలేదు. ఈ సెట్‌లో మళ్లీ ఇద్దరు నువ్వానేనా అన్నట్లు తలపడటంతో 3–3 స్కోరు సమమైంది. వోజ్నియాకి బలహీనమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో తడబడటంతో 3–4తో వెనుకబడింది. ఈ దశలో ఫిజియోతో తన ఎడమ మోకాలికి మర్దన చేయించుకున్నాకే వోజ్నియాకి కోర్టులో చురుగ్గా కదంతొక్కింది. వేగవంతమైన సర్వీస్‌లతో వరుసగా రెండు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను, టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో హలెప్ 6 ఏస్‌లు సంధించగా, వోజ్నియాకి 2 ఏస్‌లు సంధించింది. ఇద్దరు ఐదేసి బ్రేక్ పాయింట్లు సాధించగా... వోజ్నియాకి 6 సార్లు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. హలెప్ మాత్రం ఒకసారే డబుల్ ఫాల్ట్ చేసింది.

నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్స్

ఫెడరర్ X సిలిచ్

మధ్యాహ్నం 2 గంటల నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

రాజస్తాన్ మ్యాచ్‌లు జైపూర్‌కు తిరిగొచ్చాయి

బెంగళూరు: కొన్ని సీజన్లుగా ఐపీఎల్ మ్యాచ్‌లకు దూరమైన జైపూర్ వేదిక మళ్లీ ఈ సీజన్ నుంచి ఆతిథ్యమిచ్చేందుకు ముస్తాబైంది. రాజస్తాన్ రాయల్స్ హోమ్ మ్యాచ్‌లు తిరిగి జైపూర్‌లోని సావాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో నిర్వహిస్తామని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి వెల్లడించారు. ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోడి చేతిలో ఉన్న రాజస్తాన్ క్రికెట్ సంఘం (ఆర్‌సీఏ)పై బోర్డు నిషేధం విధించడంతో 2014 నుంచి జైపూర్‌లో మ్యాచ్‌లు జరగడం లేదు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792